ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

17-9-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 227 పేజీలు: 10+4 వెల: 6.50

డెహ్రాడూన్‌లో భారీ వర్షాలు.. 10 మంది గల్లంతు

25న డొనాల్డ్ ట్రంప్‌తో పాక్ ప్రధాని భేటీ

5లో



## 15 నెలల్లో 122 భారీ ప్రాజెక్టులకు అనుమతి

### లండన్ రోడ్‌షోలో మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖలో నవంబర్ 14,15తేదీల్లో ఎపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ 2025లో పాల్గొనాల్సిందిగా గ్లోబల్ లీడర్లను ఆహ్వానిస్తూ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం రాత్రి లండన్‌లో హైప్రొఫైల్డ్ ఇన్వెస్టర్స్ రోడ్ షో నిర్వహించినట్లు సమాచారం. ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరక్టర్స్, పాల్ మాల్ కన్వెన్షన్ వేదికగా రాత్రి 7గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11.30గంటలకు) నిర్వహించే ఈ రోడ్ షోలో యుకె డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, టెక్ మహీంద్రా యూరప్ విభాగం ప్రెసిడెంట్ హర్షుల్ అస్నానీ, ఐసిఐసిఐ బ్యాంకు యుకె విభాగం సిఇఒ రాఘవ్ సింఘాల్, ఎపిఐఐసి వైస్ చైర్మన్ ఎండి అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఫండ్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్ కంపెనీలకు చెందిన 150మంది సిఇఓలు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొన్నట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు, గత 15నెలల కాలంలో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకుగల అవకాశాలను మంత్రి లోకేష్ ఈ సందర్భంగా వివరించినట్లు సమాచారం. గత 15నెలల కాలంలో ఆంధ్రప్రదేశ్ >>2

# 'స్వచ్ఛాంధ్ర' ఓ ఉద్యమం

### కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు

### రబీ సీజన్‌కూ పక్కా నీటి ప్రణాళిక

### లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

### యేటా రూ. 5 వేల కోట్ల ఎగుమతులు లక్ష్యం: ముఖ్యమంత్రి



మంగళవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల కోసం కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. స్వచ్ఛభారత్ కోసం ఏ జిల్లాలో అయినా పైలెట్ ప్రాజెక్టుగా కార్యక్రమాలు చేపడితే అది రాష్ట్రమంతా వర్తింప చేయండి, ఏటి కొప్పాక, కొండపల్లి బొమ్మలు మన సంస్కృతీ సంప్రదాయం, ఆ వృక్షాలు పెంచడానికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద ఘన వ్యర్ధాల షెడ్ల నిర్మాణానికి కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మంగళవారం రెండో రోజు కలెక్టర్ల సదస్సులో స్వచ్ఛాంధ్ర, అటవీ, మున్సిపల్, పంచాయితీరాజ్ తదితర శాఖలపై జరిగిన సమీక్షలో గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో వెదురుతో చేసే ఉత్పత్తుల కోసం ఓ కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. వెదురు ఉత్పత్తులు చేసేవారికి వెదురును సరఫరా చేసేలా చూడాలని కలెక్టర్లకు సూచనలు చేసారు. చేతి వృత్తులు, కులవృత్తులు దెబ్బతినకుండా కాపాడాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం సమయంలో కాలువల కోసం మళ్లీ తవ్వకుండా పైపులైన్లు పెట్టేలా ఎస్ఒపి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అర్బన్ సౌకర్యాలతో మోడల్ పంచాయితీలుగా తీర్చిదిద్దాలన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌ను ఓ ఉద్యమంగా రాష్ట్రంలో చేస్తున్నామన్నారు. సింగపూర్ విధానాలను పరిశీలించి ఉమ్మడి రాష్ట్రంలో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆ తర్వాత క్లీన్ అండ్ గ్రీన్ పచ్చదనం పరి >>2

వివేకా హత్యకేసు

# నిందితులకు ఊరట

### బెయిలు రద్దులో జోక్యం చేసుకోలేమన్న సుప్రీం కోర్టు

### ట్రయల్ కోర్టుకు వెళ్లాలని వైఎస్ సునీతకు సూచన

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుల బెయిల్ రద్దు అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. నిందితుల బెయిల్ రద్దు అంశంలో ఇప్పుడు జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితుల బెయిల్ రద్దుతో పాటు దర్యాప్తును కొనసాగించడానికి ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని పిటిషనర్ వైఎస్ సునీతకు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. మరింత సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని వైఎస్ సునీతతరపు లాయర్ కోరారు. అయితే సిబిఐ ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసిందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. అంతకు ముందు సిబిఐ తరపు లాయర్.. కోర్టు ఆదేశిస్తే.. దర్యాప్తు కొనసాగిస్తామని తెలిపింది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మొత్తం 8 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, ఎర్ర గంగి రెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి, వి. రాజశేఖర్ రెడ్డిలను అరెస్టు చేశారు. వీరంతా బెయిల్ పై బయటకు వచ్చారు. అవినాష్ రెడ్డి మినహా అందరూ జైల్లో కొంత కాలం గడిపిన తర్వాత బెయిల్ వచ్చింది. అయితే అవినాష్ రెడ్డికి మాత్రం అరెస్టు చేసిన విషయం కూడా తెలియకుండానే బెయిల్ వచ్చేసింది. హైకోర్టు అరెస్టు చేసినా వెంటనే బెయిల్ >>2

## చర్చలకు సిద్ధం

### ఆయుధాలు వదిలేస్తాం

### నెలరోజులు ఎన్‌కౌంటర్లు ఆపండి

### ప్రధాని, అమిత్‌షాకు మావోయిస్టుల లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** మావోయిస్టులు సంచలనప్రకటనచేశారు. తాము ఆయుధాలు వదిలి పెడతాం, ఓ నెల రోజుల పాటు యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ ఆపండి అంటూ ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రికి లేఖలు రాసినట్లు వెల్లడించింది. మంగళవారం రాత్రి ఈ మేరకు మావోయిస్టుల అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఓ ప్రకటన విడుదల చేసింది. తాము ఆయుధాలు వదిలేస్తున్నామని అమిత్‌షాకు లేఖలో పేర్కొ >>2

## అమెరికాతో వాణిజ్య చర్చలు సానుకూలం!

### 50 శాతం సుంకాలపై ఉభయ ప్రతినిధుల మధ్య సుదీర్ఘ భేటీ

### మోడీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా: ట్రంప్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** భారత్ అమెరికాలమధ్య జరగాల్సిన వాణిజ్య ఒప్పందంకోసం రెండువైపులా చర్చలు సామరస్యవాతావరణంలో జరుగుతున్నాయని ఇరుదేశాలప్రతినిధులు పేర్కొన్నారు. అమెరికా ట్రేడ్ ప్రతినిధి బ్రెండన్ లించ్ ఢిల్లీలో వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌తో సమావేశం అయ్యారు. 50శాతం సుంకాలపైనా కూడా చర్చలు జరిగాయి. ఫిబ్రవరివరకూ ఐదు విడతలుగా జరిగిన చర్చలు ఆగస్టు 25న జరగాల్సి ఉండగా ఈలోపు సుంకాల వివాదంలో నిరవధిక వాయిదా పడ్డాయి. తిరిగి ట్రంప్ పాలనపగ్గాలు చేపట్టాక ముందు 25శాతం సుంకాలువిధించి రష్యా చమురు కొనుగోలుచేస్తున్నామని మరో 25 శాతం సుంకాలు వేయడంతో చర్చలు మళ్లీ >>2

## డంప్ యార్డులో పారవేస్తున్న ఉల్లి

### మార్కెట్ యార్డు నుంచి ఎత్తుకెళ్తున్న స్థానికులు



### రైతులందరికీ దక్కని ప్రభుత్వ మద్దతు ధర

### మార్కెట్ యార్డ్ నిర్వాహకుల వైఫల్యమే కారణమా?

**కర్నూలు, సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** రైతన్న చెమటోడ్చి పండించిన ఉల్లి పంటలో అధిక భాగం డంపు యార్డ్‌కు చేరుతోంది. అంతేకాక మార్కెట్ యార్డ్‌లో ప్రజలు ఉచితంగా తీసుకెళ్తున్నారు. మరి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నప్పటికీ ఈ సమస్యలు ఎందుకు వస్తున్నాయి.. అదే మార్కెట్ యార్డ్ నిర్వహణ వైఫల్యం... అక్షరాల మార్కెట్ యార్డ్ అధికారులు ఉల్లి పంట కొనడం, అమ్మడంలో పూర్తిగా వైఫల్యం అయ్యారని చెప్పవచ్చు. కర్నూలు మార్కెట్ యార్డ్ కు భారీ ఎత్తున ఉల్లిగడ్డలు వస్తున్నాయి. రైతులు తెస్తున్న ఆ పంటను సకాలంలో కొనడం, ఇతర ప్రాంతాలకు తరలిం చడంలో మార్కెట్ కమిటీ అధికారులు విఫలమయ్యారు. ఏదిఏమైనా ధర పడిపోవడంతో ప్రభుత్వం స్పందించి సకాలంలో క్వింటాలుకు రూ.1200 ధర నిర్ణయించింది. అయినప్పటికీ కొందరు రైతులకు ఆ మద్దతు ధర కూడా అందడంలేదు. మార్కెట్‌కి వచ్చిన పంటను కొనడంతో పాటు అమ్మడంలో కూడా మార్కెట్ అధికారులు కీలకపాత్ర వహించాలి. కానీ ఇక్కడ ఏజెంట్లు, అధికారులు విఫలం అవ్వడంతో ప్రభుత్వ ధనంతో కొంటున్న ఉల్లిగడ్డలు మార్కెట్ యార్డులో నిలిచిపోవడం..తర్వాత కుళ్లిపోవడం.. ఆపై డంపింగ్‌యార్డుకుచేరడం జరుగుతుంది. ఇక మార్కెట్ యార్డులోకి వచ్చిన ఉల్లిగడ్డలను గ్రేడింగ్‌మేరకు ఏజెంట్లు ధర నిర్ణయించి తీసుకుంటున్నారు. అయితే ఏజెంట్ 1200రూపాయల ధరకన్నాతక్కువఇస్తే.. మిగిలినమొత్తాన్ని ప్రభుత్వంరైతుకు అందిస్తుంది.

# బ్రహ్మోత్సవాల్లో ఇస్రో సేవలు

### తొలిసారి శాటిలైట్ ఆధారంగా భక్తుల గణన

### దళిత వాడల్లో ఆలయాల నిర్మాణం : టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు తదితరులు

**తిరుమల,సెప్టెంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది దేవదేవుని బ్రహ్మోత్సవాలకు ఇస్రో సహకారం తీసుకుని, శాటిలైట్ ఆధారంగా భక్తుల సంఖ్యను గణన చేసేందుకు చర్యలు చేపట్టామని టిటిడి ధర్మకర్తల మండలి చైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. తొలిసారిగా చేపడుతున్న ఈ ప్రక్రియతో నిర్ధిష్టంగా బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో ఎంత మంది భక్తులు ఉన్నారు,మాఢవీధుల్లో ఎంతమంది వాహనసేవలు వీక్షిస్తున్నారనే విషయంస్పష్టంగా తెలుస్తుందన్నారు. సనాతన హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా మతమార్పిడులను పూర్తిగా అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని దళితవాడల్లో వెయ్యి ఆలయాలు నిర్మాణం చేపడతామని చైర్మన్ తెలిపారు. హిందూ ధార్మికసంస్థ టిటిడిపై పని గట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి,చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చైర్మన్ బిఆర్‌నాయుడు హెచ్చరించారు.

ఈ అంశంపై బోర్డు కూడా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. వారంరోజుల్లో తిరుమలలో మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, టిటిడి చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ధర్మకర్తలమండలి సమావేశం జరిగింది. చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన నాలుగుగంటలపాటు సాగిన ఈ బోర్డులో చర్చించి తీసుకున్న నిర్ణయాలను టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులతో కలసి మీడియాకు వెల్లడించారు. ఈనెల 24 నుండి అక్టోబర్ 2వరకు జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులరద్దీని అంచనావేసేందుకు ఇస్రో సహకారం తీసుకుంటున్నామన్నారు. గరుడసేవజరిగే 28వతేదీ తిరుమల ఆలయ మాడ వీధులతోబాటు తిరుమలకొండపై భక్తులరద్దీని గణనచేయనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులను విశేషంగా ఆకట్టుకునేందుకు పుష్పాలంకరణలు, వివిధ దేవతామూర్తుల ఆర్చిలు, ఎల్ఇడి తోరణాలు, పెద్దస్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు మంగళవారం జరిగిన ధర్మకర్తలమండలి సమావేశంలో దేశవ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు, ఆలయాల నిర్మాణాలకు నిధులు మంజూరుచేస్తూ బోర్డు తీర్మానించింది.. కర్నాటక రాష్ట్రం బోలగావిలోని కోలకొప్పగ్రామంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు ఆమోదించారు. గుంటూరుజిల్లా తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 7.20కోట్ల రూపాయలతో రాజగోపురం, శ్రీసుబ్రమణ్య స్వామికి ఆభరణాలు, ఆలయంలో తాగునీటి సౌకర్యం,ఆర్చి,మరుగుదొడ్లు అభివృద్ధి కార్యక్రమాలకు దశలవారీగా చేపట్టేందుకు నిర్ణయించారు. అన్నమయ్యజిల్లా వాల్మీకిపురంలోని పట్టాభిరామ స్వామి ఆలయ పుష్కరిణి, కల్యాణవేదిక మండపం, రాజగోపురం,ఆర్చి, కల్యాణ మండపం తదితర అభివృద్ధి పనులకు 5.73కోట్లు రూపాయలు, తరిగొండలోని లక్ష్మీనరసింహస్వామి పుష్కరిణి పున:నిర్మాణానికి 1.50కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు నిర్ణయించారు.

# మోడీ నియంత్రణలో ఇసి

### పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల



**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం జరుగుతుందని ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వెల్లడించారు. ఆ మేరకు ఆమె వీడియో ప్రకటన మంగళవారం విడుదల చేసారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) పనితీరుపై సంచలన ఆరోపణలు చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతిలో బందీగా మారిందని, బిజెపికి ఎన్నికల ఏజెంట్‌గా పనిచేస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఇసి, పూర్తిగా బిజెపి ప్రయోజనాల కోసం పనిచేస్తోందని షర్మిల ఆరోపించారు. కేవలం ఎన్నికల సంఘమే కాకుండా సిబిఐ, ఇడి, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ ప్రధాని మోడీ గుప్పిట్లో ఉన్నాయని, ఆయన ఆదేశాల మేరకే పనిచేస్తున్నాయని విమర్శించారు. ఈ వాస్తవాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజల ముందు ఉంచారని, ఇది నేటి భారత ప్రజాస్వామ్య దుస్థితికి నిదర్శనమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, దేశంలో జరుగుతున్న ఓట్ల అవకతవకలకు సంబంధించి కొన్ని ఉదాహరణలను ఆమె ప్రస్తావించారు. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గంలో ఏకంగా లక్ష దొంగ ఓట్లను నమోదు చేశారని, అవన్నీ నకిలీఫోటోలు, పేర్లు, చిరునామాలతో సృష్టించినవేనని ఆమె ఆరోపించారు. అదేవిధంగా, మహారాష్ట్ర ఎన్నికల సమయంలో పోలింగ్ చివరి గంటలో, అంటే సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య, అనూహ్యంగా 60 లక్షలకు పైగా ఓట్లు పోల్ అయ్యాయని, ఆ ఓట్లు ఎవరు వేశారో చెప్పడానికి ఇసి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఆమె దుయ్యబట్టారు.

ఎన్నికలకు కేవలం ఐదు నెలల ముందు కోటికి పైగా కొత్త ఓట్లు నమోదు కావడం వెనుక పెద్ద కుట్ర ఉందని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తూ, వారికి అనుకూలంగా దొంగ ఓట్లను చేర్చడం ద్వారా ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. ఈ ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పోరాటానికి సిద్ధమైందని తెలిపారు.

ఈ పోరాటంలో భాగంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలందరూ ఇందులో పాల్గొని తమ మద్దతు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## పంటల ధరల పతనంలో చంద్రబాబు రికార్డు: జగన్

**విజయవాడ,సెప్టెంబరు17,ప్రభాతవార్తప్రతినిధి:** పంటల ధర పతనంలో సిఎం చంద్రబాబు రికార్డు సాధించారని మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శించారు. మంగళవారం 'ఎక్స్'లో ఈ మేరకు పోస్ట్ చేశారు. కర్నూలులో కిలో ఉల్లి మూడు రూపాయలని, కిలో టమోటా రూపాయిన్నరని, ధరలు ఇలా ఉంటే రైతులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. క్వింటా ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేస్తామని ప్రకటనల మీద ప్రకటనలు చేశారని, కర్నూలు మార్కెట్లో వేలం వేయించి ఎవరూ కొనడం లేదని చెప్పడానికిచేసిన ప్రయత్నం తప్ప మరొకటి కాదని అన్నారు. ఉల్లికి ధర లేదని చెబుతున్నారని, ఆన్‌లైన్ స్టోర్లలో కిలో ఉల్లి రూ.29 నుంచి రూ.32 వరకూ ఉందని వివరించారు. రైతు బజార్లోనూ కిలో రూ.25కు తక్కువ అమ్మడం లేదని, మరి రైతులకు ధర ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. వారిని ఆదుకునేందుకు కనీస దృష్టి పెట్టకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. టమోటా ధరలు దారుణంగా పడిపోయినా పట్టించుకోవడం లేదని, కొనేవారు లేక రోడ్డుపై పారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రైతుల పంటలు కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలని ఆయన సిఎంకు సూచించారు.

## డ్రగ్స్ అక్రమరవాణాలోని విదేశీయుల గెంటివేత

### 16 వేల మందిని స్వదేశాలకు పంపిస్తున్న హోంశాఖ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 16:** మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడిన విదేశీయులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. దేశంలో డ్రగ్స్ కేసుల్లో పట్టుబడి, నిర్బంధ కేంద్రాల్లో ఉన్న సుమారు 16వేల మంది విదేశీయులను స్వదేశాలకు పంపించేందుకు కేంద్ర హోం వ్యవహారాల శాఖ సిద్ధమైంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఎన్సీబీ సమర్పించిన ఒక సమగ్ర నివేదిక ఆధారంగా కేంద్ర హోం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో పెద్ద సంఖ్యలో విదేశీయులు పాల్గొంటున్నారని వీసా నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా దేశంలో ఉంటున్నారని ఎన్సీబీ నివేదించింది. ఈ నివేదిక ప్రకారం విదేశీయులు మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌తో పాటు వాటిని వివిధ ప్రాంతాలకు రవాణా చేయడంలో కూడా చురుకుగా పాలుపంచుకున్నారని తేలింది. వీరందరినీ వివిధ రాష్ట్రాల్లోని డిటెన్షన్ కేంద్రాల్లో ఉంచారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త వలస చట్టం ప్రకారం ఈ పౌరులను వెనక్కి పంపించే ప్రక్రియను చేపడుతున్నారు. ఈ కొత్త చట్టం మాదకద్రవ్యాల స్మగ్లింగ్ వంటి దేశ భద్రతకు ముప్పు కలిగించే తీవ్రమైన నేరాలకు పాల్పడిన విదేశీయులను వెనక్కి పంపించడానికి కఠినమైన నిబంధనలను కలిగి ఉంది. అంతేకాకుండా నకిలీ పత్రాలతో లేదా వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలో ఉంటున్నవారిపైనా ఈ చట్టం కింద చర్యలుతీసుకోవచ్చు. ఈ చట్టంరాకతో దేశం నుంచి అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను వెనక్కి పంపే ప్రక్రియ మరింత సులభతరం అయింది. తొలి దశలో పంపించనున్న విదేశీ యుల జాబితాను హోం మంత్రిత్వ శాఖ, ఇతర సంబంధిత ఏజెన్సీలకు ఇప్పటికే అందజేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్, మయన్మార్, మలేషియా,ఘనా, నైజీరియా వంటి దేశాలకుచెందిన పౌరులు ఉన్నట్లు సమాచారం. దేశఅంతర్గత భద్రతకు, ప్రజల ఆరోగ్యానికి డ్రగ్స్ వల్ల ఏర్పడుతున్న ముప్పును నియంత్రించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి అక్రమంగా డ్రగ్స్ తెచ్చి ఇక్కడ యువతను వాటికి బానిసలుగా మారుస్తున్న ముఠాలపై ఈ చర్య ఒక బలమైన హెచ్చరికగా నిలవనుంది.



మారిషస్ ప్రధాని డా. నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ దృశ్యం

# 'స్వచ్ఛాంధ్ర' ఓ ఉద్యమం

>> శుభ్రం పేరిట కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్వచ్ఛత అంటే క్లీన్లినెస్ ఒక్కటే కాదు ప్రజల థింకింగ్ ప్రాసెస్ కూడా మారాలన్నారు. ఇంట్లో చెత్తను రోడ్డు బయట వేయటం కొందరికి అలవాటన్నారు. అలాగే డ్రెయిన్స్‌లో చెత్తవేయటం వల్ల అవి అడ్డుపడి నీటి ప్రవాహానికి అడ్డుపడుతుందన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సిసి రోడ్లు ఉన్నా డ్రెయిన్లు సరిగ్గా లేవన్నారు. మేజిక్ డ్రైన్ల నిర్మాణం చేపట్టాలి. చాలా చోట్ల మరుగుదొడ్లులేవు. వాటి వాడకంకూడా జరగటం లేదు పంచాయితీల్లో పిట్స్ ను ఎప్పటికప్పుడు క్లీన్ చేసేలా చూడాలి. అత్యవసర పనులకు నిధులు తక్షణం మంజూరు చేస్తామన్నారు. కార్యాలయాలు, ప్రాంగణాలు శుభ్రంగా ఉండాలని మంత్రులు, అధికారులు, కలెక్టర్ కార్యాలయాలకు ఆదేశాలు జారీచేశారు. నెట్ జీరో, వేస్ట్ టూ వెల్త్ కాన్సెప్టుతో పనిచేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

**క్వాంటం వ్యాలీ, వాట్సప్ గవర్నెన్స్, డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్‌అవేర్ 2.0 అంశాలపై సమీక్ష..**

క్వాంటం వ్యాలీ, వాట్సప్ గవర్నెన్స్, డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్‌అవేర్ 2.0 అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పాలనలో టెక్నాలజీ వినియోగంపై జిల్లా కలెక్టర్లకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసారు. కలెక్టర్ల సదస్సులో క్వాంటం వ్యాలీ భవనాల డిజైన్లను సీఎం చంద్రబాబు ప్రదర్శించారు. కార్యాలయ స్థలం డేటా లేక్ లో అన్ని శాఖలకు చెందిన 6 పెటా బైట్ల డేటా ఉంది. వచ్చే కలెక్టర్స్ కాన్ఫరెన్సును, అజెండాను రియల్ టైమ్ డేటా ఆధారంగానే నిర్వహిద్దామని చంద్రబాబు వెల్లడించారు.

**45 రోజుల్లో అపార్ అప్డేషన్ పూర్తి చేయండి**

విద్యార్థులకు 10 ఏళ్ల క్రితం ఉండే అంశాలనే ఇంకా బోధిస్తుండడం సరి కాదు. ప్రస్తుతం అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలి అప్పుడే విద్యార్థుల నైపుణ్యం పెరుగుతుంది. 2019 వరకూ విద్యారంగంలోని అన్ని ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. ఆ తర్వాత అన్నీ దిగువకు పడిపోయిన పరిస్థితి. దానికి కారణాలు ఏంటన్నది అధ్యయనం చేయండి. ఆర్టీజీఎస్ ద్వారా టెక్నాలజీ ఆడిటింగ్ జరగాలి. అపార్ ఐడీ ద్వారా విద్యార్థుల సమాచారాన్ని కేంద్రం ట్రాక్ చేస్తోంది. ఆ సమాచారం ఆధారంగానే మన డేటా కూడా అప్డేట్ కావాలి. 45 రోజుల్లో అపార్ ఐడీ అప్డేషన్ జరగాలి. వచ్చే కలెక్టర్ల కాన్ఫరెన్సు నుంచి ఇక అంతా రియల్ టైమ్ సమాచారమే. విద్యారంగం పారిశ్రామిక రంగం కలసి పని చేయాలి. అందుకే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. నైపుణ్యాలు పెంచుకునేలా యువతను ప్రోత్సహించాలి. అంగన్‌వాడీల నుంచే విద్యార్థుల్లో లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ఉన్నత విద్య కోసం కేంద్ర ప్రభుత్వం గ్యారెంటీ లేకుండా రుణం ఇస్తోంది. దీనిని వినియోగించుకుని విద్యార్థులకు బాసటగా నిలిచేలా ఓ పథకాన్ని ప్రారంభిస్తాం. జిల్లాల్లో ఎప్పటికప్పుడు జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చేయాలి. 4.5 లక్షల మంది ప్రస్తుతం ఏపీలో వర్క్ ఫ్రమ్ హోం పని చేస్తున్నారు. రాష్ట్రంలో కోవర్కింగ్ స్పేస్ లు కూడా పెడితే మరో 5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించొచ్చు. రాష్ట్రంలో అందరికీ ఉద్యోగాలు కల్పించేలా కార్యాచరణ ఉండాలి." అని చంద్రబాబు తెలిపారు.

**సంజీవని ప్రాజెక్టుపై కార్యాచరణ**

ఎక్కడా నీటి కాలుష్యం జరగడానికి వీల్లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. క్లీన్ నగరాలు, క్లీన్ పట్టణాలు మనకు ముఖ్యమని లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైతే ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా తీసుకోవాలన్నారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో పాటు సంజీవని ప్రాజెక్టు చేపడుతున్నట్లు తెలిపారు. మొదట చిత్తూరు జిల్లాలో ఆ తర్వాత రాష్ట్రం మొత్తం అమలు చేసేలా కార్యాచరణ రూపొందించామని ఈ సందర్భంగా తెలిపారు.

# నిందితులకు ఊరట

>> ఇవ్వాలని ఆదేశించడంతో నిందితుడిని ఓ రోజు సిబిఐ అధికారులు అరెస్టు చేసారు. సరిగ్గా అదే రోజు బెయిల్ ఇచ్చారు. బెయిల్ రద్దు చేయాలని అప్పటి నుంచి వైఎస్ సునీత రెడ్డి న్యాయపోరాటం చేస్తున్నారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న ఆ పిటిషన్ పై విచారణ ఇటీవల జరిగింది. గత విచారణలో.. అధికార దుర్వినియోగం జరిగిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించారు. తప్పుడు కేసులు పెట్టారని వివేకా కుమార్తె, అల్లుడితో పాటు సిబిఐ ఎస్పీ రాంసింగ్‌పై పెట్టిన కేసులను క్వాష్ చేసింది. ఈ క్రమంలో నిందితులు బెయిల్ రద్దు అవుతుందని అనుకున్నారు ఈ దశలో నిర్ణయం తీసుకోలేమని.. ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు చెప్పడంతో నిందితులకు ఊరట లభించినట్లయింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోదరుడు అయిన వివేకానందరెడ్డి 2019 ఎన్నికలకు ముందు పులివెందులలోని ఆయన నివాసంలో అత్యంత దారుణంగా హత్యకుగురయ్యారు. ఆయన మొదట రక్తపు వాంతులతో, గుండెపోటుతో చనిపోయారని బంధువులు ప్రచారం చేశారు. అయితే హైదరాబాద్‌లో ఆయన కుమార్తె.. పులివెందులకు వెళ్లి.. పోస్టుమార్టం చేయించే సరికి.. ఆయనను అత్యంత ఘోరంగా నరికి చంపారని వెల్లడి అయింది. ఇంట్లో సాక్ష్యాలను తుడిచేసే ప్రయత్నం చేయడంతో పాటు.. పోస్టుమార్టం వద్దని చెప్పడం, పెద్ద పెద్ద గొడ్డలి పోట్లకు కట్లు కట్టేసి ఉండటం వంటివి చేయడంతో హంతకులే సాక్ష్యాలు మాయం చేసేందుకు ప్రయత్నించారన్న అనుమానాలు వ్యక్తం కావడంతో.. సిబిఐ విచారణకు వివేకా కుమార్తె డిమాండ్ చేసి కోర్టుకెళ్లారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆమెతో పాటు ఆమె భర్తపై కేసులు నమోదు అయ్యాయి. దర్యాప్తు చేస్తున్న సిబిఐ ఎస్పీపైనా కేసు పెట్టారు. సుప్రీంకోర్టు ఆ కేసుల్ని క్వాష్ చేసింది.

# ప్రాజెక్టులకు అనుమతి

>> ప్రభుత్వం రూ. 10,06,799 కోట్ల విలువైన 122 భారీ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమల కోసం ఒక లక్ష ఎకరాల భూమి కలిగిన పారిశ్రామిక క్లస్టర్లను ప్రభుత్వం సిద్ధం చేసింది. మరో యేడాదిలో ఈ పెట్టుబడులను రెట్టింపు చేయాలన్నది ఏపి ప్రభుత్వ లక్ష్యం. లండన్ రోడ్‌షోలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలపై మంత్రి నారా లోకేష్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. అలాగే ప్రఖ్యాత సంస్థలైన హిందుజా, రోల్స్ రాయిస్ వంటి గ్రూప్‌లతో ప్రత్యేక సమావేశాలు, గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పెట్టుబడిదారులతో ఫైర్‌సైడ్ చాట్ నిర్వహించనున్నారు. రోడ్‌షో సందర్భంగా మంత్రి లోకేష్ ఏపిలో పోర్టు ఆధారిత పారిశ్రామికీకరణ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్నోవేషన్, ఆధునిక తయారీరంగం వంటి అంశాలను హైలైట్ చేస్తారు. పెట్టుబడులతోపాటు శాశ్వత ఆర్థికావకాశాలను ఇన్వెస్టర్లకు వివరిస్తారు. రోడ్ షో లో ఎలక్ట్రాన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సియాంట్, ఇవాంటె గ్లోబల్, ఏఐ ఓవెన్‌సెక్, లండన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో పాటు ఇతర పరిశ్రమ ప్రముఖులు కూడా హాజరవుతారు. నవంబర్ లో జరిగే పార్టనర్ షిప్ సమ్మిట్‌కు రావాల్సిందిగా గ్లోబల్ కంపెనీల సిఇఓలు, పాలసీ మేకర్లు, ఇండస్ట్రీ లీడర్లను మంత్రి లోకేష్ ఆహ్వానిస్తారు. ట్రేడ్, టెక్నాలజీ, స్థిరమైన వృద్ధి అంశాలపై లండన్ రోడ్ షో లో కీలక చర్చలు జరగనున్నాయి.

# రైతుల పట్ల జగన్ మొసలి కన్నీరు

## -మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** ఉల్లి, టమోటా రైతుల దీనస్థితి అంటూ జగన్ రెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నాడని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. రైతుల కష్టాలు నిజంగా పట్టించుకునే హృదయం జగన్‌కి ఉంటే తన పాలనలోనే రైతులను దోపిడీకి గురి చేయడమేంటి అని ప్రశ్నించారు. రైతుల పట్ల కనీసం చిత్తశుద్ధి లేని జగన్ ఇప్పుడొచ్చి అబద్ధపు సానుభూతి నటన చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉల్లి, టమోటా రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర చెల్లించిందని గుర్తు చేశారు. మద్ధతు ధరలు, రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదని అన్నారు. రైతులకు అండగా నిలబడటం అంటే డ్రామాలు కాదు, క్షేత్ర స్థాయిలో ఫలితాలు చూపించడమేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జగన్ పాలనలో రైతులు కన్నీరు మున్నీరయ్యారు... ఇప్పుడు ఆయన కార్చే కన్నీరు మొసలి కన్నీరు తప్ప మరేదీ కాదన్నారు.

ప్రస్తుతం ఉల్లి రైతులను ఆదుకోవడం లేదని జగన్ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాడని, మార్కెట్‌లో ధరలు పెరగడం, తగ్గడం అనేది మార్కెట్ డైనమిక్స్ డిసైడ్ చేస్తాయని, ధరలు తగ్గినప్పుడు వ్యవసాయ ఉత్పత్తులకు మద్ధతు ధరను అందించి రైతులకు న్యాయం చేస్తామని, ధరలు పెరిగినప్పుడు సబ్సిడి రూపంలో వినియోగదారులకు సరసమైన ధరలలో ఉత్పత్తులను అందచేస్తామని తెలిపారు. 2025లో ఉల్లి ధరలు పతనమవుతున్నాయని ముందస్తు అంచనా వేసి క్వాలిటీతో సంబంధం లేకుండా 1200 మద్ధతు ధరను ప్రకటించామని తెలిపారు. తొలుత మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే ప్రత్యక్షంగా రైతులకు ఉల్లి క్వింటాకు 1200 చెల్లించి కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా అమ్మకాలు చేయడం జరిగిందన్నారు. డిమాండ్‌ను మించి ఒకే సారి రైతులు పంటను మార్కెట్‌కు తీసుకురావడంతో మార్కెట్ వ్యత్యాసపు ధరను ప్రకటించామని...1200 క్వింటా ఉంటే ఆ ధరకు తక్కువగా రైతులకు లభిస్తే మిగిలిన నగదును ప్రభుత్వమే రైతులకు చెల్లిస్తుందన్నారు. 2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723 మంది రైతులనుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి 7 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని, 2018లో మరొకసారి 9740 మంది రైతుల నుండి 3.48 లక్షల క్వింటాళ్ల ఉల్లి కొనుగోలు చేసి 6.45 కోట్లు చెల్లించామని తెలిపారు. 2025 సంవత్సరంలో ఈ నెల 15 వ తేదీ వరకు రైతు బజార్ల కోసం 9014 క్వింటా ఉల్లిని కొనుగోలు చేశాం. మార్క్ ఫెడ్ ద్వారా 53239 క్వింటాలను సేకరించాం. వ్యాపారుల ద్వారా 15292 క్వింటాల ఉల్లిని నేరుగా కోనుగోలు చేయడం జరిగింది. ధర వ్యత్యాస పథకం కింద మార్క్ ఫెడ్ ప్రైవేట్ వ్యాపారుల ద్వారా 51268 క్వింటాల ఉల్లిని కోనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా 931 మంది రైతుల ద్వారా 5.97 కోట్ల ఉల్లిని కోనుగోలు చేసిందని, అందులో ధర వ్యత్యాసం కింద 752 మంది రైతులకు 4.25 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. జగన్ హయాంలో 2020 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పడిపోతే, నామ మాత్రంగా క్వింటాకి రూ.770లు మద్దతు ధరప్రకటించి, ఏ ఒక్కరి దగ్గరా ఉల్లి కొనుగోలు చేయకుండా, రైతులను మోసం చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా కూడా జగన్ గుండె కరగలేదా.. కేవలం 250 మంది రైతుల దగ్గర 75 లక్షలు ఇచ్చి ఉల్లిని కొన్న నువ్వు రైతుల గురించి మాట్లాడుతున్నావు అంటూ ధ్వజమెత్తారు. ప్రస్తుతం రైతు బజార్లలో 12 నుంచి 15 రూ ఉల్లి కేజీ అమ్ముతుంటే, ప్రైవేట్ సంస్థ బిగ్ బాస్కెట్ లో 34 రూ కేజీ అంటూ ప్రజలకు నష్టాన్ని చేకూర్చే విషయాలను కార్పొరేట్ మాజీ సీఎం వెల్లడించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2020లో మీ ప్రభుత్వ సమయంలో ఉల్లి ధరలు పడిపోయినప్పుడు మీ సమయంలో ఎంత మంది దగ్గర కొన్నావు, ఎన్ని కోట్లు రైతులకు అందచేశారు అన్న విషయంపై వివరాలు చెప్పగలరా... బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాలు విసిరారు. మార్కెట్ ధరల వ్యత్యాసాల సమయంలో రైతుల పట్ల ఎలా వ్యవహరించాం అనేది ముఖ్యం.. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను ఉదాహరణలతో సహా వెల్లడించామని, ఇలా బహిరంగంగా తెలిపే దమ్ము, ధైర్యం జగన్‌కు ఉందా అని ప్రశ్నించారు.

# చర్చలకు సిద్ధం

>>న్నట్లు తెలిపింది. ఆయుధాలు వదిలిపెడుతున్నందున యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ ఆపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఆపరేషన్ కగార్‌లో మావోయిస్టులకు భారీగా ఎదురు దెబ్బ తగిలింది. వరుసగా అగ్రనేతలను మావోయిస్టు పార్టీ కోల్పోయింది. ఈ నేపథ్యంలోనే మావోల ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, మావోయిస్టులతో శాంతి చర్చలు ఉండవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే.

## వారం - వర్జ్యం

17-09-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
ఏకాదశి రా. 11.42
పునర్వసు ఉ. 6.26
వర్జ్యం : మ. 2.28-4.04
దు. ఉ. 11.39-మ. 12.28
శుభసమయం: ఉ. 6.45-7.30
రాహుకాలం - మ. 12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ఆరోగ్యం, వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం. క్రీడారంగం యందు ఆసక్తి కలిగివుంటారు.

**వృషభం:** నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. కాంట్రాక్టులు లభిస్తాయి.

**మిథునం:** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. సన్నిహితుల కలయిక.

**కర్కాటకం :** కుటుంబంలో ఏర్పడే స్పర్థలు చిన్నపాటి వివాదాలు సర్దుకుంటాయి.

**సింహం:** దీర్ఘకాలిక సమస్యలను మాత్రం కాలానికి వదిలి వేస్తారు. క్రయావిక్రయాలలో లాభాలు.

**కన్య :** స్థిరాస్తుల తాలూకూ రావలసిన ధనము చేతికి వస్తుంది. స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**తుల :** తప్పుడు లెక్కలు, అబద్ధములు మీదృష్టికి వస్తాయి. క్రమశిక్షణకు ప్రాధాన్యతనివ్వాలని యోచిస్తారు.

**వృశ్చికం:** మీ నమ్మకము కన్నా మీ ఇంటిలోని వారి ఊహే నిజమవుతుంది. శ్రమ అధికమవుతుంది.

**ధనుస్సు:** సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు నామమాత్రంగా పెరుగుతాయి. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**మకరం:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** కుటుంబంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. నూతన విద్యలపై ఆసక్తి చూపుతారు.

**మీనం :** పొరపాటు నిర్ణయాలు, నోరు జారుట వంటివి సంభవించకుండా జాగ్రత్త వహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్ జస్టిస్ నజీర్ దంపతులు

# వెంకన్న దర్శనంలో గవర్నర్ జస్టిస్ నజీర్

**తిరుమల,సెప్టెంబరు 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ తెలిపారు. తిరుపతిలో రెండురోజులు జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సు అనంతరం మంగళవారం ఉదయం గవర్నర్ జస్టిస్ నజీర్ దంపతులు, కుటుంబసభ్యులతో తిరుమల ఆలయం వద్దకు విచ్చేశారు. వీరికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన గవర్నర్ దంపతులు ఆనందనిలయంలోనికి చేరుకని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు.రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ సింఘాల్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. వీరితోబాటు తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు.

# వాణిజ్య చర్చలు సానుకూలం!

>> వాయిదాపడ్డాయి. ఈక్రమంలో మంగళవారం సానుకూల చర్చలు జరిగాయని అటు బ్రెండెన్ ఇటు రాజేశ్ అగర్వాల్‌లు ఇరువురు కూడా స్పష్టంచేసారు. ద్వైపాక్షిక వాణిజ్య సంప్రదింపులు తదుపరి చర్చల అజెండాపైనా సమావేశంలో ప్రస్తావనకు వచ్చిందని వాణిజ్య శాఖ ప్రకటించింది. వాణిజ్య ఒప్పందం తుదిదశకు వచ్చేందుకు రెండుదేశాలు కూడా విధిగా కృషిచేస్తున్నట్లు కేంద్ర మంత్రిత్వశాఖ వెల్లడించింది. డీల్‌లోని ఉన్న అన్ని అంశాలను కూడా చర్చించామని, సానుకూల ధక్పథంతో ముందుకువెళుతున్నట్లు పరస్పర ప్రయోజనకారి అయిన వాణిజ్య ఒప్పందంకోసమే కృషిజరుగుతున్నట్లు మంత్రిత్వశాఖప్రకటించింది. ముందురోజురాత్రే లించ్ ఆయన బృందం భారత్‌కు చేరుకున్నారు. చమురుకొనుగోళ్లపై అదనపు సుంకాలు విధించడంవల్లనే వాణిజ్యడీల్ రానురాను వాయిదాపడింది. రష్యా చమురుకొనుగోళ్లు, యూరోపియన్ యూనియన్‌కు ఎల్ఎన్‌జి సరఫరా వంటివాటిపైనే ట్రంప్ సుంకాలుప్రకటిస్తామని చెప్పినతర్వాతనుంచే రెండు దేశాలమధ్య వాణిజ్య సంబంధాలు బెడిసికొట్టాయి. దీనికితోడు శ్వేతసౌధం ప్రతినిధి పీటర్ నవార్రో తరచూ భారత్‌పై నోరుపారేసుకోవడం కూడా చర్చలకు ఆటంకం కలిగించిందనే చెప్పాలి. అయితే ట్రంప్ మాత్రం ఈ చర్చలు సానుకూల పరిణామాలని ప్రకటించారు. భారత్ అమెరికాలు వాణిజ్యప్రతిబంధకాలపై చర్చలు కొనసాగిస్తున్నాయని ఇదొక శుభపరిణామం అని అన్నారు. తనమంచి మిత్రుడు భారతప్రధాని నరేంద్రమోడీతో మాట్లాడేందుకు తాను ఎదురుచూస్తున్నట్లు తన ట్రూత్‌సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. రానున్న కొద్దివారాల్లోనే మా ఇద్దరి భేటీఉంటుందని ఆయన ఆశాభవం వ్యక్తంచేసారు. రెండు గొప్పదేశాల మధ్య ఈ వాణిజ్య ఒప్పందం జరగడంలో ఎలాంటి అడ్డంకులు ఇకపై ఉండబోవనే ఆయన పేర్కొన్నారు. అదే క్రమంలోప్రధానినరేంద్రమోడీ కూడా ఇదే తరహాలో స్పందించారు. భారత్ అమెరికాలు సహజ భాగస్వాములని పేర్కొన్నారు.

# ఆలయ భూముల రక్షణపై హైకోర్టు కీలక ఆదేశాలు!

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగర శివారుల్లోని గొల్లపూడిలో గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన దేవాదాయ భూముల్లో "విజయవాడ ఉత్సవ్" నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు లో పిటీషన్ దాఖలైంది. ఈ పిటీషన్‌పై న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ క్రమంలో దేవాదాయ భూములను వాణిజ్య అవసరాలకు ఉపయోగించవద్దని ఆదేశాలు హైకోర్టు జారీ చేసింది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు ఎలా ఉపయోగిస్తారని హైకోర్టుప్రశ్నించింది ఆ భూములోకి తరలించిన గ్రావెల్, మట్టి, కంకరను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఆ భూములను యథాస్థితికి తీసుకురావాలని ఆదేశించింది న్యాయస్థానం. అయితే ఈ భూములను ఇప్పటికే 56రోజుల లీజుకు ఇచ్చింది దేవాదాయశాఖ. ఈ లీజు మొత్తాన్ని గొడుగుపేట దేవస్థానానికి విజయవాడ ఉత్సవ్ నిర్వాహకులు చెల్లించారు. హైకోర్టు ఆదేశాల జారీ చేసిన క్రమంలో విజయవాడ ఉత్సవ్ నిర్వహణపై సందిగ్ధత నెలకుంది.

# రాష్ట్రంలో కొత్తగా 13 వృద్ధాశ్రమాలు

## స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాలలకు అనుసంధానంగా అంగన్వాడీలుండేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలిన మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యర్శి సూర్య కుమారి సూచించారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆమె తన శాఖకు సంబంధించిన కార్యకలాపాలపైన ప్రజంటేషన్ ఇచ్చారు. అంగన్వాడీల్లో ఇప్పటికి కూడా 6 సంవత్సరాలపైబడిన పిల్లలుకూడా అలాగే అంగన్వాడీల్లో ఉండిపోతున్నారని చెప్పారు. వీరంతా బడిఈడు ప్రాయం పిల్లలని వీరిని బడిలో చేర్చే విధంగా కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీల నిర్వహణ మరింత పారదర్శకంగా జవాబుదారీ తనంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. ఇందులో భాగంగా విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామన్నారు. ఇప్పటి వరకు అంగన్వాడీలు అంటే కేవలం తల్లులు, బిడ్డలు మాత్రమే అనుకునేవారని, ఇప్పుడు తండ్రులను కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. తన బిడ్డ బాగోగుల బాధ్యత తల్లితోపాటు తండ్రికి కూడా ఉంటుందని, దీనిపై తండ్రులకు అవగాహన కల్పించి చైతన్యం కల్పిస్తామన్నారు. అంగన్వాడీల్లో దివ్యాంగులైన పిల్లల కోసం లిఫ్ట్ లేదా ర్యాంప్‌లు ఏర్పాటు చేయవచ్చని దీనికోసం ప్రత్యేకంగా నిధులున్నాయని, కలెక్టర్లు అందరూ దీనిపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలో కొత్తం మరో 13 వృద్ధాశ్రమాలను అటల్ వయో అభ్యుదయ యోపజన పథకం కింద ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అంగన్వాడీల్లో 9246 టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 6662 టాయ్‌లెట్లు (72 శాతం) మాత్రమే ఏర్పాటు చేశారని, 11403 అంగన్వాడీలకు మంచినీటి కొళాయి కనెక్షన్ సదుపాయం కల్పించాలన్నది లక్ష్యంగా పెట్టుకుంటే అందులో కేవలం 79 శాతం మాత్రమే సాధించామన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్రీయ పోషన్ మా కార్యక్రమం మొదలవుతోందని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగంతో ఈ కార్యక్రమం మొదలవుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఊబకాయం, మదుమేహం తదితర సమస్యలను తగ్గించుకోవడంపై ప్రజల్లో అవగాహన చైతన్యం కలిగించడం కోసం రూపొందించిన కార్యక్రమని తెలిపారు. అంగన్వాడీల్లో పిల్లల హాజరీ 65 శాతంలోపు ఉన్న జిల్లాల్లో కృష్ణా, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాలు అట్టడుగున ఉన్నాయని ఈ జిల్లాల కలెక్టరులు దీనిపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిశోరీ వికాసం కింద మెంటార్స్‌ని కూడా వినియోగిస్తున్నాని, అయితే మొదట్లో ప్రైవేటు స్కూళ్లలో ఈ మెంటార్స్‌ని అంగీకరించలేదన్నారు. అయితే ప్రైవేటు స్కూళ్లలోనే అత్యధికంగా డ్రగ్స్ బాధితులు, ఆత్మహత్యలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కిశోరీ వికాసం కింద పనిచేసే మెంటార్స్ సేవలను కూడా వినియోగించుకోవాలన్నారు.

# ఎక్సైజ్ కమీషనర్‌గా రాహుల్ దేవ్ శర్మకు అదనపు బాధ్యతలు

**విజయవాడ, సెప్టెంబరు16, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి రాహుల్ దేవ్ శర్మకు ఎక్సైజ్ కమీషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. ఫలితంగా రాహుల్ దేవ్ శర్మ ఇకపై డైరెక్టర్, ఎక్సైజ్ ప్రొహిబిషన్; మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్; కమిషనర్, డిస్టిలరీస్ బ్రూవరీస్ హోదాలలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ తాత్కాలిక ఏర్పాట్లు తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది.

# గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శికి జైలు శిక్ష

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త):** గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి ఒక వారం జైలు శిక్ష విధించింది. గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంలో కోర్టును ఆశ్రయించడంతో పనులను తక్షణం నిలిపివేయాలని కోర్టు స్టేటస్ కో విధించింది. నిర్మాణపు పనులు నిలిపివేయకుండా యదావిధిగా కొనసాగిస్తుండటంతో పిటీషనర్ మరలా కోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది మాకిరెడ్డి మనోజ్ వాదనలు విన్న కోర్టు పరిశీలనలో ఆదేశాల ఉల్లంఘన స్పష్టమని తేల్చింది. దీంతో కోర్టు నిబంధనలు ఉల్లంఘనపై పంచాయతీ కార్యదర్శికి హైకోర్టు ఒక వారం జైలు శిక్ష విధించింది. మరల శిక్షను రెండు రోజులు సస్పెండ్ చేస్తూ సెప్టెంబర్ 17న హాజరుకావాలని ఆదేశించింది. ఇది ఇలా ఉండగా జల జీవన్ మిషన్ నిధులతో ఆ నిర్మాణాన్ని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చేస్తున్నారు. ఇప్పటికే ఈ కేసు విషయంలో పలువురు అధికారులకు షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చినట్లు సమాచారం.

# దేశ రాజకీయాల్లో 1983 ఒక సంచలనం, ఆయన చరిత్ర సజీవం

## 'సజీవ చరిత్ర' పుస్తకం ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు, వెంకయ్య నాయుడు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు రవీంద్ర, ఎన్టీఆర్ ట్రస్టు డైరెక్టర్ నందమూరి రామకృష్ణ



మంగళవారం 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణలో సిఎం చంద్రబాబు,మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు, ఎన్టీఆర్ ట్రస్టు డైరెక్టర్ నందమూరి రామకృష్ణ తదితరులు

**విజయవాడ,సెప్టెంబరు16,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజకీయాల్లో 1984 ఒక సంచలనమని సిఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని పాతర వేసేందుకు రాజకీయ కుట్రలు పన్నిన వారిని ప్రజలే తిరుగబడి బుద్ధి చెప్పిన సజీవ సాక్ష్యాలను చరిత్రలో నిలిపిన వత్సరమన్నారు.1983లో చరిత్ర తిరగరాసిన ప్రజా నాయకుడు ఎన్టీఆర్‌ను గద్దెదించిన శక్తులకు బుద్ధి చెప్పి ప్రజలు తమ అక్కున చేర్చుకున్న ఘట్టమన్నారు.సజీవ చరిత్ర పుస్తకం ద్వారా 1984లో చోటు చేసుకున్న వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు సంబంధించిన రాజకీయ ప్రస్తానంలో కీలకమైె ఆగస్టు సంక్షోభంతో సహా పలు కీలక ఘటనల ప్రస్తావనతో సజీవ చరిత్ర పేరిట రూపొందింది. ఎన్టీఆర్ సాహిత్య ట్రస్టు నిర్వాహకుల టిడి జనార్ధన్ సంచాలకత్వంలో సీనియర్ పాత్రికేయుడు పూల విక్రమ్ రచించిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం రాత్రి విజయవాడ శివారు పోరంకిలోని ఓ సమావేశ ప్రాంగణంలో జరిగింది ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు నాయుడు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు రవీంద్ర,ఎన్టీఆర్ ట్రస్టు డైరెక్టర్ నందమూరి రామకృష్ణ, సహకార బ్యాంకుచైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎంఎల్ఏ బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ రాజకీయాల్లో 1983 ఒక సంచలనమని సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సజీవ చరిత్ర పుస్తకంద్వారా 1984లో చోటు చేసుకున్న వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని తెలిపారు. మూడున్నర దశాబ్దాలపాటు కాంగ్రెస్ పాలనకు 1983 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు ఒక గుణపాఠమని చెప్పుకొచ్చారు. దేశంలో నాయకులందరినీ ఒక తాటి మీదకు తీసుకొచ్చేందుకు వెంకయ్య నాయుడు ఎంతో కృషి చేశారని ఉద్ఘాటించారు. ఆ రోజు గవర్నర్ రామ్ లాల్ ఏకపక్షంగా వ్యవహారించారని గుర్తుచేశారు. ఎప్పుడూ లేని సంఘీభావాన్ని ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి చూపించారని గుర్తుచేశారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేవరకు పోరాటం చేస్తాం. కచ్చితంగా సాధిస్తాం. సజీవ చరిత్ర 1984 పుస్తకం ద్వారా ఇప్పటి ప్రజలకు వాస్తవాలు తెలుస్తాం. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారతదేశం అగ్రదేశంగా ఉంటుంది. అమరా వతిలో తెలుగు వైభవం పేరుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తాం. ఎన్టీఆర్ మన ముందు లేరు. ఆయన ఆశయాలు మాత్రం మా ముందు ఉంటాయని సిఎం చంద్రబాబు ఉద్ఘా టించారు.

**కాంగ్రెస్ 1984లో ప్రజాస్వామ్యాన్ని నిస్సిగ్గుగా ఖూనీ చేసింది: వెంకయ్యనాయుడు**

1984లో ప్రజాస్వామ్యాన్ని నిస్సిగ్గుగా ఖూనీ చేశారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విమర్శించారు. చరిత్ర పుస్తకాల్లోనే కాదు రాజనీతి శాస్త్ర పుస్తకాల్లో చేర్చాల్సిన అంశం 1984 ఘటన అని వెంకయ్య నాయుడు తెలిపారు. ఆనాడు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి ప్రజలు ఎన్టీఆర్ వెనక నిలబడ్డారు. తెలుగు అధ్యయన కేంద్రం మైసూర్‌లో ఉండకూడదన్న ఉద్దేశంతో తాను నెల్లూరుకు తీసుకువచ్చాను. గత పాలకులు ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏమీ లేకుండా చేశారని వెంకయ్యనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ముఖ్యమంత్రి కూడా ఆయన కంటే ఎక్కువ హామీలు ఇస్తానని అన్నారని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే చూడాలన్నది నా కోరిక. నేను పదవికి విరమణ చేశాగాని పెదవికి మాత్రం కాదని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

# తిరుమల సమాచారం

## బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం

### - 24నుండి వాహన సేవలు ప్రారంభం
### - ఉత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ



**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాత వార్తప్రతి నిధి:** బ్రహ్మాండనాయకుడి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈఏడాది బ్రహ్మాండంగా నిర్వహిస్తామని, అందుకు అన్ని ఏర్పాట్లుచేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. 24వతేదీ నుండి ఉత్సవాల వాహనసేవలు ఆరంభమవుతాయన్నారు. రోజుకు రెండు వాహనాలపై మలయప్పస్వామి ఊరేగుతారన్నారు. ఆలయ మాఢ వీధుల్లో గ్యాలరీలను పటిష్టంగా నిర్మించామని, వర్షం వచ్చినా భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. గ్యాలరీల్లో నిరంతారయంగా భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గరుడసేవరోజు 3లక్షలమంది భక్తులు వాహనసేవ వీక్షించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. తొమ్మిదిరోజులుపాటు జరిగే తిరుమలేశుని బ్రహ్మోత్సవాల వాహనసేవలు, ఆలయంలో జరిగే స్నపనతిరుమంజనం విశేషాల వివరాలతో ముద్రించిన వాహనసేవల బుక్‌లెట్‌ను మంగళవారం మధ్యాహ్నాం అన్నమయ్యభవనంలో ఆవిష్కరించారు. 24వతేదీ సాయంత్రం ద్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనం, ఐదవరోజు 28వతేదీ రాత్రి గరుడవాహనసేవ, 29వతేదీ సాయంత్రం స్వర్ణరథం, అక్టోబర్ 1వతేదీ ఉదయంరథోత్సవం, 2వతేదీ ఉదయం చక్రస్నానం విశేష ఘట్టాలు. ఈ విశేషాల వివరాలతో ముద్రించిన పుస్తకాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్శిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవి,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాత వార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి తొమ్మిదిరోజులుపాటు జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల ముందు మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం 6గంటల నుండి 10గంటల వరకు సాగిన ఈ మహాయజ్ఞంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాకలక్ష్మి, భానుప్రకాశ్‌రెడ్డి, నరేష్‌కుమార్, శాంతారాం,సదాశివరావు, జంగాకృష్ణమూర్తి, జానకిదేవి,మహేందర్‌రెడ్డి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రంగా కడిగారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేశారు. ఉదయం 10గంటలకు ప్రోటోకాల్ విఐపిలకు బ్రేక్ దర్శనం చేయించి నంతరం 11గంటలకు సర్వదర్శనం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈసందర్భంగా ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. ఏడాదిలో వార్షిక బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి,ఆణివార ఆస్థానం ముందువచ్చే మంగళవారాల్లో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టడం ఆనవాయితీ.

## భక్తులకు మరింతగా సేవచేసేందుకు కృషి చేస్తా

### - టిటిడి ఇఒ సింఘాల్‌కు బోర్డు ఘన సన్మానం



**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాత వార్తప్రతి నిధి:** ఎంతో ప్రసిద్ధి చెందిన టిటిడిలో ఇఒగా రెండవసారి నియమితులైె తనవంతుగా అనుభవం, అవగాహనతో భక్తులకు సేవలందించేందుకు ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ రావడం ఆనందదాయకమని, ఆయన అనుభవంతో భక్తులకు మరింత మెరుగైన సేవలందుతాయని టిటిడి బోర్డు అభినందించింది. టిటిడి ఇఒగా అనిల్ కుమార్‌సింఘాల్ రెండవసారి నియమితులైన తరువాత అన్నమయ్య భవనంలో మంగళవారం జరిగిన టిటిడి పాలకమండలి సమావేశంలో ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్శిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవితదితరులు ఇఒను అభినందించి ఘనంగా సన్మానించారు. గతంలో ఇఒగా పనిచేసిన సిఘాల్‌కు ఉన్న అనుభవం భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో,టిటిడిని ముందుకు నడిపించడంలో ఉపయోగపడుతుందని పాలకమండలి సభ్యులు ఆకాంక్షించారు. ఇఒగా రెండవసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలిపి, ఆయన సూచనలను తీసుకుని,భక్తులకు మరింత మెరుగైన సేవలందిస్తానన్నారు.

## టిటిడి సముచిత ఆలోచన ఇక అంగప్రదక్షిణ టోకెన్లు లక్కీడిప్‌లో

### - ఒకసారి టోకెన్ పొందితే మళ్లీ ఆర్నెల్లకే భాగ్యం

**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలస్వామికి ఎంతో భక్తితో భక్తులు మొక్కుబడుల్లో భాగంగా వేకువజామున చేపట్టే అంగప్రదక్షిణ కూడా ఆన్‌లైన్‌లో లక్కీడిప్‌లో జారీచేసేందుకు టిటిడి సిద్ధమైంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న ముందు వచ్చిన వారికి ముందు అనే విధానంలో లక్కీడిప్ విధానం ప్రవేశపెట్టారు. టిటిడి ఇఒగా అనుభవం, అవగాహన ఉన్న అనిల్‌కుమార్‌సింఘాల్ ముందుచూపుతో అంగప్రదక్షిణ టోకెన్లు మూడునెలల ముందుగానే ఆన్‌లైన్‌లో లక్కీడిప్ విదానం ద్వారా విడుదలవ ౹తా యి. టిటిడి తాజాగా అంగప్రదక్షిణ టోకెన్లు జారీలో వినూత్న మార్పు తీసుకు వచ్చింది. డిసెంబర్‌నెలకు సంబంధించి అంగప్రదక్షిణ టోకెన్లకోసం రేపు (18వ తేదీ) నుండి 20వతేదీ వరకు లక్కీడిప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. లక్కీడిప్‌ద్వారా ఎంపికైన భక్తులకు ఈ టోకెన్లను కేటాయిస్తారు. శుక్రవారం మినహా మిగిలిన అన్ని రోజులు 750 టోకెన్లు ,

శనివారంమాత్రం 500 టోకెన్లు జారీచేయడం జరుగుతుంది. భక్తులు తిరిగి ఈ సేవ పొందడానికి గడువు 90రోజులకు బదులు 180రోజులుగా నిర్ణయించడం జరిగింది. ఈ మార్పును గమనించి భక్తులు లక్కీడిప్‌లో టోకెన్లు తీసుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## శాసన మండలి చైర్మన్ తరపు న్యాయవాదికి హైకోర్టులో షాక్

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ రాజీనామా ఆమోదించాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నేపథ్యంలో శాసన మండలి ఛైర్మన్ తరపు న్యాయవాదికి మంగళవారం ఏపీ హైకోర్టు షాక్ ఇచ్చింది. పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలంటే అందుకు ఖర్చుల కింద రూ.10లక్షలు చెల్లించాలంటూ సదరు న్యాయవాదిని ఈ కేసు విచారిస్తున్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం 5 గంటల లోపు లీగల్ సర్వీస్ అథారిటీకి ఈ నగదు చెల్లింపులు జరగాలంటూ శాసన మండలి ఛైర్మన్ తరఫు న్యాయవాదికి స్పష్టం చేశారు. జయమంగళవెంకట రమణ.తొలుత టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయన ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ కొద్ది నెలలకు ఆయనకు ఎమ్మెల్సీ పదవి కేటాయించి.. శాసన మండలికి పంపారు. అనంతరం తనకు విలువ ఇవ్వడం లేదంటూ 2024, నవంబర్‌లో తన ఎమ్మెల్సీ పదవితోపాటు వైసీపీకి ఆయన రాజీనామా చేశారు. ఆ లేఖను శాసన మండలి ఛైర్మన్ కె. మోషేజ్ రాజుకు స్వయంగా అందజేశారు. ఆ లేఖను ఛైర్మన్ ఆమోదించ లేదు. తన రాజీమానా లేఖను ఆమోదించేలా శాసన మండలి ఛైర్మన్‌ను ఆదేశించాలంటూ జయ మంగళ వెంకట రమణ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తమకు కొంత సమయం ఇవ్వాలంటూ శాసన మండలి ఛైర్మన్ తరఫు న్యాయవాది కోర్టుకు కోరారు. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని.. మరింత సమయం అంటే ఎలా అంటూ జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. మరింత సమయం అంటే.. ఖర్చుల కింద రూ. 10 వేలు చెల్లించాలంటూ సదరు న్యాయమూర్తిని ఆదేశించారు. ఈ కేసు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

## ముఖ్యమంత్రికి మంచి పేరు తెచ్చేలా సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీపై చర్యలు తీసుకోవాలి

### విఆర్ఒ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు

**విజయవాడ, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాల కనుగుణంగా శాశ్వత కులధృవీకరణ పత్రాలను జారీచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపి విఆర్ఓ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు కోరారు. సోమ, మంగళవారాల్లో జరిగిన కలెక్టర్ల సదస్సులో శాశ్వత కులధ్రువీకరణ పత్రాలివ్వాలని సిఎం నిర్ణయం తీసుకున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారంతో సేకరించిన డేటా ఆధారంగా శాశ్వత కులధృవీకరణ సర్టిఫికెట్లు జారీ చేసేలా కొందరు చేశారన్నారు.




తెలుగు, సంస్కృత భాషాభిమానుల సదస్సులో ప్రసంగిస్తున్న అకాడమీ చైర్మన్ శరత్‌చంద్ర

## తెలుగు, సంస్కృత అకాడమీ ద్వారా భాషా వికాసానికి కృషి

### - అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర

**విజయవాడ,సెప్టెంబరు16,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు,సంస్కృత అకాడమీ ద్వారా భాషా వికాసానికి కృషి చేస్తానని ఆ అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర (ఆర్డీ విల్సన్) అన్నారు. తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్మన్ శరత్ చంద్ర సంపాదకులు, రచయితలుభాషాభిమానుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంను మంగళవారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సామజిక రంగంలోనే కాకుండా సాహిత్యంలో తనదైన ముద్రను వేసి, వెనుకబడిన బలహీన పేద బడుగు వర్గాల హక్కుల సాధనకై అనేక ఉద్యమాలు చేపట్టడమే కాకుండా, తన రచనలతో వార్తా పత్రికల ద్వారా తనదైన శైలిలో సమాజంలో అనేక అంశాలపై గళమెత్తిన సంఘ సంస్కర్త శరత్ చంద్ర) అని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీ విల్సన్ మాట్లాడుతూ తెలుగు భాషపై, సాహిత్యం పై తనకున్న మక్కువతో వైద్య రంగాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నా తాను మాత్రం సాహిత్యం వైపే అడుగేసి సమాజాభివృద్ధికి దోహద పడే అనేక నవలలు, కథలు, నాటకాలు రచించానని తెలిపారు. అంతే కాకుండా సమాజం పై ఉన్న బాధ్యతతో సమకాలిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో పత్రికా విలేకరిగా కూడా పనిచేశానని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో తెలుగు భాష ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోనున్నదన్నారు., . తెలుగు భాష యొక్క సౌందర్యం మాట్లాడంలో, సాహిత్యం చదవడంలో ఇమిడి ఉందన్నారు. కులానికి, మతానికి భాషను ఆపాదించవద్దని కోరారు. నడుస్తున్న చరిత్రకు సాహిత్యం ఒక సాక్షి అని అలాంటి సాహిత్యాన్ని కనుమరుగవ్వకుండా పరిరక్షించుకోవాలని సూచించారు. తెలుగు మరియు సంస్కృత అకాడమీలో పనిచేసే ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరిస్తూ, విద్యార్థులకు ఈ అకాడమీ ద్వారా మరిన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పచెప్పిన కూటమి ప్రభుత్వానికి ఆర్డీ విల్సన్ ధన్యవాదాలు తెలియచేసారు. కలెక్టర్ల సమావేశం కారణంగా ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి రావాలని ఉన్నా రాలేకపోతున్నానని, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టిన ఆర్డీ విల్సన్ ను రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమం మరియు ఆరోగ్య శాఖా మాత్యులు శ్రీ సత్య కుమార్ యాదవ్ ఫోన్ లో అభినందించారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు , ఆదోని శాసన సభ్యులు పార్థసారథి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, ఏపీ లైబ్రరీ అసోసియేషన్ ఛైర్మన్ కోటేశ్వర రావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ మరియు ఇతర అసోసియేషన్ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## అదుపులోకి వస్తున్న డయేరియా

### ఇప్పటిదాకా 313 కేసులు నమోదు, ఆసుపత్రుల నుంచి 253 మంది డిశ్చార్జి



ప్రభుత్వాస్పత్రిలో డయేరియాకు చికిత్సపొందుతున్న రోగులు

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో డయేరియా కేసులు గణనీయంగా తగ్గుతున్నాయని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సుహాసిని తెలిపారు. ఇప్పటి వరకూ 313 కేసులు నమోదైనప్పటికీ, డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన వాళ్లు 253 మంది ఉన్నారు. ప్రస్తుతానికి కేవలం 60 మంది మాత్రమే చికిత్స పొందుతున్నారు. 24 గంటల పాటు సేవలు అందిస్తున్నాం. శాంపిల్స్ లో మొదటి విడతవి అన్నీ నెగటివ్ అనే వచ్చింది. మరిన్ని పరీక్షలకు సంబంధించిన ఫలితాలు వచ్చిన తరువాత ప్రణాళిక ఏంటి అనేది నిర్ణయిస్తామన్నారు. రాజరాజేశ్వరిపేటలో డయేరియా అదుపులోకి వస్తోంది. కొత్త కేసులు తగ్గుముఖం పడుతున్నాయి. రాజేశ్వరిపేటలో వైద్య శిబిరంతోపాటు విజయవాడ జీజీహెచ్‌లో బాధితులు కోలుకుంటున్నారు. ప్రస్తుతం 60 మంది బాధితులు రెండు చోట్ల చికిత్సలు పొందుతున్నారు. తాగు నీటి శాంపిళ్లను ప్రయోగ శాలకు పంపిన అధికారులు, వాటి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. స్దానిక రాజరాజేశ్వరి పేటలో వారం రోజుల నుంచి అతిసారం ప్రబలి ఉంది. వాంతులు, విరేచనాలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. స్వల్ప లక్షణాలున్న వారికి రాజరాజేశ్వరిపేటలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్సలు అందిస్తుండగా పరిస్థితి తీవ్రంగా ఉన్నవారిని జీజీహెచ్ కు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 313 కేసులు నమోదు కాగా, ప్రస్తుతం 60 మంది వరకు చికిత్సలు పొందు తున్నారు. చికిత్స తీసుకొని మరో 253 మంది ఇళ్లకు వెళ్లిపోయారు. గత 6 రోజులతో పోల్చిచూస్తే పరిస్థితి కాస్త కుదుటపడింది. కొత్త కేసుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతుంది. బాధితులకు శిబిరాల్లోనే మందులతో పాటు ఐవీ ఫ్లూయిడ్స్ అందిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసదుపాయాలు బాగున్నాయని బాధితులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్నీ సక్రమంగా అందివ్వడం వల్ల వేగంగా కోలుకున్నామని బాధితులు చెబుతున్నారు. బాధితులు కూలీ పని చేసుకునేవారు కావడం వలన ఉపాధిపరంగా ప్రభుత్వం సాయం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆహార పదార్థాలతోపాటు కుటుంబానికి 10 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రాజరాజేశ్వరిపేటలో ముందుజాగ్రత్తగా రక్షితనీటి పథకం తాగునీటి సరఫరాను ఆపేశారు. దానికి బదులుగా ఇంటింటికీ వాటర్ క్యాన్లను అందిస్తున్నారు. సమస్య తీవ్రం కాకుండా మినరల్ వాటర్ ప్లాంట్లను మూసివేశారు. హోటళ్లను, కిరాణా షాపులను, చిన్నచిన్న దుకాణాలను మూసివేయించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని అధికారులు సూచిస్తున్నారు. కేసుల ఉధృతి తగ్గిందని,భయాందోళన చెందవద్దని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కోరారు.

## ప్రతి శుక్రవారం 'ఇంటింటా మనమిత్ర' పై ప్రచారం

### - ఐటి మరియు ఆర్టీజి శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని

**విజయవాడ,సెప్టెంబరు16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలెవ్వరూ కూడా సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా అన్ని సర్టిఫికెట్లు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే డౌన్ లోడు చేసుకునే విధంగా ప్రజలకు తెలియజెప్పాలని ఐటీ, మరియు ఆర్టీజీ శాఖల కార్యదర్శి భాస్కర్ కాటంనేని జిల్లా కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఆయన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అమలుపై ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అద్భుతమైన సాధనమని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చేయడంలో జిల్లా కలెక్టర్లే కీలకపాత్ర పోషించాలన్నారు. క్యాస్ట్, నేటివిటీ, జనన, మరణ ధృవీకరణ పత్రాలు ఇతరత్రా సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, దయచేసి సర్టిఫికెట్ల జారీ కోసం ప్రజలను ప్రభుత్వ కార్యాలయాలకు పిలిపించుకోకండని ఆయన కోరారు. ఇప్పటికీ కూడా చాలా మంది అధికారులు సర్టిఫికెట్ల జారీ కోసం ప్రజలను కార్యాలయాలకు పిలిపించుకుంటున్నారని ఇది సరికాదన్నారు. జిల్లా స్థాయిలో కింది స్థాయి కార్యాలయాల్లో, అధికారులు, సిబ్బందికి ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాలన్నారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్‌లోనే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్ డౌన్ లోడు చేసుకోవచ్చన్నారు. వాట్సాప్ ద్వారా డౌన్‌లోడు చేసుకునే డిజిటల్ సర్టిఫికెట్లు సురక్షితమైనవని, అన్ని సర్టిఫికెట్లను డిజిలాకర్లో ఉంటాయని, అలాగే బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని, కాబట్టి ఈ సర్టిఫికెట్లను ఎవ్వరూ కూడా ట్యాంపర్ చేయలేరని తెలిపారు. ప్రజల్లో వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగించుకుంటే ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలుంటాయో ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. ప్రతి శుక్రవారం గ్రామవార్డు సచివాలయ సిబ్బందిని ప్రతి ఇంటికి పంపి, అక్కడ ప్రజలతో మమేకమై వారికి మనమిత్ర యాప్ ఎలా ఉపయోగించుకోవచ్చో వివరంగా తెలియజెప్పి అవగాహన కల్పించాలన్నారు. ఇది పూర్తిగా విజయవంతం చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదేనన్నారు. అధికారులకు సైతం వాట్సాప్ గవర్నెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు ఆయా జిల్లాలు, మండలాల్లో అమలు ఏ స్థాయిలో ఉంది, ప్రజల సంతృప్తి ఎలా ఉందనేది మనమిత్రలోనే తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటికీ రెవెన్యూశాఖలో పనులు సంక్లిష్టంగా ఉన్నాయని మెజార్టీ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 738 రకాల సేవలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. తదుపరి కూడా మరిన్ని సేవలను ఇందులో జోడిస్తామన్నారు.

## ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు రాష్ట్రంలో 15.28 కోట్ల పని దినాలు

### - పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి, శశిభూషణ్ కుమార్



**విజయ వాడ,సెప్టెంబరు 16,ప్రభాత వార్తప్రతి నిధి:** ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు రాష్ట్రం లో 15.28 కోట్ల పని దినాలు కల్పించినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ వెల్లడించారు. ఏపీ సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇది నిర్ధేశించిన లక్ష్యం కన్నా ఎక్కువని అన్నారు. మొత్తం 63.60 లక్షల మందికి పని కల్పించినట్లు చెప్పారు. ఈ పథకం కింద రూ.6057.84 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పల్లె పండుగలో భాగంగా 4 వేల కిలోమీటర్ల సిసి రోడ్లును అభివృద్ధి చేసినట్లు చెప్పారు. 22,514 పశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

రాష్ట్రంలో 10 లక్షల ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం ఇప్పటికే 1.02 లక్షల ఫామ్ పాండ్స్ నిర్మాణాలు పూర్తైనట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లను సిసి రోడ్లుగా అభివృద్ధి చేసే పనులు వేగవంతం చేశామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 71,436 కిలో మీటర్ల మేర అంతర్గత రోడ్లు ఉన్నాయని, వాటిలో 58,436 రోడ్లు సిసి రోడ్లుగా మార్చామని తెలిపారు. రోడ్లు అనుసంధానం లేని గిరిజన ప్రాంతాలకు అడవి తల్లి బాట కార్యక్రమంలో భాగంగా రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

## పోలవరం ప్రాజెక్ట్ 2027 డిసెంబర్ నాటికి పూర్తి : ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్



**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చడమే ధ్యేయంగా అన్ని ప్రాంతాలకు, రంగాలకు పుష్కలంగా నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ తెలిపారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిరోజు జలవనరులపై ఆయన ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం వాతావరణంలో అనూహ్య మార్పులు వచ్చాయని తెలిపారు. ఎప్పుడు వర్షం వస్తుందో క్లౌడ్ బరస్ట్ అవుతుందో అంతుపట్టని విధంగా ఉందని అన్నారు. ఇటువంటి అసమానతల మధ్య నీటి సంరక్షణ పెద్ద సవాలుగా మారుతుందని పేర్కొన్నారు. ఉన్న నీటి వనరులను ఎలా సరరక్షించుకోవాలనే అంశంపై కలెక్టర్లు దృష్టి సారించాలని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో 88.99 శాతం నిండాయని పేర్కొన్నారు. 1,014 టిఎంసిల నీటి సామర్థం ఉన్న రిజర్వాయర్లు ఉంటే 914 టిఎంసిల నీటి లభ్యత ఉందని వివరించారు. అలాగే చిన్న, మధ్య తరహా రిజర్వాయర్లు కూడా నిండాయని మంచి శుభపరిణామమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో 38,457 మీడియం ఇరిగేషన్ ట్యాంకులను అభివృద్ధి చేయాలని సంకల్పించామన్నారు. ఇప్పటికే 5,815 ట్యాంకులను పూర్తి చేశామని చెప్పారు. వీటిపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 7,762 గ్రామాల్లో భూగర్భ జలాల నీటిమట్టం ఎనిమిది మీటర్ల కంటే దిగువన ఉన్నాయని, వాటిని రీఛార్జి చేయించాలని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికల్లా పూర్తి చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. పనులు వేగవంతంగా చేపట్టి లక్ష్యానికంటే ముందుగానే జూన్ 2027 నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

## కరుణాకర్‌రెడ్డి అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్: టిటిడి బోర్డు

**తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిలో రెండుసార్లు ఛైర్మన్‌గా పనిచేసిన భూమన కరుణాకర్‌రెడ్డి పనిగట్టుకుని అదే సంస్థపై,దేవునిపై అబద్దాలు ప్రచారం చేయడం మంచిదికాదని, అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ భూమన కరుణాకర్‌రెడ్డి అని టిటిడి బోర్డు సభ్యులు పేర్కొన్నారు. టిటిడిపై అబద్దపు, అసత్యప్రచారాలను ప్రజలోకి తీసుకెళుతూ తిరుమల పవిత్రత ,ప్రతిష్ట దెబ్బతీస్తున్నారన్నారు. అలిపిరి వద్ద గతంలో ఒక ప్రైవేట్ శిల్ప క్వార్టర్స్ ఉండేదని, పట్టుకన్నయ్యఅనే శిల్పి నిర్వహించేవాడని తెలిపారు. మంగళవారం ఉదయం టిటిడి ఛైర్మన్ క్యాంప్ కార్యాలయం వద్ద బోర్డు సభ్యులు



భానుప్రకాశ్‌రెడ్డి, ఎంఎస్‌రాజు, దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి మీడియాతో మాట్లాడారు..అలిపిరి వద్ద శ్రీమహావిష్ణువు విగ్రహం పడేసి మలమూత్రాదులు, మద్యంబాటిళ్ళు వేశారని భూమన అబద్దాలు వల్లిస్తున్నారన్నారు. అంతా చేసి ఆయన ఏదో అపచారం అంటూ బాధపడుతున్నారని ఎద్దేవాచేశారు. గతంలోనే బెంగుళూరుకు చెందిన ఓ భక్తుడు శనీశ్వరుడు విగ్రహం ఆర్డర్‌చేశాడని, శిల్పం తయారీలో లోపం రావడంతో ఆ భక్తుడు మరణించడంతో ఆ విగ్రహాన్ని అక్కడే పడేశారన్నారు. అయినా శనీశ్వరుడి విగ్రహానికి ముఖం కూడా చెక్కలేదన్నారు. గత పదేళ్ళుగా ఆ విగ్రహం అక్కడే పడివుందని, ఇప్పుడు కరుణాకర్‌రెడ్డి ఆ విగ్రహాన్ని మహావిష్ణువు విగ్రహని అబద్దపు ప్రచారం చేస్తున్నారని బోర్డు సభ్యులు హాస్యం చెందారు. మద్యం బాటిళ్ళు పడేసి పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై పిసి ఘోష్ కమిషన్ నివేదిక మాజీ సిఎస్ ఎస్‌కె జోషికి హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ చీఫ్ సెక్రటరీ శైలేంద్ర కుమార్ జోషి (ఎస్‌కె జోషి)కి హైకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఆధారంగా ఎస్‌కె జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ధర్మాసనం మంగళవారం నాడు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలపై విచారించిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇటీవలే సర్కారుకు నివేదిక సమర్పించడం తెలిసిందే. దీని ఆధారంగా ఎసిబి అధికారులు పలువురికి నోటీసులు ఇవ్వడం, విచారించడం విదితమే. ఇదే క్రమంలో ఎసిబి నుంచి తాఖీదులు అందుకున్న మాజీ సిఎస్ ఎస్‌కె జోషి ఈ కేసులో తనను సాక్షిగా మాత్రమే పిలిచారని, ఇదే అంశంపైనే తాను వాంగ్మూలం ఇచ్చానని, అంతకు మించి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో పాటు ఈ విషయంలో సర్కారు తనపై తొందరపడి ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశించారు.

వార్త

మన మనస్సే మనకు పెట్టని కోట. అదిగాని దెబ్బతింటే జీవిత సమరంలో మనం ఓడిపోతాం.

-రాజాజి

# పంచాయతీలను నిర్వీర్యం చేయొద్దు

జాతిపిత మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలక పెద్దలు ఏనాటి నుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చే సరికి అవి మాటలకే పరిమితమవుతున్నాయి. స్వాతంత్ర్యంవచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉంది. కనీసం రాజ్యాంగం కల్పించిన అధికారాలు కూడా స్థానిక సంస్థల ప్రతి నిధులకు అప్పగించేందుకు పాలక పెద్దల మనస్సు ఒప్పడం లేదు. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్ర్యం వచ్చిన ప్పటినుంచి ఎందరో నాయకులు ఇవేమాటలు చెప్తున్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వెల్లడిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామ సర్పంచులకు ఒక వ్యూహం ప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తున్నారనేది స్పష్టమవుతున్నది. అందుకే గతంలో గ్రామ సర్పంచులకు, మండల అధ్యక్షులకు తదితర స్థానికసంస్థల ప్రతినిధులకు నాడు ఉండే గౌరవం నేడు కన్పించడం లేదు. దాదాపు అధికారం లేని ఉత్సవవిగ్రహాలుగా మార్చారనే చెప్పొచ్చు. ఇందుకు కారణం వారూ, వీరు అనేదాని కంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే ప్రయత్నం చేశారని చెప్పొచ్చు. గ్రామస్థాయిలో రకరకాల కమిటీలు పెట్టి సర్పంచులను దాదాపు పక్కన పెట్టారు. వారిప్రమేయం లేకుండానే వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితులు తీసుకు వచ్చారు. ఒకరకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితేగత ప్రభుత్వ వాలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టడంతో సర్పంచ పదవులు నామమాత్రంగా మిగిలిపోయాయి. ఇలాంటి చర్యలతో సర్పంచులకు గతంలో ఉన్న ప్రాధాన్యత కూడా లేకుండా పోయింది. నేతల వాగ్దానాలతో ఏదో సాధించాలని, సమాజానికి ఏదో చేయాలని నూతన ఉత్సాహంతో ఎందరో యువతీయువకులు ఎన్నికల్లోపోటీ చేసి ఎన్నో వ్యయ ప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. ఇందులో విద్యాధికులు కూడా ఉన్నారు. గ్రామాభివృద్ధికి తాము చేసిన వాగ్దానాలు తీర్చేందుకు నడుంకట్టారు. ఈ చట్టాల వలలో తాము చేయలేమనే విషయం అర్థం కావడానికి వారికి చాలాకాలమే పట్టింది. అయితే కొందరు స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రజలకు తాముచేసిన వాగ్దానాలను పూర్తి చేసేందుకు తలతాకట్టుపెట్టి తలకుమించిన భారంతో వడ్డీకి అప్పోసొప్పో చేసి కొన్ని గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. అయితే ఎంతకూ ఆ బిల్లులు రాకపోవడం, ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి, ఇంకొకపక్క అప్పులు, వడ్డీలు పెరిగి, మరొకపక్క గ్రామప్రజల నుంచి తలవంచుకోలేక, ఆత్మాభిమానం చంపుకోలేక, డజన్ మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ బిల్లులకోసం తిరిగి తిరిగి సర్పంచులు పడిన వేదనఅంతా ఇంతా కాదు. గతయేడాది జనవరి 31తేదీతో వారి పదవీ కాలం పూర్తయిపోయింది. ఆనాటి నుంచి వారు మాజీలైపోయారు. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు పంతొమ్మిది నెలలుగా మాజీ సర్పంచులుగా ఆఫీసులచుట్టూ ఈబిల్లుల కొరకు ప్రదక్షిణలు చేస్తున్నారు. బిల్లులు వస్తాయో, రావో తెలియదు. వస్తే ఎప్పుడు వస్తాయో చెప్పేవారు లేరు. సర్పంచులుగా ఉన్నప్పుడే కనీసమర్యాద ఇవ్వని కొందరు అధికారులు మాజీలైపోయిన తర్వాత వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అంతా అగమ్యగోచరంగా ఉంది. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే ఎంతో గౌరవ మర్యాదలుండేవి. ఆగ్రామానికి సంబంధించిన ఏ కార్యక్రమాలు జరిగినా ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చినా సర్పంచులకు ప్రాధాన్యత ఇచ్చేవారు. వాస్తవంగా భారతదేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉంది. అప్పుడు కూడాగ్రామ సభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికవ్యవస్థ ఎంతోప్రాధాన్యతఇచ్చేది. ప్రాచీన కాలం నుండి గ్రామవ్యవస్థ ఏదో ఒకరూపంలో భారత్‌లో కొనసాగుతూనే వస్తున్నది. 1882 లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామ స్వరాజ్యలక్ష్యంలో స్థానికసంస్థల పటిష్టత అన్నది ఒక ముఖ్యాంశం. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952నుంచిఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు, చేర్పులు చేసి పంచాయతీరాజ్ వ్యవస్థపటిష్టానికి కృషి చేస్తున్నట్లు చెప్పుకున్నారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి పాలకపెద్దలకు నేటికీ మనసు ఒప్పడంలేదు. సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి వీధి లైట్ల నిర్వహణ, పర్యవేక్షణ ఇకనుండి గ్రామసర్పంచులకు అప్పగించాలని ఆదేశాలు జారీచేశారు. గ్రామాల్లోఅవసరమైనన్ని కొత్త ఎల్ఇడి లైట్లను అమర్చడంతోపాటు, వాటిని సమర్థవంతంగా నిర్వహించేనిర్వహణ అధికారం గ్రామపంచాయతీ పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు. ఇదేకాదు రాజ్యాంగం కల్పించిన అధికారాలతో పాటునిధులు కూడా సకాలంలో అందేలాఏర్పాటు చేయాల్సిన అవసరంఉంది. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది వంటిది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలకు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న నాయకులు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడం దురదృష్టకరం.

" మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.



లియో టాల్‌స్టాయ్

" విధుల నిర్వహణ మార్గమే పేరు ప్రతిష్టల సంపాదనకు దారితీస్తుంది.



మహాత్మా గాంధి

## ప్రజావాక్కు



### పెన్షన్లు పెంచండి

ప్రభుత్వ ఉద్యోగాలు ఎన్ని సంస్థలలో పనిచేసినా వచ్చేది ఒకే పెన్షన్. ఆశ్చర్యమేమంటే రాజకీయ ఉద్యోగాలు చేసిన వారికి పెన్షన్లు ఎన్నో ఉన్నాయట. ఈమధ్య ఈ విషయం తెగ వైరల్ అవుతోంది. ఒక వ్యక్తి ఎమ్మెల్యేగా, మరోసారి ఎమ్.పి.గా ఆతదుపరి ఏ గవర్నరుగానో, ఒకసారి ఎన్నుకోబడగానే ఆ తరువాత పూర్తి కాలం పని చేయక పోయినా ఎన్ని పదవులు అలంకరిస్తే అన్ని పెన్షన్లు వస్తాయట. జీవితాంతం వరకు వైద్య, ప్రయాణ సదుపాయాలు ఉచితంగా లభిస్తాయట. మరల మరణానంతరం వారి నామినీలకు ఇస్తారట ఇదేమి చిత్రమోకదా! ఈ అసంబద్ధ, అమానుష, వికృత దూబరా ఖర్చులను తగ్గించమని ఏనాడూ ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యులు గౌరవ సభలలో ప్రశ్నించరు. ఇప్పుడైనా పెన్షన్లు పెంచండి.

- ఎన్ రామలక్ష్మి, సికింద్రాబాద్

### డంపింగ్ యార్డ్‌లు

రోడ్డుప్రక్కన, ప్రజలు నిత్యం ప్రయాణించే చోట, గ్రామాలకు పట్టణాలకు అతి సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లను వేరొక చోటుకు మార్చాలి. ప్రజలు సంచరించే చోట నిత్యంరద్దీగా ఉండే చోట రోడ్డుపై డంపింగ్ యార్డ్‌లు ఉండడం వలన అటుగా వెళ్లే ప్రజలు ఒక కిలోమీటర్ వరకు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. చిన్న పిల్లలు మురుగు వాసనలకు వాంటింగ్ చేసుకుంటున్నారు. నిత్యం డంపింగ్ యార్డ్ నుండి ప్రయాణం చేసే ప్రజలు అనారోగ్య సమస్యలు ఊపిరితిత్తు సమస్యలు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు వెంబడి ఉన్న డంపింగ్ యార్డులను అచటి నుండి తొలగించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### చెరువుల పట్ల నిర్లక్ష్యం చూపవద్దు

నీరే మనుగడకు ప్రాణాధారం. అటువంటి చెరువులను పూడ్చి వేస్తూ ప్రమాదకరమైన స్థలంలో ఇల్లు నిర్మించడం ప్రమాదకరమని తెలిసినా ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోకపోవడం, పేద ప్రజలకు అటువంటి స్థలాలపై అవగాహన లేక అక్కడేనివాసం ఉండటం, వర్షాకాలంలో ఆ ఊర్లు నీటమునిగి ఎన్నో విపత్తులకు గురవ్వడం, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా వరదల్లో ఊర్లు కొట్టుకుపోకుండా ప్రభుత్వం దృష్టి సారించాలి.

- కాల్వ నిఖిత, సిద్ధిపేట

### డిఎస్సీ జాబితాల్లో లోపాలు సరిచేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2025 సెలెక్షన్ లిస్ట్ ప్రకటించింది. అయితే ఈ ఎంపిక జాబితాలలో ఎక్కువ మార్కులు ఉండి ఓపెన్ కేటగిరిలో సెలెక్ట్ కావలసిన అభ్యర్థులు రిజర్వేషన్ కేటగిరిలో ఎంపిక చేసినట్లు డిఎస్సి అభ్యర్థులు తెలుపుతున్నారు. దీంతో రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులకు అన్యాయం జరిగినట్లుగా తెలుస్తోంది. డిఎస్సీ ఎంపిక జాబితాల్లో లోపాలున్నాయని డిఎస్సి అభ్యర్థులు చెబుతున్నారు. కాబట్టి వీటిని సరి చేసేందుకు అభ్యర్థుల నుంచి గ్రీవెన్స్ తీసుకొని వాటిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. వాటిని సరి చేసిన తర్వాతే డీఎస్సీ ప్రక్రియ ముందుకు పోవాల్సి ఉంది. అభ్యర్థులకు అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం ఇవ్వాలి. డీఎస్సీ అభ్యర్థి నుంచి అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిష్కరించిన తర్వాత తుది ఎంపిక జాబితాలు ప్రకటించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### రిజర్వేషన్ సమానత్వానికి ఆవశ్యకత

మన దేశంలో సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధన కోసం రిజర్వేషన్లు ఒక శక్తివంతమైన సాధనంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఇవి అత్యవసరం. బీసీవర్గాలు జనాభాలో పెద్ద శాతం ఉన్నప్పటికీ, వారికి ఉన్న రిజర్వేషన్ వాటా తక్కువగా ఉండడం వలన అనేకరంగాలలో వారు వెనుకబడిఉన్నారు. బీసీల ఆర్థిక, సామాజిక, విద్యా పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేయడం న్యాయసమ్మతమే. ఇది వారికి విద్య, ఉపాధి అవకాశాలలో సమాన స్థానం కల్పిస్తుంది. సమాజంలో సమతుల అభివృద్ధి సాధించాలంటే బలహీన వర్గాల ఆవశ్యకతలను గుర్తించి చర్యలు తీసుకోవాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### రైతులను ఆదుకోండి

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన రైతు, వాతావరణ మార్పులకారణంగా తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నాడు. సకాలంలో రుతుపవనాలు రాక పంటలు ఎండిపోతుంటే, అకాల వర్షాలు చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్నాయి. పెట్టుబడికి తగిన గిట్టుబాటు ధర లేకపోవడం, పంట నష్టాలు, అప్పుల భారం రైతులను ఆత్మహత్యల వైపు నెడుతున్నాయి. గణాంకాల ప్రకారం, ప్రతిరోజూ సగటున 28 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నిజాం బూజు దులిపిన 'విమోచనం'

**ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొము రయ్య, కొమరం భీమ్ వారసత్వాన్ని ముందు తరాలకు ఇవ్వాల్సిన బాధ్యత గుర్తెరగాలి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చరిత్రను గుర్తెరిగి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి. లేదంటే అమరుల త్యాగాలకు అర్థంలేకుండా పోతుంది. వారి ఆకాంక్షలు ఆవిరి అవుతాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఎలాగయితే జమ్మూ కాశ్మీర్‌కి ఆర్టికల్ 370 తీసి నిజమైన స్వతంత్ర్యాన్ని అందించిందో అలాగే తెలంగాణ రాష్ట్రంలో విమోచన దినోత్సవం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఇంకా తెలంగాణ విమోచన ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చి భవిష్యత్తు తరాలకు అందించాలి. తెలంగాణ అమరుల, స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను, వారి త్యాగాలకు గుర్తుగా మ్యూజియం ఏర్పాటు చేయాలి. శౌర్య భావన విడిచిన నాడు అమరుల కథలను మరిచిన నాడు మనుగడ లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విమోచన దినోత్సవాన్ని పల్లె పల్లెన జరపాలి.**

ఆర్. భాస్కర్ రెడ్డి

తెలంగాణ ప్రజలు ఎన్నో బాధలను దిగమింగినా, అనేక కష్టాలను చవిచూసినా, ఎన్నో అన్యాయాలను సహించి, ధర్మాన్ని విడనాడకుండా అవమానాలను ఎదుర్కున్నా కూడా ఆత్మగౌరవాన్ని విడనాడలేదు. సరికదా ఏ పాలకుల ముందు మోకారిల్లలేదు. కానీ భారతదేశం విదేశీ కబంధ హస్తాల నుంచి విముక్తి లభించి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే సమయానికి ఈ దేశంలోని మూడు ప్రాంతాలు స్థానిక సంస్థానాల రాజుల చేతిలో బంధీగా చిక్కి చీకట్లో గడుపుతుండేవి. అందులో హైదరాబాద్ సంస్థానం ఒకటి. దేశాన్ని బ్రిటిష్ వలస పాలకుల చేతిలోంచి విముక్తి చేసి స్వాతంత్ర్యాన్ని సాధించిన ఆగస్టు 15న ప్రాణత్యాగం చేసిన సమర యోధులను వారి త్యాగాలను గుర్తు చేసుకుంటున్నాం. హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ సంస్థానాల ప్రజలు మాత్రం బంధీగా ఉన్నారు. కాశ్మీర్, జునాగఢ్ సంస్థానాలు దేశంలో విలీనం కాగా హైదరాబాద్ సంస్థానం మాత్రం 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో సైనిక చర్యతో నిజాం నిరంకుశ పాలన నుంచి విమోచనం పొంది దేశంలో విలీనం అయ్యింది. ఈ నిజమైన స్వాతంత్ర్య దినోత్సవాన్ని గూర్చి చాలా మంది తెలంగాణ ప్రజలకు ఇంకా తెలవకపోవడం దౌర్భాగ్యం. అప్పటి హైదరాబాద్‌లో భాగంగా వున్న కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలలో అక్కడి ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఇప్పటికి జరపట్లేదు. పక్క రాష్ట్ర పాలకులు గుర్తించలేదు అందుకే ఆత్మగౌరవంతో బతకాలని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని పేరు మార్చి జరపడంలో ఆంతర్యం అర్థం కావడం లేదు. చరిత్రను నిశితంగా పరిశీలిస్తే 1724లో మొదటి నిజాం హైదరాబాద్‌రాజ్య స్థాపన చేసే సమయానికి రాజ్యం భౌగోళికంగా అత్యంత పెద్దది. ఆర్థికంగా బలమైన రాజ్యం. ఇది గమనించిన బ్రిటిష్ పాలకులు నిజాం రాజులతో సయోధ్య చేసుకుని ఒక్కొక్క ప్రాంతాన్ని తమ పాలన కిందికి తెచ్చుకుని, నిజాం రాజులకు బిరుదులు ప్రసాదించారు. తర్వాతి కాలంలో నిజాం వారసులు వారి అసమర్థ, అసంబద్ధ నిర్ణయాలతో ఉత్తర సర్కారులను, దత్తమండలాలను కోల్పోయారు. అంతేకాకుండా 1857 మొదటి స్వాతంత్ర్య సమరం జరుగుతున్న సమయంలో దేశంలోని చాలా సంస్థానాలలో రాజులూ వలసవాద పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంటే, ఇక్కడున్నటువంటి నిజాం రాజులు మాత్రం బ్రిటిష్ వారికీ కొమ్ముకాసి విదేశీ పాలనను ప్రోత్సహించారు. బ్రిటిష్ వారికీ వ్యతిరేకంగా పోరాడిన తుర్రేబాజ్ ఖాన్‌ని చంపించివేశారు. ఇక్కడి ప్రజల స్వాతంత్ర్యపు ఆకాంక్షలను ఆవిరి చేశారు. అప్పుడే ఇక్కడి ప్రజలలో స్వాతంత్ర్యం సాధించుకోవాలన్న ఆకాంక్షకు బీజం పడింది. బ్రిటిష్ నిర్ణయాలను అమలుపరిచిన నిజాంలు హైద్రాబాద్ రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితికి తెచ్చారు. మొదటి సాలార్‌జుంగ్ తన అద్భుతమైన పాలనాపరమైన నిర్ణయాలతో ఆర్థికంగా బలోపేతం చేసి గట్టి పునాది వేశాడు. కానీ ఇతడు నాన్ ముల్కిలను ప్రోత్సహించి ఈ ప్రాంతంలోని ప్రజలకు అన్యాయం జరిగేలా చేశాడు. హైద్రాబాద్ సంస్థానాన్ని పాలించిన నిజాం రాజులూ ఈ ప్రాంతంలోని ప్రజల మనో భావాలకు అనుగుణంగా ఎప్పుడూ పరిపాలన కొనసాగించలేదు. ముఖ్యంగా 90శాతం ప్రజల మాతృభాషా తెలుగు అయినప్పటికీ ఉర్దూను అధికార భాష చేసి పరిపాలన కొనసాగించడం చూస్తేనే ఈ ప్రాంత ప్రజలకు ఎంత విలువ ఇచ్చాడో అర్థం అవుతోంది. ఏ నిజాం రాజు ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేయకున్నా వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతం




కనుక ఆర్థికంగా బలోపేతం అయ్యింది. ఇక్కడి ప్రజలు వారి రక్తాన్ని చెమట రూపంలో చిందిస్తే వచ్చిన ఆదాయాన్ని పన్ను రూపంలో వారి తాబేదార్లతో కట్టించి వెట్టి చాకిరీ చేయించి వారి కోసం రాజ సౌధాలను, భవంతులను వారి సుఖ సౌఖ్యాల కోసం కట్టించుకొని తులతూగారు. పైగా ఏ రోజు ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగించలేదు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించారు. కానీ అప్పట్లో చదువుకున్న కొందరు మేధావులు మన సమస్యలను గుర్తించి 1901లో గ్రంథాలయ ఉద్యమం పేరుతో అక్షర జ్ఞానాన్ని ఇచ్చి ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించారు. ఆ తర్వాత 1930లో ఆంధ్రమహా సభ పేరుతో ప్రతి సంవత్సరం సమావేశాలు నిర్వహించి ఇక్కడ వున్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా కూడా ఇక్కడి ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. కొద్దికాలం తర్వాత ఆంధ్రమహాసభలో చీలిక వచ్చి అతివాద, మితవాద వర్గాలుగా ఏర్పడి నిజాం పరిపాలనపై సాయుధ పోరాటం చేయడం ఆరంభించారు. ఈ పోరాటం 1947ఆగస్టు 15 తర్వాత ఇంకా ఉధృతం చేసారు. కానీ కాశింరిజ్వీ సహకారంతో అప్పటి 7వ నిజాం ప్రజల మాన ప్రాణాలను హరించాడు. నిరంకుశ, నియంతృత్వంగా పాలించాడు. 1947 ఆగస్టు 15 నుంచి 1948 సెప్టెంబర్ 17మధ్యకాలంలో ఇక్కడి ప్రజల స్వేచ్ఛను హరించాడు. షోయబుల్లాఖాన్ లాంటి, ఆర్యసమాజ్ నాయకుడు నరేందర్ లాంటి వాళ్లను దారుణంగా చంపించివేశాడు. బైరంపల్లి, పరకాల, రేణికుంట, గుండ్రంపల్లిలలో మరో జలియన్ వాలా బాగ్‌లను తపించేలా ప్రజలను పిట్టలను కాల్చినట్టు కాల్చివేశారు. ఊళ్లకు ఊళ్లను తగుల పెట్టి మహిళలను వివస్త్రలను చేసి బతుకమ్మ ఆడించి, అత్యాచారాలు చేశారు. ప్రాణాలను హరించివేశారు. ఇంకో వైపు పాకిస్థాన్‌తో సంప్రదింపులు జరుపుతూ యూఎన్‌ఓలో కూడా అప్పీల్ చేశాడు. చివరకు ఆనాటి హోంమంత్రిసర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవ కారణంగా 1948 సెప్టెంబర్ 17 విమోచనం పొంది. దేశంలో విలీనమైంది. ఇక్కడున్న కమ్యూనిస్టు నాయకులు రైతాంగ సాయుధ పోరాటం పేరుతో స్వాతంత్ర్యం సాధించుకోవాలని ప్రజలకు చెబుతూనే తెలంగాణ ఒక ప్రత్యేక దేశంగా కావాలని 1952 మొదటి సార్వత్రిక ఎన్నికల వరకు భారత ప్రభుత్వంపై పోరాడారు. కమ్యూనిస్టు నాయకులు వారి స్వార్థంకోసం 1956లో విశాలాంధ్ర పేరుతో ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణ కలపాలని చెప్పి ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేశారు. వీరి రాజకీయ చదరంగంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పక్కరాష్ట్రం నుంచి అనేకమంది ఉపాధి గూర్చి ఇక్కడికి వలసలు వచ్చారు. ఇక్కడి విద్యార్థులు భూర్గుల రామకృష్ణరావు సర్కారుపై ముల్కి ఉద్యమం పేరుతో ఇక్కడి ప్రభుత్వాన్ని ముప్పు తిప్పలు పెట్టి తమడిమాండ్స్‌ను చాటి చెప్పారు. 1956లో పెద్దమనుషుల ఒప్పందం పేరుతో హైద్రాబాద్ రాష్ట్రంలో ఆంధ్ర రాష్ట్రం విలీనం అయింది. ఈ ఒప్పందం నీరుగారిపోయి 1969లో తొలిదశ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను ఢిల్లీ పాలకులకు వినిపించేలా చేసి, అనేకమంది విద్యార్థులు పోలీస్ తూటాలకు అమరులు అయ్యారు. ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటారు కానీ ఎన్నడూ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేదు. ఈ ప్రాంత రాజకీయ నాయకులు కొందరు వారి ఆత్మగౌరవాన్ని పక్క రాష్ట్ర పాలకులకు, ఢిల్లీ పాలకులకు తాకట్టుపెట్టారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి, నిరుద్యోగ యువకులు ఆత్మగౌరవ తెలంగాణ రాష్ట్ర కోసం పోరాటం చేసి 1200 మందికి పైగా ప్రాణత్యాగం చేసారు. రక్తం చిందించకుండా అహింసాయుత పద్ధతిలో విరామం లేకుండా ఉద్యమించి రాష్ట్ర సాధనలో సఫలీకృతులైనారు. కానీ మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఇక్కడి నాయకులు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొము రయ్య, కొమరం భీమ్ వారసత్వాన్ని ముందు తరాలకు ఇవ్వాల్సిన బాధ్యత గుర్తెరగాలి. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం చరిత్రను గుర్తెరిగి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి. లేదంటే అమరుల త్యాగాలకు అర్థంలేకుండా పోతుంది. వారి ఆకాంక్షలు ఆవిరి అవుతాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఎలాగయితే జమ్మూ కాశ్మీర్‌కి ఆర్టికల్ 370 తీసి నిజమైన స్వతంత్ర్యాన్ని అందించిందో అలాగే తెలంగాణ రాష్ట్రంలో విమోచన దినోత్సవం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఇంకా తెలంగాణ విమోచన ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చిభవిష్యత్తు తరాలకు అందించాలి. తెలంగాణ అమరుల, స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను, వారి త్యాగాలకు గుర్తుగా మ్యూజియం ఏర్పాటు చేయాలి. శౌర్య భావన విడిచిన నాడు అమరుల కథలను మరిచిన నాడు మనుగడ లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విమోచన దినోత్సవాన్ని పల్లె పల్లెన జరపాలి. ●

# ఉపాధి లేక వలసబాట పడుతున్న యువత

తరిగోపుల నారాయణస్వామి

భారతదేశం ప్రపంచంలో అత్యంత జనసంఖ్యగల దేశాలలో ఒకటిగా ఉంటుంది. ఈ దేశంలోని యువత శక్తి దేశాభివృద్ధికి ముఖ్యమైనదే. కానీ, ప్రస్తుతానికి నిరుద్యోగం దేశానికి ఒక పెద్ద సవాలు అయిపోయింది. ప్రతి సంవత్సరం లక్షల మంది యువత విద్యాభ్యాసం పూర్తిచేసి కూడా ఉపాధి అవకాశాలు లేకుండా నిరుద్యోగంగా ఉంటున్నారు. ఇది వ్యక్తిగత స్థాయిలో ఆర్థిక సమస్యలు కలిగించడమే కాకుండా, సామాజిక అసమతుల్యతను పెంచే కారణంగా మారుతోంది. ప్రపంచ బ్యాంక్ ప్రకారం, భారతదేశంలో ఉద్యోగాల వృద్ధిరేటు, జనాభా వృద్ధిరేటు మధ్య వ్యత్యాసం కారణంగా నిరుద్యోగ సమస్య అనేక ప్రాంతాల్లో తీవ్రంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో మానవ శక్తి అవసరం తగ్గిపోవడం, ఆధునిక యంత్రాలతో వ్యవసాయ పనులు జరుగడం వల్ల నిరుద్యోగిత చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ఇది యువతను వలసగా పట్టణ ప్రాంతాలకు తరలించడంలో ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. 2021లో విడుదలైన రాష్ట్ర ఆర్థిక నివేదిక ప్రకారం, విద్యార్హులైన యువతలో నిరుద్యోగ దరఖాస్తుల సంఖ్య లక్షలుగా నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో యువత ప్రత్యేకంగా ఉద్యోగ అవకాశాలకోసం తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఉపాధిలేకపోవడం వలన యువత నగరాలకు వలసగా వెళ్లడం, అది పట్టణ దారిద్ర్యాన్ని మరింత పెంచుతోంది. ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించి నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. జాబ్‌కార్డులు, నౌకరీ మేళాలు, యువత



నైపుణ్య అభివృద్ధి శిక్షణలు వంటి పథకాలు ప్రారంభించారు. కొన్నిచోట్ల ఈపథకాలు కొంతవరకు ఫలితాలు ఇచ్చాయి. అయితే అవి మార్కెట్ అవసరాలకు పూర్తి అనుగుణంగా పనిచేయడం లేదు. అందువలన నిరుద్యోగిత పరిస్థితి మాత్రం సమగ్రంగా పరిష్కారం పొందలేదు. ప్రైవేట్ రంగంలో అధిక ఆధారపడే పరిస్థితి కూడా సమస్యను మరింత తీవ్రతరం చేసింది. ముఖ్యంగా మైక్రో, చిన్న, మధ్యతరగతి వ్యాపారాలు, సరైన మద్దతు లేకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర నష్టాలలో ఉన్నాయి. దీనివల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. కొవిడ్19 మహమ్మారి కాలంలో ఎంఎస్‌ఎమ్‌ఇ రంగానికి జరిగిన ప్రభావం అంతటా ఉపాధికొరతను మరింత పెంచింది. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగావకాశాలు పరిమితంగా ఉండటం మాత్రమేకాదు, నైపుణ్యలోపం కూడా ప్రధాన కారణంగా నిలిచింది. విద్యా వ్యవస్థ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా లేకపోవడం వల్ల, యువతకు అవసరమైన ప్రాక్టికల్ నైపుణ్యాలు, ఆధ్యాత్మిక శిక్షణలు అందడం లేదు. దీంతో ఉద్యోగ అవకాశాల కోసం యువత మరింత పోటీ పడవలసి వస్తున్నది. ఇటీవల ప్రభుత్వాలు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం, స్టార్టప్ మద్దతు పథకాలు అమలు చేయడం మొదలైనమార్గాల్లో ముందడుగు వేస్తున్నాయి. కానీ దీనిఅమలువ్యవస్థలో సమగ్రత లేకపోవడం, భౌతిక మౌలికవసతుల లోపం వంటివి ప్రధాన అవరోధాలుగా ఉన్నవి. అందుకే ప్రతి జిల్లాలో యువతకు అనుకూలంగా ఉండే శిక్షణాకేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యవసరం. ఈసమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు సమగ్ర ప్రణాళికలు అవసరం. విద్యార్హులైన యువతకు మార్కెట్ ఆధారిత నైపుణ్యశిక్షణలు, ఉపాధి హామీపథకాలు, ఎంఎస్‌ఎమ్‌ఇ రంగానికి ప్రత్యేక మద్దతు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య సమన్వయమైన చర్యలుచేపట్టాలి. ఇవి నిరుద్యోగ సమస్యపై పరిష్కారం చూపగలుగుతాయి. ●

# ఆదివాసీలు, లంబాడాల మధ్య వివాదానికి కారణం?

యం.అర్జున్

తెలంగాణలో ఆదివాసీ, గిరిజన తెగల మధ్య ముదురుతున్న వివాదం రాజకీయ, సామాజిక, చట్టపరమైన అంశాలను తెర మీదికి తీసుకువస్తున్నది. ఎస్టీ రిజర్వేషన్ కోటా హక్కులపై పలు ప్రశ్నలు లేవనెత్తుతోంది. గత దశాబ్దాలుగా గోండు, కోయ వంటి ప్రాథమిక ఆదివాసీ తెగలు, లంబాడీల (బంజారాలు)ను షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) జాబితా నుండి తొలగించాలనే డిమాండ్ చేస్తున్నాయి. ఎస్టీ కోటా ద్వారా లభించే విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎక్కువ శాతం లంబాడీలే లబ్ధి పొందుతున్నారని, దీనివల్ల నిజమైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి పరిణామాలు వీరి పోరాటాన్ని మరింత తీవ్రతరం చేశాయి. ఆదివాసీ తెగకు చెందిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దాఖలు చేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ (పిల్)పై 2025 ఆగస్టు 29న సుప్రీంకోర్టు లంబాడీ, సుగాలీ, బంజారా సముదాయాల ఎస్టీ స్థితిని ప్రశ్నిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో లంబాడీల ఎస్టీ స్థితిని నిర్ధారించినప్పటికీ, ఆదివాసీలు అది రాజ్యాంగం342 అధికరణాన్ని ఉల్లంఘిస్తుందని వాదిస్తున్నారు. లంబాడీలు మొదటి నుండి తెలంగాణ ప్రాంతంలో ఆదివాసీలుగా గుర్తించబడలేదని, వారి చేర్పు వల్ల తమ రాజ్యాంగపరమైన హక్కుల్ని కోల్పోతున్నామని, ఆదివాసీలు వాపోతున్నారు. ఈ అంశం రాజ్యాంగ, చట్టపరమైన చర్చలకు దారితీసింది. ఎందుకంటే ఎస్టీలు 'ప్రైమిటివ్, 'వెనుకబడిన', 'ఒంటరి' తెగలుగా గుర్తించబడాలి. ఇటీవలే ఈ అంశంపై ఆదివాసీల తరుపున సుప్రీంకోర్ట్‌లో తెల్లం వెంకటరావు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుగా నమోదైంది, ఈ విచారణలో ప్రధానంగా 1976 ఆంధ్రప్రదేశ్ ఎస్టీ ఆర్డర్ (ఏపీఎస్టీ ఆర్డర్)లో లంబాడీల చేర్పును ప్రశ్నించే అంశాలు చర్చకువస్తాయి. ఈ చట్టం 1950 జనవరి 26కు ముందు తెలంగాణలో స్థిరపడిన లంబాడీలకు మాత్రమే వర్తిస్తుందని, 1950 తర్వాత వలసల్ని చేర్చకూడదని నిబంధన ఉంది. కానీ లక్షలాది మంది ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చినవారు కూడా ఎస్టీ ప్రయోజనాలు పొందారని అభిప్రాయపడుతున్నారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. 'మహారాష్ట్రలో బీసీలు, రాజస్థాన్‌లో ఓసీలుగా ఉన్న లంబాడీ (బంజారా)లు ఇక్కడ ఎలా ఎస్టీలయ్యారు?' అని ఆదివాసీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ విచారణ ఫలితంగా వెలువడే తీర్పు ఎస్టీ జాబితాను



మార్చే అవకాశం ఉంటుందో లేదో కాలమే నిర్ణయిస్తుంది. చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 1976లో లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగింది. ఇది ఎమర్జెన్సీ కాలంలో ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం చేసిన చర్యగా ఆరోపణలు ఉన్నాయి. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇందిరా గాంధీ మెదక్ ఎంపీ స్థానం నుండి పోటీ చేసి గెలిచారు. 1971 సెన్సస్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీజనాభా 16.58 లక్షలు (మొత్తం 4.35కోట్లలో 3.81శాతం) ఉండగా, 1976 చేర్పు తర్వాత 1981 సెన్సస్‌లో 31.76 లక్షలకు (5.35 కోట్లలో 5.93 శాతం) పెరిగింది. ఈ పెరుగుదలలో లంబాడీలు(బంజారాలు) 11-12లక్షల మంది ఉన్నారని అంచనా. 1971లో వారు బీసీ 'ఏ' గ్రూప్‌లో సంచార జాతులుగా ఉండగా, 1976 చేర్పు రాజకీయ ఒత్తిడి వల్ల జరిగిందన్న ఆరోపణలు లేకపోలేదు. లంబాడీలు( బంజారాలు) మొఘల్‌బ్రిటిష్ కాలంలో సంచార వ్యాపారులుగా, రాజస్థాన్ మహారాష్ట్ర నుండి వలసలువచ్చారు. వారి సంస్కృతి, భాష (లంబాడీ రాజస్థానీ మిశ్రమం) పట్టణీకరణకు అనుగుణంగా మారింది, కానీ నిజమైన ఆదివాసీలు (గోండీ, కోయి భాషలు)దట్టమైన అడవులు, కొండల్లో ఒంటరిగా జీవిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో స్థిరపడిన లంబాడీల్ని అడవుల్లో నివసించే నిజమైన ఆదివాసీలతో కలపడం భావ్యం కాదని, ఇది ఎస్టీ గుర్తింపు స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆదివాసీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈచేర్పువల్ల ఎస్టీకోటాలో లంబాడీలు(బంజారాలు) విద్యా సంస్థల్లో ఎక్కువ శాతంలో సీట్లు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారు. మరోవైపు, ప్రాథమిక సదుపాయాలు లేకుండా ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారని, గిరిజన సంక్షేమ నిధులతో పాటు రాజకీయ అవకాశాలు కూడా ఎక్కువగా లంబాడీలకే వెళ్తున్నాయని వీరి ప్రధాన ఆరోపణ. 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు 6:1 మెజారిటీ తీర్పుతో ఎస్టీలో సబ్‌క్లాసిఫికేషన్‌ను చట్టబద్ధం చేసింది. రాష్ట్రాలు అతి వెనుకబడిన తెగలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని చెప్పింది. ఈ తీర్పును తెలంగాణ ఆదివాసీలు స్వాగతించారు. కానీ అమలు జరగలేదు. తెంగాణ షెడ్యూల్డ్ కులాల (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) యాక్ట్, 2025 ప్రకారం, 59ఎస్సీ సబ్‌కులాలను మూడు గ్రూపులుగా విభజించారు. మొత్తం 15ఎస్సీ కోటాను ఈ విధంగా విభజించడంవల్ల అతి వెనుకబడిన ఆయావర్గాలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఎస్టీలకు ఇలాంటి వర్గీకరణ ఇంకా జరగలేదు. ఆదివాసీ సంఘాలు లంబాడీల్ని ఎస్టీ జాబితా నుండి తొలగించాలి లేదా 'ఎస్సీలకు చేసినట్టు ఎస్టీల్లో కూడా సబ్‌క్లాసిఫికేషన్ చేయాలి. అందులో నిజమైన ఆదివాసీలకు ఎక్కువ శాతం రిజర్వేషన్ కల్పించాలి' అని డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయంగా, ఈ వివాదంఆదివాసీ, గిరిజన తెగలతోపాటు పార్టీల మధ్య ఘర్షణకు కారణమవుతోంది. ఈ పోరాటం కేవలం రిజర్వేషన్ కోసం మాత్రమే కాదు, సామాజిక న్యాయం, సాంస్కృతిక రక్షణకోసం. ప్రభుత్వాలు ఆలస్యం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలి. ●



దెహ్రాడూన్‌లో ఉధృత స్థాయిలో వరద దృశ్యం



ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో భారీ వర్షాలకు రోడ్డుపక్క గోతిలో పడ్డ బస్సు

# ఉత్తరాఖండ్‌లో మేఘ విస్ఫోటం

## ఆలయాల్లోకి వరద నీరు, కొట్టుకునిపోయిన ట్రాక్టర్

**డెహ్రాడూన్, సెప్టెంబరు 16:** ఉత్తరాఖండ్ దెహ్రాడూన్‌లో మేఘవిస్ఫోటం సంభవించింది. సహస్రధారలో పోటెత్తిన మెరుపువరదల్లో పలువురు గల్లంతయ్యారు. వరదతో పాటు వచ్చిన బురద, ఇతర శిథిలాల తాకిడికి అనేక ఇళ్లు, దుకాణాలు, హోటళ్లు దెబ్బతినగా, వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. సహాయకచర్యలు చేపట్టిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, ప్రభావిత ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. దెహ్రాడూన్‌లో విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. తపోవన్ ప్రాంతంలో నివాసాలు జలమయమయ్యాయి. వరదనీరు భారీగా చేరడంతో జిల్లాలోని తమ్సా, టన్స్, సాంగ్ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మాల్‌దేవతా ప్రాంతంలో ఓ వంతెన కొట్టుకుపోయింది. ముస్సోరీలో కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు తెలిసింది. రిషికేశ్‌లో చంద్రభాగానది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. నదీ ప్రవాహంలో చిక్కుకున్న ముగ్గురిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. ప్రేమ్‌నగర్ ప్రాంతంలో మైనింగ్ పనులు చేస్తుండగా, అకస్మాత్తుగా వరద ప్రవాహం రావడంతో అందులో అనేక మంది కార్మికులు చిక్కుకున్నారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. ట్రక్కుపైన ఉన్న కార్మికులు ఒడ్డున ఉన్న ప్రజలను రక్షించమని వేడుకుంటున్నట్లు విడియోలో కనిపిస్తుంది. కొన్ని సెకన్ల తర్వాత ట్రాలీ కొట్టుకుపోయి బోల్తా పడింది. దీంతో ఎనిమిది కార్మికులు చనిపోయినట్లు భావిస్తున్నారు అధికారులు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో భారీ వర్షాలకు తమ్సా ఉప్పొంగి ప్రవహించడంతో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన తపకేశ్వర్ మహాదేవ్ ఆలయం నీట మునిగింది. ఆలయ ప్రాంగణంలోకి నీరు ప్రవేశించి హనుమాన్ విగ్రహం వరకు చేరింది. అయినప్పటికీ గర్భగుడి సురక్షితంగా ఉందని ఆలయ పూజారి ఆచార్య బిపిన్ జోషి వెల్లడించారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా తలెత్తిన పరిస్థితిపై ఆరా తీయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో ఫోన్‌లో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఆరా తీశారు. ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులకు చాలా నష్టం జరిగింది. జీవనోపాధి దెబ్బతింది. ఈ సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని మోడీ హామీ ఇచ్చినట్లు ధామి తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిపాలనా యంత్రాంగం పూర్తిగా చురుగ్గా ఉందని, యుద్ధ ప్రాతిపదికన రక్షణ మరియు సహాయ కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుంది. పోలీసులు, స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని ధామి తెలిపారు. భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న ఓ నదిలో పది మంది కూలీలు కొట్టుకుపోయారు. భారీ వర్షాలకు డెహ్రాడూన్‌లోని టాన్స్ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ ట్రాక్టర్ నదిలో చిక్కుకుపోయింది. వరద ప్రవాహం పెరగడంతో కొట్టుకుపోయింది. అందులోని పది మంది కూలీలు కూడా గల్లంతయ్యారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో వైరల్ అవుతోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ హుటాహుటిన అక్కడికి చేరుకొని గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపడుతోంది.

హిమాచల్ ప్రదేశ్‌లో మరోసారి భారీవర్షాలు కురుస్తున్నాయి. రాజధాని సిమ్లా, మండి సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షంకురిసింది. ఈ వర్షానికి వరదలు సంభవించాయి. రాజధాని సిమ్లా, సమీప ప్రాంతాల్లో ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. మండి జిల్లాలోని ఓ బస్ డిపోను వరద ముంచెత్తింది. ఈ వర్షాలకు ప్రధాన రహదారులు, కాలనీలు నీట మునిగాయి. అనేక ఇళ్లు నేలకూలాయి. జనజీవనం స్తంభించిపోయింది. మండిలో రాత్రి 11 గంటల ప్రాంతంలో వర్షం ప్రారంభమైంది. తెల్లవారుజామున 1 గంట సమయానికి వర్షం తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకున్నారు. సౌలి ఖాద్ నది పొంగిపొర్లుతోంది. ధరంపూర్ సబ్ డివిజన్‌లోని బస్ డిపో పూర్తిగా నీట మునిగింది. దీంతో అనేక బస్సులు నీట మునిగాయి. బస్టాండ్ సమీపంలో ఉన్న కార్లు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. అనేక ఇళ్లు నీట మునిగాయి. అప్రమత్తమైన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎలాంటి మరణాలూ సంభవించలేదని అధికారులు తెలిపారు.

# వరదలో కొట్టుకుపోయిన ట్రాక్టర్

## డెహ్రాడూన్‌లో భారీ వర్షాలకు 10 మంది గల్లంతు, గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు

**డెహ్రాడూన్, సెప్టెంబరు 16:** ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న కుండపోత వర్షాలవల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదనీరు పోటెత్తుతోంది. దీంతో ఉత్తరాఖండ్‌లోని పలు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం డెహ్రాడూన్‌లోని నదిని దాటుతుండడానికి ప్రయత్నించగా వరద ఉధృతి పెరగడంతో ప్రమాదవశాత్తు నదిలో ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్‌లో ఉన్న 10 మంది వరదనీటిలో గల్లంతయ్యారు. స్థానికులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయిందని అధికారులు తెలిపారు. నదిలో కొట్టుకుపోయిన వారంతా కూలీలని, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గాలింపు చర్యలు కొన సాగుతున్నాయన్నారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరోప్రాంతంలో స్వర్ణ నదికి సమీపంలో వరదల్లో చిక్కుకున్న ఓ చిన్నారిని ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు డెహ్రాడూన్, ముస్సోరీ మాల్‌లోని పలు ప్రాంతాలు నీటమునగడంతో ప్రజలు వరదలో చిక్కుకుపోయారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగంగా సహాయక బృందాలు దాదాపు 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాల వల్ల అన్ని నదులు పొంగిపొర్లుతున్నాయని ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి తెలిపారు. 25నుంచి 30 చోట్ల రోడ్లు తెగిపోయాయని ఇళ్లు ప్రభుత్వ ఆస్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

# గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం

## ఐక్యరాజ్యసమితి సంచలన నివేదిక



**న్యూయార్క్, సెప్టెంబరు 16:** గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందంటూ ఐక్యరాజ్యసమితికి చెందిన స్వతంత్ర దర్యాప్తు కమిషన్ సంచలన నివేదిక విడుదల చేసింది. 2023లో హమాస్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్ బలగాలు గాజా పాలస్తీనీయులపై జాతి నిర్మూలనకు పాల్పడ్డాయని చెప్పడానికి బలమైన ఆధారాలున్నాయని నివేదిక పేర్కొంది. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిందని కమిషన్ ఆరోపించింది. అంతర్జాతీయ చట్టం ప్రకారం నిర్వచించిన ఐదు మారణహోమ చర్యల్లో నాలుగింటికి ఇజ్రాయెల్ పాల్పడిందని కమిషన్ తన 72 పేజీల నివేదికలో పేర్కొంది. ఒక వర్గానికి చెందిన వారిని చంపడం, వారికి తీవ్రమైన శారీరక, మానసిక హాని కలిగించడం, ఉద్దేశపూర్వకంగా ఆ సమూహాన్ని నాశనం చేసే పరిస్థితులను సృష్టించడం, జననాలను నిరోధించడం వంటి చర్యలు ఇందులో ఉన్నాయని వివరించింది. ఇజ్రాయెల్ నేతల వ్యాఖ్యలు, సైన్యం ప్రవర్తించినతీరే వారి జాతి నిర్మూలన ఉద్దేశానికి నిదర్శనమని కమిషన్ అభిప్రాయ పడింది. అయితే, ఈ నివేదికను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఇదొక వక్రీకరించిన, తప్పుడు నివేదిక అని కొట్టిపారేసింది. ఈ కమిషన్‌లోని నిపుణులు హమాస్ ప్రతినిధులుగా పనిచేస్తున్నారని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ఆరోపించింది. "వాస్తవానికి ఇజ్రాయెల్‌లో మారణహోమానికి ప్రయత్నించింది హమాస్. 1,200 మందిని చంపి, మహిళలపై అత్యాచారాలు చేసి, కుటుంబాలను సజీవ దహనం చేసిందని ఇజ్రాయెల్ గుర్తుచేసింది. ఈ నివేదిక నిరాధారమైనదని ఇజ్రాయెల్ సైనిక అధికారి ఒకరు తెలిపారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై అకస్మాత్తుగా దాడి చేసి సుమారు 1,200 మందిని చంపడంతో ఈ యుద్ధం మొదలైంది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాపై సైనిక చర్య ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు గాజాలో 64,905 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అక్కడి ఆరోగ్య శాఖ చెబుతోంది. గాజాలో 90 శాతానికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని, ఆరోగ్య, పారిశుద్ధ్య వ్యవస్థలు కుప్పకూలాయని, తీవ్ర ఆహార కొరత ఏర్పడిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 2021లో ఈ స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు కమిషన్‌ను ఏర్పాటు చేసింది.



## రూ.60 కోట్ల కుంభకోణంలో బిపాసాబసు, నేహాధుపియాకు ఫీజులు ఇచ్చా!: రాజ్ కుంద్రా

**ముంబయి, సెప్టెంబరు 16:** బాలీవుడ్ నటి శిల్పా శెట్టి భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రాపై నమోదైన రూ.60 కోట్ల మోసం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న రాజ్‌కుంద్రా డబ్బులో కొంత భాగాన్ని ప్రముఖ హీరోయిన్లు బిపాసా బసు, నేహా ధూపియాలకు ఫీజుల రూపంలో చెల్లించినట్లు చెప్పినట్లు సమాచారం. ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యూ) జరిపిన విచారణలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఇఒడబ్ల్యూ అధికారులు రాజ్‌కుంద్రాను సుమారు ఐదు గంటల పాటు ప్రశ్నించారు. ఈ సమయంలో హీరోయిన్లకు ఫీజులు చెల్లించినట్లు ఆయన పేర్కొన్నప్పటికీ, పలు కీలక ప్రశ్నలకు మాత్రం సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను మరోసారి విచారించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ కేసులో రాజ్ కుంద్రాతో పాటు ఆయన భార్య శిల్పాశెట్టిపైనా దర్యాప్తు కొనసాగుతోందని ముంబై పోలీసులు అధికారికంగా వెల్లడించారు. అధికారులు జరిపిన దర్యాప్తులో మరిన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కుంద్రా కంపెనీ ఖాతాల నుంచి శిల్పా శెట్టి, బిపాసా బసు, నేహా ధూపియా సహా మొత్తం నలుగురు నటీమణుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బు బదిలీ అయినట్లు ఆధారాలు లభించాయి. బాలాజీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు కూడా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటివరకు అధికారులు సుమారు రూ.25 కోట్ల మేర ప్రత్యక్ష బదిలీలను ట్రాక్ చేశారు. ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) సమయంలో నగదు కొరత ఏర్పడినప్పుడు కంపెనీ నుంచి పలు అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది.

## హ్యాంబర్గర్, ఐస్‌క్రీమ్, కరావోకే పదాలునిషేధం: కిమ్

**ప్యాంగ్యాంగ్, సెప్టెంబరు 16:** ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మరోసారి తన విచిత్రమైన నిర్ణయాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. తమ దేశంలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఉండకూడదన్న ఉద్దేశంతో హ్యాంబర్గర్, ఐస్‌క్రీమ్, కరావోకే వంటి సాధారణ పదాల వాడకంపై నిషేధం విధించారు. విదేశీ, ముఖ్యంగా దక్షిణ కొరియా పదజాలం స్థానంలో దేశీయ పదాలను మాత్రమే ఉపయోగించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ఇకపై హ్యాంబర్గర్‌ను రొట్టెల మధ్య రుబ్బిన గొడ్డు మాంసం అని పిలవాలి. అలాగే ఐస్‌క్రీమ్‌ను ఎసుకిమోగా, కరావోకేను తెరపై సంగీత పరికరంగా వ్యవహరించాలి. ముఖ్యంగా వోన్సన్ బీచ్ రిసార్టులో పనిచేసే టూరిస్ట్ గైడ్లకు ఈ విషయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు డైలీ ఎన్‌కే అనే వార్తా సంస్థ నివేదించింది. పర్యాటకులతో మాట్లాడేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన పదాలనే తప్పనిసరిగా వాడాలని వారికి స్పష్టం చేశారు.

# ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ కుటుంబం ఛిద్రం

## జైషే మహ్మద్ తొలిసారి అంగీకారం

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 16:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైష్ ఏ మొహమ్మద్ ఉగ్రవాద సంస్థకు భారత్ చేతిలో గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయాన్ని ఆ సంస్థ తొలిసారిగా బహిరంగంగా అంగీకరించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్‌లో జరిపిన వైమానిక దాడిలో తమ అధినేత మసూద్ అజహార్ కుటుంబ సభ్యులు మరణించినట్లు ధృవీకరించింది. ఈమేరకు జైష్ అగ్ర కమాండర్లలో ఒకరైన మసూద్ ఇలియాస్ కశ్మీరీ మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మే 7వ తేదీన బహావల్‌పూర్‌లోని జైష్ ప్రధాన కార్యాలయం జామియా మసీదు సుభాన్ అల్లాపై భారత బలగాలు జరిపిన దాడిలో మసూద్ అజహార్ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని ఆ కమాండర్ పేర్కొన్నాడు. "మే 7న భారత బలగాలు మోలానా మసూద్ అజార్ కుటుంబాన్ని ఛిద్రం చేశాయి" అని కాశ్మీరీ ఆ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ దాడిలో అజహార్ సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, మేనకోడలు, ఇతర సమీప బంధువులు మొత్తం 10 మంది మరణించినట్లు సమాచారం. వారితో పాటు అజహార్ ప్రధాన అనుచరులైన నలుగురు సహాయకులు కూడా హతమయ్యారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26మంది మృతికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగానే భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. బహావల్‌పూర్‌తో పాటు మరో ఎనిమిది ఉగ్రవాద శిబిరాలను కూడా భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ దాడిలో మసీదులోని ఒక డోమ్ దెబ్బతిన్నట్లు, లోపల తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఈ దాడి గురించి పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కానీ, అజహార్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు, అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. ఆకార్యక్రమానికి మసూద్ అజహార్ కూడా హాజరై కొద్ది నిమిషాల్లోనే అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. మసూద్ అజహార్, 2016 పఠాన్‌కోట్, 2019 పుల్వామా దాడుల వెనుక ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. తాజా నిఘా సమాచారం ప్రకారం, అజహార్ ప్రస్తుతం తన స్థావరమైన బహావల్‌పూర్‌కు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిత్ బల్టిస్థాన్ ప్రాంతంలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. అక్కడి స్కర్దు ప్రాంతంలో అతని కదలికలను గుర్తించారు. అజహార్ ఆఫ్ఘనిస్థాన్‌లో ఉండవచ్చని గతంలో పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ చేసిన వ్యాఖ్యలకు ఈ సమాచారం విరుద్ధంగా ఉంది.



# 25న ట్రంప్‌తో పాక్ ప్రధాని భేటీ

## మూడోసారి అమెరికా వెళుతున్న పాక్ ఆర్మీచీఫ్




**ఇస్లామాబాద్, సెప్టెంబరు 16:** ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి మావేశాలుప్రారంభం అవుతున్న క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పాక్ ప్రధాని షెహబాజ్‌షరీఫ్, ఆర్మీచీఫ్ ఆసిమ్ మునీర్‌లతో భేటీ కానున్నారు. ఈనెల 25న ఇద్దరు పాక్‌నేతలు ట్రంప్‌తో చర్చలు జరుపుతారని పాక్ మీడియా స్పష్టంచేసింది. పాకిస్తాన్‌లో తీవ్రమైన వరదలు, ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడి తదితర అంశాలు చర్చకు రావచ్చని అంచనా. భారత్‌తో దౌత్యపరమైన ఉద్రిక్తతలు కూడా ఈసమావేశంలో చర్చకువస్తాయనిపాక్ మీడియా చెపుతోంది. ఈనెల 23నుంచి 29 వరకూ ఐక్యరాజ్యసమితి సమావేశాలుప్రారంభం కానున్న నేపథ్యంలో వీరిద్దరితోభేటీ ఇపుడు చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ భేటీ ట్రంప్ వాణిజ్య ధోరణుల్లోనే చూస్తారని, దౌత్యపరంగా కాదన్న విమర్శలు కూడా లేకపోలేదు. పాకిస్తాన్‌కు ఎదురవుతున్న తెహ్రీక్ ఇ తాలిబన్ దాడులు, బెలూచిస్తాన్ లిబరేషన్‌ఫ్రంట్ ఆర్మీ దాడులతో సతమతం అవుతోంది. దీనికితోడు ఇటీవల పాకిస్థాన్‌ను ఆకస్మిక వరదలు కుదిపేసాయి. అనేక ప్రాంతాలు వరదల్లో మునిగిపోయి ప్రజలకు అపారనష్టం కలిగించాయి. ఇపుడున్న పరిస్థితుల్లో పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ ప్రపంచబ్యాంకువంటి ఇతర అంతర్జాతీయ సంస్థల నిధులు అవసరం అవుతాయి. అలాగే ప్యారిస్‌లోని ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్స్ ఆంక్షల నుంచి అధిగమించాలంటే పాక్‌కు అమెరికా సాయం అత్యవసరం. భారత్‌తో నెలకొన్న దౌత్యపరమయిన వివాదాలు పరిష్కరించుకోవాలన్నా అమెరికా సాయం అత్యవసరం ఏకైక మార్గంగా భావిస్తోంది. అందుకోసమే సమితిసమావేశాల సందర్భంగా పాక్ ప్రధాని షరీఫ్ ట్రంప్‌తో భేటీకి సిద్ధం అవుతున్నారు. ఇందుకు ట్రంప్‌కూడా సానుకూలంగా ఉన్నారు. భారత్‌ను దారిలోకి తెచ్చుకోడానికి అవసరమైన అన్ని జిమ్మికులు ప్రయోగిస్తున్న ట్రంప్ ఇపుడు పాక్‌ను ఒక బూచిగాచూపించి భారత్‌ను తన దారిలోకి తెచ్చుకుని వాణిజ్య ఒప్పందంపై ఏకపక్షంగా ఆమోదం తెచ్చుకోవాలన్న కుతూహలంతో ఉన్నారు. ఇదేమీ దౌత్యబంధం కాదని, వాణిజ్య పరమైన బంధాలేనని నిపుణుల అంచనా. మూడోసారి మునీర్ అమెరికా పర్యటనలో రక్షణ రంగ బంధం మరింత బలోపేతం చేసుకోడానికేనని తెలుస్తోంది. అటు ఆఫ్ఘన్‌వైపునుంచి తాలిబన్ తెహ్రీక్ దాడులు, బెలూచిస్తాన్ దాడులను అరికట్టాలంటే అమెరికాసాయం తప్పనిసరి అని భావిస్తున్న పాక్‌ను అమెరికా ఇపుడు సులువుగా తన చెప్పుచేతల్లో ఉంచుకని భారత్‌పై ప్రయోగించేందుకు ట్రంప్ యంత్రాంగం వెనుకాడదని సర్వత్రా వినిపిస్తోంది.

# అసోం మహిళా అధికారి ఇంట్లో నోట్లకట్టలు

## రూ.2 కోట్ల నగదు, బంగారం ఆభరణాలు స్వాధీనం

**గువాహటి, సెప్టెంబరు 16:** అసోంలో ఓ మహిళా ప్రభుత్వ అధికారి ఇంట్లో భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై అసోం సివిల్ సర్వీస్ (ఎసిఎస్) అధికారిణి నుపూర్ బోరాను ముఖ్యమంత్రి ప్రత్యేక విజిలెన్స్ సెల్ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. గువాహటిలోని ఆమె నివాసంలో జరిపిన సోదాల్లో సుమారు రూ.2కోట్ల విలువైన నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం సంచలనం సృష్టిస్తోంది. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గువాహటిలోని నుపూర్ బోరా ఇంట్లో జరిపిన తనిఖీల్లో రూ. 92 లక్షల నగదు, దాదాపు కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో పాటు, బార్‌పేటలో ఆమె అద్దెకు ఉంటున్న మరో ఇంట్లో సోదాలు చేయగా అదనంగా మరో రూ. 10 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోలాఘాట్‌కు చెందిన నుపూర్ బోరా 2019లో ఎసిఎస్ అధికారిణిగా విధుల్లో చేరారు. ప్రస్తుతం ఆమె కామ్రూప్ జిల్లాలోని గొరైమారిలో సర్కిల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ నుపూర్‌బోరాపై ఆరు నెలలుగా నిఘా ఉంచామని తెలిపారు. బార్‌పేట రెవెన్యూ సర్కిల్‌లో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఆమె డబ్బు తీసుకుని హిందువుల భూములను అనుమానాస్పద వ్యక్తులకు బదిలీ చేశారు. అందుకే ఆమెపై కఠినచర్యలు తీసుకున్నామని సిఎం వివరించారు. ఈ కేసులో భాగంగా నుపూర్ బోరాకు సహకరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బార్‌పేట రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే లత్ మండల్ సురజిత్ డేకా నివాసంలో కూడా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. నుపూర్ బార్‌పేటలో సర్కిల్ ఆఫీసర్‌గా ఉన్నప్పుడు ఆమెతో కుమ్మక్కై సురజిత్ బార్‌పేటలో అనేక భూములను అక్రమంగా సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



# సంక్షిప్తంగా..

## లిక్కర్ స్కాం: చత్తీస్‌గఢ్ మాజీ సిఎం కుమారుని అరెస్ట్



**చత్తీస్‌గఢ్, సెప్టెంబరు16:** మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్‌నేత భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను ఇడి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ దర్యాప్తులో చైతన్య బఘేల్ రూ.1,000కోట్ల విలువైన మద్యం సిండికేట్‌ను నడిపినట్లు గుర్తించామన్నారు. ఈ సిండికేట్‌ను నిర్వహించడానికి దాని సభ్యులను అప్పటి ఐఎఎస్ అధికారి అనిల్, వ్యాపారవేత్త అన్వర్ ధేబర్‌సహకరించినట్లు ఇడి ఆరోపించింది. సిండికేట్ సేకరించిన అన్ని అక్రమ నిధుల ఖాతాలు, పంపిణీకి సంబంధించిన విషయాలను చైతన్య చూసుకునేవాడని ఇడి ఆరోపించింది. ఇక్కడ వచ్చిన ఆదాయాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు, పార్టీ కార్యకలాపాలకు వినియోగించేవాడని తెలిపింది. మరికొందరు రాజకీయ నేతలకు కూడా ఈ కుంభకోణంతో సంబంధం ఉందని త్వరలో వారిపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి నిందితుల మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.


## ఆలయాలకు ఇచ్చే డబ్బు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు: సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** దేవాలయాలకు భక్తులు సమర్పించే డబ్బులు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమంటూ మద్రాస్ హైకోర్టుకు చెందిన మదురై బెంచ్ ఇటీవల ఇచ్చిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరించింది. తమిళనాడులోని ఐదు దేవాలయాలకు చెందిన నిధులతో రాష్ట్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పిటిషనర్లు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ తమిళనాడు సర్కార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'కల్యాణ మండపాల ఏర్పాటు కోసం భక్తులు తమ డబ్బును ఆలయాలకు ఇవ్వరు. ఆలయ అభివృద్ధి వంటి వాటికోసం ఇస్తుంటారు. ఒక ఆలయ ప్రాంగణంలో పెళ్లి జరుగుతుంటే అక్కడ అసభ్యకరమైన పాటలు ప్లే చేస్తుంటే.. అది సరైనదేనా? అని ప్రశ్నించింది. ఆ డబ్బును విద్య, వైద్యం వంటి దాతృత్వ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే బాగుంటుందని సూచించింది. తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది.

## అక్రమంగా వచ్చి నేరాలుచేస్తే ఉగాండా జైళ్లకు పంపిస్తా: ట్రంప్

**డల్లాస్, సెప్టెంబరు 16:** అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తే ఉగాండా, ఎస్వాటిని, సౌత్ సూడాన్‌లోని జైళ్లకు పంపిస్తామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. స్వదేశాలలో నేరాలు చేసి పారిపోయి తమ దేశంలోకి వస్తున్నారని అక్రమ వలసదారులపై ఆయన మండిపడ్డారు. అమెరికాలోకి వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బైడెన్ సర్కారు అవలంభించిన విధానాల వల్ల నేరస్థులు అమెరికాగడ్డపై స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శించారు. డల్లాస్‌లో భారత సంతతికి చెందిన నాగమల్లయ్య దారుణహత్యపై స్పందిస్తూ ట్రంప్ ఈవ్యాఖ్యలు చేశారు. నాగమల్లయ్యను చంపిన హంతకుడు యోర్డానిస్ కోబోస్ మార్టినెజ్ క్యూబా పౌరుడని, అమెరికాలోకి అక్రమంగా వచ్చాడని తెలిపారు. గతంలో చిన్నపిల్లలపై అఘాయిత్యం, వాహనాల దొంగతనంకేసులో మార్టినెజ్‌ను పోలీసులు జైలుకు పంపించారని చెప్పారు. అయితే, బైడెన్ ప్రభుత్వ విధానాల వల్ల మార్టినెజ్ జైలు నుంచి విడుదలయ్యాడని, తాజాగా నాగమల్లయ్యను హత్య చేశాడని తెలిపారు.

## న్యూయార్క్‌టైమ్స్‌పై ట్రంప్ రూ.1.25 లక్షలకోట్ల పరువునష్టం దావా




**వాషింగ్టన్, సెప్టెంబరు 16:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, దేశంలోని ప్రముఖ మీడియా సంస్థల్లో ఒకటైన న్యూయార్క్ టైమ్స్‌పై న్యాయపోరాటానికి దిగారు. దశాబ్దాలుగా ఆ పత్రిక తనపై ఉద్దేశపూర్వకంగా అబద్ధపు ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ, ఏకంగా 15 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 1.25 లక్షల కోట్లు) పరువు నష్టం దావా వేశారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా స్వయంగా ప్రకటించారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని కోర్టులో ఈ దావాను దాఖలు చేసినట్టు ట్రంప్ తెలిపారు. న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాడికల్ లెఫ్ట్ డెమొక్రాటిక్ పార్టీకి అధికారిక గొంతుకగా మారిపోయిందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. తనపై, తన కుటుంబంపై, తన వ్యాపారాలపై, అలాగే అమెరికా ఫస్ట్, మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) ఉద్యమాలపై ఆ పత్రిక నిరంతరం అబద్ధాలు ప్రచురిస్తోందని ఆరోపించారు.

# పట్టణాభివృద్ధి, గ్రామీణ అనుసంధానం, నరేగాలో అద్భుతమైన విజయాలు

### -పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్

### - డిసెంబర్ చివరికి అన్ని పశువుల షెల్టర్లు పూర్తి

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణాభివృద్ధి గ్రామీణ సంధానం, (మహాత్మాగాంధీ జాతీమమనరేగాల్లో అద్భుత విజయాలు సాధించినట్లు పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ గ్రామీణ మోలిక వసతుల సురేష్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ తొమ్మిది కీలక పట్టణ సేవలను కవర్ చేసే బలమైన సర్వీస్ లెవల్ ఇండికేటర్స్ ఫ్రేమ్‌వర్క్ అమలు చేశామని వివరించారు. విశాఖపట్నం జిల్లా 85 పాయింట్లతో టాప్ పర్ఫార్మర్‌గా నిలిచిందని, నీటి సరఫరా, చెత్త సేకరణ .వ్యర్థాల ప్రాసెసింగ్‌లో 100 కవరేజ్ సాధించిందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా (80 పాయింట్లు) మరియు తిరుపతి (72 పాయింట్లు) వరుసగా రెండవ మరియు మూడవ స్థానాలను దక్కించుకున్నాయని చెప్పారు. ప్రస్తుత రాష్ట్రవ్యాప్త పనితీరు గురించి మాట్లాడుతూ, నీటి సరఫరా 64.2 కవరేజ్‌తో 24.70 లక్షల ఫంక్షనల్ హౌస్ ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయని, ఇంటింటికీ చెత్త సేకరణ 95.1 వద్ద ఉందని, సైంటిఫిక్ వేస్ట్ ప్రాసెసింగ్ 54.2 వద్ద ఉందని వివరించారు. అమృత్, ఏఐఐబీ, యూఐడీఎఫ్ వంటి వివిధ పథకాలలో 409 ప్రాజెక్టులతో ..15,471 కోట్ల విలువైన సమగ్ర నిధుల వ్యూహం ద్వారా 2029 నాటికి అన్ని సూచికలలో 100 సేవా అందుబాటును లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పీపీపీ మోడ్‌లో ఆరు ప్రధాన వేస్ట్‌టుఎనర్జీ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, 84 మెగావాట్ సామర్థ్యంతో 80 యూఎల్‌బీలలో 4,693 టీపీడీ వ్యర్థాలను నిర్వహిస్తుందని వివరించారు. నాలుగు ప్రాజెక్టులకు లెటర్ ఆఫ్ అవార్డ్ లభించిందని, యూనిట్‌కు ..7.50 నుంచి ..8.10 వరకు పోటీ టేరిఫ్‌లు ఉన్నాయని తెలిపారు. మనరేగా కింద రాష్ట్రం 15.28 కోటి వ్యక్తి దినాలు సృష్టించిందని (ఆమోదించిన బడ్జెట్‌లో 102 ), ..6,057.84 కోట్ల వ్యయంతో 63.60 లక్షల మందికి ఉపాధిని అందించిందని సురేష్ కుమార్ గారు తెలిపారు. పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో బలమైన పురోగతి కనిపిస్తోందని, 1.02 లక్షల ఫార్మ్ పాండ్లు పూర్తయ్యాయని (102 సాధన), 15,188 పశువుల తొట్లు (101 సాధన), మరియు 20,204 పశువుల షెల్టర్లు (81 సాధన) జిల్లాలలో పూర్తయ్యాయని వివరించారు గ్రామీణ కనెక్టివిటీ చర్యలు 4,563.92 కిలోమీటర్లకు విస్తరించి, వివిధ పథకాలలో ..3,714.74 కోట్ల విలువ కలిగి ఉన్నాయని తెలిపారు."అడవి తల్లి బాట" కార్యక్రమం కింద 1,483 కనెక్ట్ కాని గిరిజన వసతులకు కనెక్టివిటీని మనరేగా, పీఎం జన్‌మన్ మరియు పీఎంజీఎస్‌వై ।జు ద్వారా ..2,850.53 కోట్ల మొత్తం పెట్టుబడితో ప్లాన్ చేశామని వివరించారు. జల్ జీవన్ మిషన్‌లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని, 25,444 ఎస్‌వీఎస్ పనులు పూర్తయ్యాయని మరియు 16,396 పనులు పురోగతిలో ఉన్నాయని, మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మూడు కొనసాగుతున్న ఎమ్‌వీఎస్ పనులలో ఉడ్డనం ప్రాజెక్ట్ పూర్తయిందని, ధోనే మరియు పులివెందుల ప్రాజెక్టులు నవంబర్ 2025 నాటికి పూర్తవుతాయని వివరించారు. రాష్ట్రం 18 యూడీఏలలో 1,343.83 ఎకరాలను కవర్ చేస్తూ 78 భూ పార్సెల్లను పీపీపీ అభివృద్ధి కోసం గుర్తించిందని, 33 సైట్లు మంచి అభివృద్ధి సామర్థ్యాన్ని చూపుతున్నాయని తెలిపారు.



విద్యార్థుల గదులను పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# గురుకుల పాఠశాలల్లో విద్యార్థులంతా క్షేమం

### - సరస్వతీ నిలయాలకు కేంద్రాలుగా ఆత్మకూరు నియోజకవర్గం - విద్యార్థుల ఆరోగ్య భద్రతకు మెరుగైన చర్యలు తీసుకున్నాం - దేవాదాయ మంత్రి ఆనం

**ఆత్మకూరు (నెల్లూరు), సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** ఆత్మకూరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున విద్యాలయాలను నెలకొల్పి సరస్వతీ నిలయాలకు కేంద్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి సందర్శించారు. గురుకుల పాఠశాలలోని హాస్టల్ గదులు, భోజనశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్లో వసతి, భోజనం, పరిశుభ్రత తదితర అంశాలను వారినడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని మంత్రికి వైద్యులు వివరించారు. ఈసందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ గత వారం రోజుల క్రితం గురుకుల పాఠశాలలో జ్వరాలు ప్రబలిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై విద్యార్థులకు వైద్య సేవలు అందించి పరిస్థితిని చక్కదిద్దామన్నారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉన్నారని, తిరిగి పాఠశాలకు వస్తున్నారన్నారు. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో నిరంతరం వైద్యులు విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వైద్య చికిత్స అందించారన్నారు. కొంతమంది విద్యార్థులకఉ భరోసా కల్పించేందుకు అన్ని రకాల మందులు ఇచ్చితమ తల్లిదండ్రుల వద్దకు పంపామన్నారు. గురుకుల పాఠశాలలో ఓ ఒక్క విద్యార్థికి కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వైద్యుల సూచనల మేరకు తాజా కూరగాయలు, ఆకు కూరలతో వండిన ఆహార పదార్థాలను, పాలను కూడా ప్రతిరోజు అందిస్తున్నారన్నారు. ఎక్కడా రాజీ పడకుండా విద్యార్థుల ఆరోగ్యభద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామన్నారు. ఇక్కడ ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఊరికి దూరంగా ఏర్పాటు చేసి యార్డ్‌కు తరలించేలా అధికారులను ఆదేశించామన్నారు. ప్రహరీగోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని , సోలార్‌హీటర్లు కూడా ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. బాలికల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ పెద్ద ఎత్తున ప్రభుత్వ విద్యాలయాలను నెలకొల్పి ఆత్మకూరు నియోజకవర్గాన్ని సరస్వతీ నిలయంగా మార్చినట్లు చెప్పారు. బిసి , ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలను తమ హయాంలో ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. 1నుంచి10వ తరగతి వరకు ఆత్మకూరు నియోజకవర్గంలో 31వేల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకుంటున్నారని, 408 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నా యన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రెండు మోడల్ స్కూల్స్, గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయం, బాలికల రెసిడెన్షియల్ విద్యాలయాలు-2, బిసి రెసిడెన్షియల్ స్కూల్-1, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ -1, గవర్నమెంట్ ట్రైబల్ డిపార్ట్‌మెంట్ ప్రైమరీ స్కూల్-1, కెజిబివి-2, మండల పరిషత్, జిల్లాపరిషత్ పాఠశాలలు -391, నవోదయ విద్యాలయం , ప్రవేట్ (అన్‌ఎయిడెడ్'-44, స్టేట్ గవర్నమెంట్ పాఠశాలలు - 3 ఉన్నాయని, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలున్నాయన్నారు.

## సైబర్ నేరగాళ్ల వలలో యోగా మాస్టర్

### - ఫేక్ ట్రేడింగ్ కంపెనీలో రూ.11,99,000 మోసం

**తిరుపతిరూరల్,సెప్టెంబర్16 ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల వలలో పడి ప్రవేట్ యోగా మాస్టర్ భారీగా మోసపోయిన ఘనటన తిరుపతిరూరల్ మండలం పేరూరులో చోటు చేసుకుంది. సైబర్ మోసగాళ్లు యోగ మాస్టర్‌చే ఫేక్ ట్రేడింగ్ కంపెనీలో ఇన్వెస్ట్‌మెంట్ రూ.11,99,000 రుపాయాలు చేయించి, రిటర్న్ తిరిగి అడగ్గానే ఇన్వెస్ట్‌మెంట్ డబ్బులను కాజేసినట్లు తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందినట్టు సి.ఐ. చిన్న గోవిందు తెలిపారు. 2025 ఆగష్టు నెలలో హేమాంగి డేట్ అనే వ్యక్తి వాట్సప్ ద్వారా 'బికెఐఎన్ ఎస్వీపి1'కమ్ అనే లింక్ పంపి, ఐసిఐసిఐ సెక్యూరిటీస్ పేరుతో నకిలీ ట్రేడింగ్ యాప్‌లో ఇన్వెస్ట్ చేయమని ప్రలోభపెట్టాడు. ఫిర్యాదుదారుడు ఫోన్ ఫే, ఆర్టిజిఎస్ మార్గాలలో రూ.11,99,000 రుపాయాలు వివిధ అకౌంట్లకు బదిలీ చేసారు. మొదటి కొంత లాభం చూపించి, విశ్వాసం సంపాదించిన తర్వాత రూ.26,41,304 రుపాయాలు లాభం వచ్చినట్టు చూపి, విత్ డ్రా చేసుకోవాలంటే 20శాతం కమీషన్ చెల్లించాలంటూ మరింత డబ్బు అడిగారు. ఐసిఐసిఐ బ్యాంక్‌ను ఫిర్యాదుదారుడు సంప్రదిస్తే, ఆ యాప్ ఫేక్ అని తెలుసుకుని, వెంటనే సైబర్ క్రైమ్ నెంబర్ 1930, తిరుపతిరూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు తిరుపతిరూరల్ పిఎస్ ఇన్‌స్పెక్టర్ టి.చిన్నగోవింద్ ఆధ్వర్యంలో సిఆర్ నెంబర్ 488/2025 కింద కేసు నమోదు చేసి, మోసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులపై ఐపిసి 419,420 సెక్షన్స్ కింద కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టీచర్ ధాష్టీకానికి తలపగిలిన విద్యార్థిని

### పుంగనూరులో దారుణం

**పుంగనూరు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** తరగతి గదిలో అల్లరి చేస్తోందని ఆరో తరగతి విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయుడు తల పగలగొట్టిన సంఘటన ఈనెల 10న జరిగింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలోని తాటి మాకుల పాలెంలో గల స్కూల్ లో స్వాతికా నాగశ్రీ ఆరవ తరగతి చదువుతున్నది. విద్యార్థిని తండ్రి



బాలిక తల్లి విజేతను పాఠశాల వద్ద విచారిస్తున్న మండల విద్యాశాఖ అధికారి.

హరి ప్రసాద్ ఇదివరకే మృతి చెందడంతో అదే పాఠశాలలో స్వాతిక నాగశ్రీ తల్లి విజేత ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నది. కాగా ఈనెల 10వ తేదీన నాగశ్రీ తన పుస్తకాల సంచిలో టిఫిన్ డబ్బా పెట్టుకుని బడికి వచ్చింది. హిందీ పీరియడ్ సమయంలో బాలికను మందలించేందుకు టీచర్ సలీం భాషా క్యారీ బ్యాగ్ తో విద్యార్థిని తలపై కొట్టాడు. క్యారీ బ్యాగ్ లో టిఫిన్ బాక్స్ ఉండడంతో నాగశ్రీ తలపై బలమైన దెబ్బ తగిలింది. ఈ ఘటనలో బాలిక తలకు తీవ్ర రక్తస్రావం ఆమె కింద పడిపోయింది.కాగాకొట్టడంతో విద్యార్థినికి ఫిట్స్ వచ్చి కింద పడిపోయింది. వెంటనే స్వాతిక నాగశ్రీని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు .విద్యార్థిని పరిస్థితి తీవ్రం కావడంతో మదనపల్లి కు తరలించారు. స్కానింగ్ లో బాలిక తల కపాలం చిట్లి పోయి నొక్కుబడినట్లు తెలిసింది. ఘటనపై విద్యార్థిని తల్లి స్కూల్ ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం కు ఫిర్యాదు చేయగా ఆయన బాలికతల్లితో ఎటకారంగా మాట్లాడారని బాలిక తల్లి వాపోయింది. ఈ ఘటనపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన జరిగి ఏడు రోజులు కావస్తున్నప్పటికీ, పాఠశాల యాజమాన్యం బాలిక ఆరోగ్య పరిస్థితి పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించక పోగా, తమ కుటుంబం పై దారుణ వ్యాఖ్యానాలు చేస్తున్నారని బాలిక తల్లి విజేత ఆరోపించారు. మంగళవారం ఉదయం ఆమె పాఠశాల వద్దకు చేరుకుని తమ కుమార్తెను తీవ్రంగా గాయపరిచిన పాఠశాల యధావిధిగా పాఠశాల నడపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఈ ఘటన వివరాలు తెలుసుకునేందుకు అక్కడికి వచ్చిన ఇంచార్జ్ మండల విద్యాశాఖ అధికారి నటరాజ్ బాలిక తల్లి విజేతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తన కుమార్తెను ఉపాధ్యాయుడు సలీం భాష తీవ్రంగా గాయపరిచినప్పటికీ పాఠశాల యాజమాన్యం స్పందించలేదని ఫిర్యాదు చేశారు. బాలిక ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఆమె అధికారులకు తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యత పై రాజకీయ కుట్ర

### మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త):** ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యత పై దేశవ్యాప్తగా అతి పెద్ద రాజకీయ కుట్రను మోడీ బిజెపి చేస్తుందని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్ అద్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. రాజమండ్రిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎస్సీ వర్గీకరణను శాంపుల్ గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే చేసిందని బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశారు మన మోడీ సాబ్, నిజానికి ఎస్సీ వర్గీకరణ వల్ల వందలో నలుగురికే మంచి జరుగుతుంటే ఈ వందలో నలుగురికి ఇచ్చే ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ అని రత్నాకర్ ప్రశ్నించారు. అలాగే ఈ నాలుగు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు. ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు మాల సామాజిక వర్గం పై ప్రగతించుకుంటే మాలల హోల్సేల్ మేనమామ మాలలకు అన్యాయం జరుగుతున్న ముద్దులతో సరిపెట్టేసాడు తప్ప ఈనాటికీ స్పందించలేదని వాపోయారు. ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా ఇక చేసేదేముందని అనుకోకండి మిత్రులారా ప్రజలు తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తూ ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం ఘోరం అన్యాయం చెంచా గిరికి అలవాటు పడ్డ మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని రత్నాకర్ సూచించారు. రిజర్వేషన్ల బెనిఫిట్ పొందిన మాల ఉద్యోగులారా మాల జాతిని తొక్కేస్తా ఉన్నారు ఇకనైనా కళ్ళు తెరిచి బయటకు రండి మా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండి తెలుగు రాష్ట్రాల్లో ఏనాడు ఎదుర్కోనటువంటి గడ్డు పరిస్థితిని మాల సామాజిక వర్గం ఈరోజు ఎదుర్కొంటూ ఉంది. పూర్తిగా తెలుగు రాష్ట్రంలో మన కులం యొక్క ఉనికిని కోల్పోయాం శాంతియుత పోరాటానికి సిద్ధం కండి మిత్రులారా అంటూ రత్నాకర్ పిలుపు ఇచ్చారు.

## ఇంద్రకీలాద్రిలోదసరా ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్, ఇఒ

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో ఈ నెల 22 నుండి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి కావాల్సిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగు తున్నాయి. ఈ ఏర్పాట్లను మంగళవారం కమీషనర్ కె రామచంద్ర మోహన్, ఇఓ వికె శీనా నాయక్ అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే కనకదుర్గానగర్, కొత్తలడ్డూపోటు, అన్నదాన భవనం లను కూడా పరిశీలించారు. ఘాట్‌రోడ్డు, ఘాట్‌రోడ్డుపై వున్న క్యూలైన్లు, చెప్పులస్టాండ్, వృద్ధులకు ఏర్పాటు చేసిన బ్యాటరీ కార్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ద్వారకా తిరుమల దేవస్థానం డివి భాస్కర్, పెనుగంచిప్రోలు దేవస్థానం ఇఇ ఎల్ రమ, దుర్గమ్మవారి ఆలయ ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# మరణించినా 6 గురికి పునర్జన్మ

### - ఆయువు పోతున్నా ఆదర్శం - అవయవదానంతో ఆరుగురికి పునర్జన్మ ఇచ్చిన పవన్ అభిమాని



నవీన్ (ఫైల్‌ఫోటో)

**చిలమత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లా చిల మత్తూరు మండలం తుమ్మలకుంట గ్రామానికి చెందిన పవన్‌కళ్యాణ్ వీరాభిమాని నవీన్ (21) ఇటివలే చిలమత్తూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం బెంగుళూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రెండు రోజులు మృత్యువుతో పోరాడిన నవీన్ సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. వైద్యులు బ్రెయిన్ తప్ప అన్ని అవయవాలు బాగున్నాయని తెలిపారు. మరణించిన ఆ యువకుడు మరో 6 గురికి పునర్జన్మ కల్పించాడు. ఆ తల్లికి ఉన్నది ఒక్కడే కుమారుడు. ఆమె భర్త కుమారుడు 3 నెలల బిడ్డగా ఉన్నప్పుడే మరణించాడు. అప్పటి నుండి తల్లి గీతా అన్నీ తానై కొడుకుని కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఇటివలే నవీన్ కూడా బొలెరో వాహనం కొనుగోలు చేసి కుటుంబ పోషనకు అండగా నిలిచాడు. ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా మరణించాడు. తన కుమారుడు మరణాన్ని తట్టుకొని ఆదర్శంగా ఆలోచించిన తల్లి తన బిడ్డ అవయదానానికి అంగీకరిస్తూ దానం చేసి ఆరుగురికి ఆయువు పోసింది. తన బిడ్డ చనిపోతూ 6 గురికి ఆయువుపోశాడు అంటూ కన్నీరు మున్నీరైంది. నిత్యం మెగా కుటుంబం ముఖ్యంగా పవన్‌కళ్యాణ్ అభిమానిగా వుంటూ అనేకమార్లు జనసేన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే నవీన్ తన తల్లి దాతృత్వానికి జనసేన నాయకులుగా గర్వపడుతూ తన ఆత్మకు శాంతి కలగాలని కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని జనసేన మండల కమిటితో పాటు మానవతావాదులు, మండల ప్రజలు తల్లి రుణం ఈ జన్మకు తీర్చుకోలేమని, వారి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాష్ట్రంలో పారదర్శకమైన భూసేవలు,డిజిటల్ రికార్డులు

### - రెవెన్యూ నోడల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మీ

**సచివాలయం,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త :** చట్టబద్ధమైన పట్టాల పంపిణీ,వేగవంతమైన మ్యూటేషన్,భూ వివాదాల పరిష్కారం వంటి అంశాలపై రెవెన్యూ శాఖ దృష్టి సారించినట్లు రెవెన్యూ మెడల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మీ తెలిపారు.మంగళవారం రెండోరోజు కలెక్టర్ సదస్సులో భాగంగా మాట్లాడుతూ వీటి ద్వారా ప్రజల విశా ్వసం పెరగడంతోపాటు వ్యవసాయానికి,పెట్టుబడులకు అనుకూలమైన భూముల పరిపాలన వ్యవస్థ ఏర్పడుతోందన్నారు.ప్రజల నుండి పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రస్సల్ సిస్టం ద్వారా వచ్చే ఫిర్యాదుల్లో 70శాతం వరకు ఫిర్యాదుల రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉండేవని వాటి సంఖ్యను తగ్గించేందుకు జిల్లాల వారీగా వర్క్‌షాపులను నిర్వహించామని చెప్పారు.2.5లక్షల ఫిర్యాదులకు గాను 2.15లక్షల ఫిర్యాదులను అనగా 84.5శాతం పరిష్కరించగా 39,712ఫిర్యాదులు అనగా 15.58శాతం ప్రొగ్రెస్‌లో ఉన్నట్లు తెలిపారు.అన్ని ఫిర్యాదులను జిల్లాల్లో నూరుశాతం ఆడిట్ చేయించడం జరుగుతోందన్నారు.మానిఫెస్టో అంశాలైన అందరికీ ఇళ్ళు కార్యక్రమానికి సంబంధించి 1.75లక్షల దరఖాస్తు చేయగా ఇప్పటివరకు 20,674ఆమోదించగా మరో లక్షా 2వేల దరఖాస్తులు పరిశీలనలో ఉండగా 52,501దరఖాస్తలను వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగిందన్నారు.మ్యూటేషన్ రిఫార్మ్ ్స ద్వారా భూమి లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతోంది.రిజిస్ట్రేషన్ తర్వాత భూ యజమాని పేరులో ఆటోమెటిక్‌గా మారు ్పలు జరిగే విధానాన్ని ప్రవేశపెట్టారు.దీని వలన అవినీతి అవకాశాలు తగ్గి,ప్రజలకు న్యాయం జరుగుతోంది.ఆదాయం పెంపు చర్యల్లో బాగంగా డిమాండ్ రిజి స్ట్రేషన్లు పెంచడం,అండర్ వాల్యూయేషన్ నియంత్రణ,పెండింగ్ రికవరీలు వసూలు చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

# మణిద్వీప మహాసంస్థానంలో 22 నుండి నవరాత్రి ఉత్సవాలు

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో కోలువైవున్న శ్రీ లలితాంబికా దేవికి 22వ తేది నుండి నవరాత్రి ఉత్సవాలనిర్వహించనున్నట్లు ఆశ్రమనిర్వా హకులు తెలిపారు. ఈ పెనుశిల క్షేత్రం గోప్ప తపోభూమి, ఋషులకు, దేవతలకు



నిత్యనివాసిన ఈ క్షేత్రం ఇటువంటి క్షేత్రంలో వెలసివున్న శ్రీ లలితాంబికా మణిద్వీప నివాసిని, నిత్య సత్య, పరాకృతి ఆ మహాశక్తి శ్రీ లలితాంబికా దేవిని నవరాత్రులలో పూజించడం ద్వారా సకల కోరికలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. దేవి నవరాత్రలలో శ్రీ లలితాంబికా దేవిని పూజించి, వివిధ దానధర్మాలు,చేయడం ద్వారా కలికే పుణ్యం అపారమని పెద్దలు చెపుతారు.

## పన్ను వసూళ్ల లో పారదర్శకత, టెక్నాలజీ వినియోగం అవసరం

### - రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమీషనర్ అహ్మాద్ బాబు

**సచివాలయం,సెప్టెంబర్ 16,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కమర్షియల్ ట్యాక్స్ విభాగం ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటని,రాష్ట్ర ఖజానాకు పన్నులద్వారా వచ్చే ఆదాయం అభివృద్ధి కార్యక్రమాలకు ఆధారంగా నిలుస్తుందని రాష్ట్ర పన్నుల శాఖ కమీషనర్ అహ్మాద్ బాబు తెలిపారు.మంగళవారం రెండో రోజు కలెక ్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా జిఎస్టీ,విఏటి,ప్రొఫెషనల్ ట్యాక్స్,ఇతర వాణిజ్య పన్నుల ద్వారా ఆదాయం లభిస్తుందని తెలిపారు.జిఎస్టీ రిటర్నులు ఆన్‌లైన్ ఫైలింగ్,ఈవే బిల్లుల ట్రాకింగ్,ఈ-ఇన్వాయ్సింగ్ వంటి విధానాలు విస్తృతంగా వినియోగంలో ఉన్నాయని తెలిపారు.టిడిఎస్ ఆన్ జిఎస్టీ కఠినంగా అమలు చేస్తున్నారు,ప్రభుత్వ విభాగాలు,పెద్ద కాంట్రాక్టులు,సప్లయి చెయిన్‌లలో టిడిఎస్ సేకరణ ద్వారా భారీ ఆదాయం లభిస్తుందని తెలిపారు.ఏపి వ్యాట్ రిఫార్మ్స్ ద్వారా పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలు వసూలు చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతునా ్నరు.రికవరీల్లో ఆలస్యం జరగకుండా జిల్లావారీగా కలెక్టర్లు మానిటరింగ్ చేస్తున్నారని ఆయన తెలిపారు.ప్రొఫెషన్ ట్యాక్స్‌ను సమర్థవంతంగా వసూలు చేసేందుకు ఐటి ఆధారిత సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తున్నారని తెలిపారు.అనధికార వ్యాపారాలు,పన్ను ఎగవేతను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారు.ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇంటెలిజన్స్ ఆధారిత తనిఖీలు,ఇన్‌స్పెక్షన్‌లు నిర్వహిస్తున్నారు.

## మహిళా సాధికారతతోనే దేశ పురోభివృద్ధి

### - శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**తిరుపతిరూరల్,సెప్టెంబర్15 ప్రభాతవార్త:** మహిళా సాధికారతతోనే దేశ పురోభివృద్ధి సుసాధ్యమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తొలి మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు విజయవంతంగా పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేసారు. మహిళా సాధికారత సదస్సులో చేసిన తీర్మానాలు కొత్త ఆత్మ విశ్వసానికి శ్రీకారం చుట్టాయన్నారు. మహిళల సమాన హక్కులు, రాజకీయాలలో మరింత ప్రాతినిధ్యం విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో అవకాశాలు, సురక్షిత సమాజ నిర్మాణం, ఇవన్నీ కేవలం నినాదాలు కావని, మనం సాధించాల్సిన లక్ష్యాలని పేర్కొన్నారు.

## ప్రజల ఆరోగ్యం, భద్రత, సామాజిక శ్రేయస్సు కోసం ఎక్సైజ్ విభాగం కీలక పాత్ర

### - ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా

**విజయవాడ,సెప్టెంబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మద్యపాన నిషేధం, ప్రజల ఆరోగ్యం, భద్రత, సామాజిక శ్రేయస్సు కోసం ఎక్సైజ్ విభాగం కీలకమైన పాత్ర పోషిస్తోందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా అన్నారు.ఆయన జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజైన మంగళవారం మాట్లాడుతూ. ఈ విభాగం ముఖ్యంగా మద్యపాన నియంత్రణ, అక్రమ మద్యం తయారీ నివారణ, మద్యం నాణ్యత పర్యవేక్షణ, డిజిటల్ పద్ధతుల వినియోగం వంటి అంశాలపై దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వం మద్యపానాన్ని తగ్గించేందుకు క్రమంగా చర్యలు తీసుకుంటోందని , రాష్ట్రంలో మద్యం షాపుల సంఖ్యను తగ్గించడం, బెల్ట్ షాపులను మూసివేయడం, వైన్ షాపుల పనివేళలు నియంత్రించడం వంటి చర్యలు చేపట్టబడ్డాయని తెలిపారు. దీని ద్వారా మద్యం లభ్యతను క్రమంగా తగ్గిస్తూ, సమాజంలో మద్యపాన అలవాటు తగ్గించాలనే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సాహం ఈ విభాగంలో ఒక ముఖ్యమైన సంస్కరణ, వైన్‌షాపుల్లో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించి పారదర్శకతను పెంచుతున్నారని తెలిపారు. ట్రాక్ అండ్ ట్రేస్ టెక్నాలజీ ద్వారా తయారీ యూనిట్ నుంచి వినియోగదారుల వరకు మద్యం సరఫరా గొలుసును పర్యవేక్షిస్తున్నారు. దీని వలన నకిలీ మద్యం, అక్రమ రవాణా తగ్గించవచ్చన్నారు అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో కలెక్టర్లు, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు కలిసి చర్యలు తీసుకుంటున్నారన్నారు.

## కోటి.8 లక్షలతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

### ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ఎమ్మెల్యేకు సత్కారం

**వెంకటాచలం (నెల్లూరు), సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** వెంకటాచలం మండలంలోని చెమ్ముడుగుంట పంచాయతీలోని గురాన్‌పూరు, నక్కల కాలనీ, పవన్ కాలనీ చెమ్ముడు గుంట గ్రామాల్లో మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోటి 8 లక్షల అభివృద్ధి పనులు, సిమెంట్ రోడ్డు, సైడ్ కాలువలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో వేసిన సిసి రోడ్లు, సైడ్ కాలువలు నాసిరకంగా నిర్మించడంతో పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. గత టీడీపీ ప్రభు త్వ హయాంలో వేసిన సిమెంట్ రోడ్లు నేటికి చెక్కు చెదర్లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయు డు రైతుల విషయంలో వ్యవసాయ పనులకు ఒక బస్తా యూరియాకు 800 రూ రైతుల ఖాతా లో జమ చేయటం జరుగుతందన్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

E PROCUREMENT TENDER NOTICE

| S.No. | NIT No. | Name of the work |
|---|---|---|
| 1. | 78/MAU61-EE0ED (OTH)/16/2025-DP Dated: 15.09.2025 | RFP for Engagement of Developers for Development of the 7.935 Acres Land Parcel Located in Pitchikalapalem Village, Amaravati through PPP mode. |
| 2. | 79/MAU61-EE0ED (OTH)/16/2025-DP Dated: 15.09.2025 | RFP for Engagement of Developers for Development of the 19.72 Acres Land Parcel Located in Mandadam Village, Amaravati through PPP mode. |
| 3. | 81/MAU61-EE0ED (OTH)/16/2025-DP Dated: 15.09.2025 | RFP for Engagement of Developers for Development of the 30.34 Acres Land Parcel Located in Rayapudi Village, Amaravati through PPP mode. |

The bid can be downloaded on AP e-procurement portal from 17.09.2025 to 03.10.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 03.10.2025 up to 15.00 Hrs, Technical bid opening 03.10.2025 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

Sd/- Commissioner, APCRDA, Vijayawada

# వైసిపి అసత్య ప్రచారాలను నమ్మొద్దు - కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ.



భీమవరం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : భీమవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని భీమవరం ఏఎంసీ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. సభాధ్యక్షులు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఏఎంసీ నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.చైర్ పర్సన్ గా కలిదిండి సుజాత రామచంద్రరాజు వైస్ చైర్మన్ గా బండి రమేష్ కుమార్ 13 మంది డైరెక్టర్లు పదవి బాధ్యతలు స్వీకరించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో ప్రతిష్టాత్మకమైన భీమవరం ఏఎంసి నూతన పాలక మండలి అభివృద్ధి పథంలో నడిపించాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారాలను నమ్మకూడదన్నారు.ఏపీ జనవరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ఏఎంసీలో బాధ్యతలు స్వీకరించిన చైర్ పర్సన్ వైస్ చైర్మన్ డైరెక్టర్లు రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులు ఖాతాలలో నేరుగా నగదు జమ చేయడంపై జీర్ణించుకోలేని జగన్ వైసీపీ సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ఫేక్ ప్రచారాలు చేయడంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారని తెలిపారు.భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ రైతుల అవసరాలకు తగ్గట్టుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన వ్యవసాయ విధానాల ద్వారా రైతులకు మేలు చేకూర్చాలని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భీమవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పోలీట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ భీమవరం వ్యవసాయ మార్కెట్ ప్రధమ మహిళ చైర్పర్సన్ గా నియమితులైన కలిదిండి సుజాత రామచంద్రరాజు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వారని రైతులు పడే కష్టాలు పంటల నష్టాలుపై అవగాహన ఉన్నవారు కాడంచేతే వారికి చైర్పర్సన్ పదవిని కేటాయించామని తెలిపారు. ఈసమావేశంలో రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ ఎమ్మెల్సీ పేరబత్తుల రాజశేఖరం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్




కొత్తపల్లి సుబ్బారాయుడు ఏపీ మహిళా ఆర్థిక సహకార కార్పొరేషన్ చైర్పర్సన్ పీతలు సుజాత ఏపీ భవన మరియు ఇతర కార్మికుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వలవల మల్లికార్జునరావు నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పొత్తూరి రామాంజనేయరాజు ఏపీఐఐసీ చైర్మన్ జిల్లా టిడిపి అధ్యక్షుడు మంతెన రామరాజు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు వెంద్రా శ్రీనివాస్ జనసేన జిల్లా కార్యదర్శి పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ ప్రభుత్వ నామినేటెడ్ చైర్మన్ డైరెక్టర్లు టిడిపి బిజెపి జనసేన పార్టీ కమిటీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలకొల్లులో ఘనంగా ప్రారంభమైన యునైటెడ్ ఆసుపత్రి

## - ముఖ్య అతిథులుగా హాజరైన కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు.



**పాలకొల్లు ప్రభాతవార్త :**పాలకొల్లులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రులను కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య సంస్థల వ్యవస్థాపక చైర్మన్ కిమ్స్ మరియు మెడ్ యునైటెడ్ ఆసుపత్రుల చైర్మన్ శ్రీ కెవివి సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అధ్యక్షతన, కిమ్స్ వైద్య సంస్థలు మెడ్ యునైటెడ్ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ కె రవి కిరణ్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వైద్యరంగంలో అత్యంత ఆధునికత చోటు చేసుకుంటుందని చెప్పారు. చైతన్య రాజు గారి ఆధ్వర్యంలో పాలకొల్లులో మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభించడం వైద్య రంగంలో మరో విప్లవం అని చెప్పారు. అధునాతన వైద్య సదుపాయాలతో మారుమూల ప్రాంత ప్రజలకు వైద్య సేవలను మేడ్ యునైటెడ్ ఆసుపత్రి ద్వారా అందుబాటులోకి తెచ్చారని అభినందించారు. ప్రాణం నిలిపే అమృత ఘడియల్లో రోగికి ఆపన్న హస్తం గా నిలిచే విధంగా పాలకొల్లులో మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభించడం గొప్ప వరమని అన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర జల వనరుల శాఖ మాత్యులు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గుండె నొప్పితో ఇతరప్రాంతాలకు పరుగులు తీయవలసిన భయాన్ని మాయం చేస్తూ అధునాతన కాథలాబ్ సౌకర్యం తో పాటు బ్రెయిన్ స్ట్రోక్ లకు అడ్డుకట్ట వేసే న్యూరాలజీ సేవలు కూడా ఇప్పుడు పాలకొల్లు పరిసరా ప్రాంత ప్రజలకు యునైటెడ్ హాస్పిటల్ ప్రారంభంతోఅందుబాటులోకి వచ్చేయని చెప్పారు. గతంలో తాను చేసిన విజ్ఞప్తి మేరకు చైతన్య రాజు శ్రీ రవికిరణ్ వర్మ పాలకొల్లులో ఈ ఆసుపత్రిని ప్రారంభించారని అన్నారుఆత్యాధునికవైద్య సదుపాయాలు అనుభవజ్ఞులైన వైద్యులచే ప్రజలకు వైద్యం అందించే విధంగా ఇ క్కడ ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు సభాధ్యక్షులు సంస్థ చైర్మన్ శ్రీ చైతన్య రాజు మాట్లాడుతూ ఏ ఐ ఆధారిత పరికరాలు వ్యాధి నిరోధక ఆరోగ్య పరీక్షలు వంటి అవసరాలను మెడ్ యునైటెడ్ ఆసుపత్రితీరుస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య అవసరాన్నిబట్టి నేడు ఆసుపత్రి తీరుస్తుందని అన్నారు రోగుల ఇంటి వద్దకు వైద్య నర్సింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చిన



ఘనత మెడ్ యునైటెడ్ ఆసుపత్రి కే దక్కుతుందని అన్నారు. కిమ్స్ మరియు మెడ్ యునైటెడ్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ రవికిరణ్ వర్మ మాట్లాడుతూ ప్రతి సామాన్యుడు మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే వైద్యం అందించడం జరుగుతుందని చెప్పారు. ఇతర ఆసుపత్రులతో పోలిస్తే 25 నుంచి 40% తక్కువ కే రోగులకు తాము వైద్య సదుపాయాల అందిస్తామని అన్నారు. పాలకొల్లులోని జిన్నూరు బాబు (డిటిడిసి బాబు) స్థానిక ఆహ్వానం హెూటల్ యజమాని శ్రీరామ్ తమ వద్ద పనిచేసే సిబ్బందికి ఆయు భరోసా పథకం వర్తింపజేయాలని కోరుతూ అందుకు అవసరమైన సొమ్ముతో చెక్కులను అందజేశారు ఈ కార్యక్రమంలో అమలాపురం, ముమ్మిడివరం శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్ , బొర్రా గోపి మూర్తి, అంగర రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్సీలు మేక శేషుబాబు, తదితర నాయకులు పాల్గొన్నారు..

# అధికంగా ఉన్న నీటిని బయటకు పంపండి - వ్యవసాయ అధికారి శివశంకర్

**చాట్రాయి, సెప్టెంబర్16, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరి పొలాల్లో నీరు నిల్వ ఉంటే తొలగించాలని తద్వారా పంటను రక్షించుకోవచ్చు అని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ చెప్పారు. చాట్రాయి మండలంలో ముంపు బారిన పడిన వరి పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండలంలో 1100 ఎకరాల వరి సాగు ఉందని కొన్ని గ్రామాలలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల వరి మడులలో నీరు అధికంగా నిల్వ ఉందని రైతులు వెంటనే తొలగించాలని ఆయన కోరారు. మండలంలో పత్తి 150 ఎకరాలు, మినుము 30 ఎకరాలు సాగులో ఉందని ఆయన వివరించారు. వరి దుబ్బు చేసే సమయం కావడంవల్ల రైతులు తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అధిక వర్షాల వల్ల పంట తెగుళ్ళు సోకి నష్టపోకుండా రైతులు ఒక లీటర్ నీటికి కార్బన్డిజం 10ఎం. ఎల్ మరియు మంకో జబ్ ఒక లీటర్ నీటికి మూడు గ్రాములు కలిపి పిచికారి చేయాలని దీనివల్ల తెగుళ్ళు అరికట్టవచ్చని ఆయన సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటకు ఎకరాకు 20 కేజీలు యూరియా మరియు 20 కేజీలు పొటాషుచల్లాలని చెప్పారు. దీనివల్ల పంట నష్టపోకుండా త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా పత్తి పంటకు పూత పిండి దశలో ఉంటే 25 నుండి 30 కేజీలు యూరియా



మరియు 10 కేజీలు పొటాషియం కలిపి బూస్టర్ పద్ధతుల్లో చల్లాలని ఆయన తెలిపారు.

# అభివృద్ధి పథంలో వేల్పూరు సొసైటీ -పాలకవర్గానికి ఎమ్మెల్యే రాధాకృష్ణ అభినందనలు

## సొసైటీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**తణుకు, సెప్టెంబర్ 16(ప్రభాత వార్త) :**క్రమశిక్షణ, పట్టుదలతో గతంలో పని చేసిన ఛైర్మన్లు వేల్పూరు సొసైటీను అభివృద్ధి పథంలో నిలిపారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. పాలవర్గంతోపాటు ఇక్కడి రైతులు అందించిన సహాయ సహకారాలు, క్రమశిక్షణతోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. తణుకు మండలం వేల్పూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం మంగవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో రైతులు చెల్లించి మళ్లీ తిరిగి చెల్లించే విధంగా రైతులు సహకారం అందిస్తున్నారన్నారన్నారు. ప్రస్తుతం సొసైటీలో రూ. 3.50 కోట్లు మేర డిపాజిట్లు ఉన్నాయని ముఖ్యంగా సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ, పాల సేకరణ, ఫెర్టిలైజర్లు ద్వారా ఆదాయం సమకూరుతోందన్నారు. సంస్థ ఏ వ్యాపారం చేసినా లాభాల బాటలోనే ఉంటుందని గుర్తు చేశారు. ఆరిమిల్లి వెంకటరత్నం, పెనుమర్తి సోమసూర్యచంద్రరరావు చూపిన మార్గంలో తర్వాతి కాలంలో పని చేసిన ఛైర్మన్లు బాధ్యత, క్రమశిక్షణతోనే సొసైటీను అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గాన్ని ఎమ్మెల్యే రాధాకృష్ణ అభినందించారు. అనంతరం వేల్పూరులోని గీతా మందిరంలో గ్రామ కూటమి నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో



అభివృద్ధి చేయడానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పెనుగొండ భాష్యం విద్యార్థులు

**పెనుగొండ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు సెప్టెంబర్ 15న సోమవారం తణుకులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ, కార్యదర్శి సంకు సూర్యనారాయణల ఆధ్వర్యంలో నిర్వహించారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలురు, బాలికల క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ ఎంపికల్లో పెనుగొండ భాష్యం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషం. 9వ తరగతి విద్యార్థి యు. డెన్ని ప్రేమ్ అండర్-14 బాలురు ట్రైయాతలిన్-ఎ విభాగంలో జిల్లా ద్వితీయ స్థానం దక్కించుకున్నాడు. 8వ తరగతి విద్యార్థి ఎం.ఎస్.ఎన్.డి.డి. శివ అండర్-14 బాలురు ట్రైయాతలిన్-బి విభాగంలో జిల్లా ద్వితీయ స్థానం సాధించాడు.వీరు రాబోయే సెప్టెంబర్ 27 నుంచి 29 వరకు ఏలూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పోటీపడనున్నారు



## ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమం



ఆగిరిపల్లి సెప్టెంబర్ 16 ప్రభాతవార్త జడ్పీహెచ్ఎస్ ఆగిరిపల్లి నందు మంగళవారం హిందీ దివస్ ఘనంగా జరిగింది. హిందీ భాష మన రాజ భాష అని దాని ఔన్నత్యాన్ని హిందీ భాషా ఉపాధ్యాయు లు బి కవితా బాయ్ , రజిని గంధ బి విజయలక్ష్మి పద్యాలు పాటలు కవితల రూపంలో చక్కగా వివరించారు. విద్యార్థులు అనేక రకాలైన బోధనోపకరణాలను చక్కగా తయారుచేసి హిందీ ఎగ్జిబిషన్ ను ప్రదర్శించారు. విద్యార్థులు పాటలు గేయాలు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి పుష్పలత , ఎస్ఎంసి చైర్మన్ ఆవుల నరేష్ గ, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


## పొలం పిలుస్తుంది కార్యక్రమం

**మొగల్తూరు సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మొగల్తూరు మండలం వారతిప్ప మరియు ముత్యాలపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన రైతుల తో మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా అమలు జరుగుతున్న పథకాలు వాటి రాయితీ



గురించి మరియు రైతులందరూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడ్డాల సూరిబాబు, కార్యదర్శి ఎం సత్యనారాయణ, ఈహెచ్ తనూజ, కొల్లాటి మూలస్వామి, కొల్లాటి నాగేశ్వరరావు, వాటాల శ్రీను, పెద సింగు నాగేశ్వరరావు, కొల్లాటి పెంటయ్య, నాగిడి భగవాన్, తదితర రైతులు గ్రామస్తులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## శ్రీ అభయాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు



**మొగల్తూరు సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త)** ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వంతెన వద్ద వెలసి ఉన్న 36 అడుగుల శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహం వద్ద మంగళవారం ఉదయం స్వామివారికి మొగల్తూరు గ్రామస్తులు కిరాణా వ్యాపారి కారుమూరి నాగరాజు, రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం కారుమూరి నాగరాజు రత్నకుమారి దంపతులు ఆర్థిక సహాయంతో ఆలయం నందు భారీ అఖండ అన్న సమారాధన నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, నిప్పులేటి పుల్లారావు ధనలక్ష్మి, శ్రీనివాస్, లక్ష్మీ పావని వారి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దగ్గరుండి అన్న సమారాధన నిర్వహించారు

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# జిల్లాలో పోషణ మాసోత్సవాన్ని విజయవంతం చేయాలి

## - జిల్లాకలెక్టర్ నాగరాణి



**భీమవరం సెప్టెంబర్ 16ప్రభాతవార్త** :ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాదిగా ఉంటుందని, జిల్లాలో పోషణ మాసోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.పోషణ మాసోత్సవంలో పిల్లలకు సంబంధించిన వివిధ అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. స్థూలకాయం నివారణ, బాల్య దశ సంరక్షణ మరియు విద్య, శిశు మరియు చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు, పిల్లల సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం, తదితర అంశాలపై సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు ఒక నెల రోజులు పాటు అవగాహన కార్యక్రమాలు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఊబకాయం అనేది సాధారణ ప్రమాదకరంగా మారిందన్నారు. దీనిలో బాల్య ఊబకాయం అనేది తీవ్ర సమస్య అని, కేవలం కొద్ది సంవత్సరాల్లోనే ఉబకాయమున్న పాఠశాల వయస్సు పిల్లల సంఖ్య పదిరెట్లు పెరిగిందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ఆహారపు అలవాట్లతో పాటు, రోజువారి దినచర్య, శారీరక శ్రమ, నిద్ర వంటి విషయాల్లో శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలలో మంచి ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని, పిల్లలను జంక్ ఫుడ్స్ కు దూరంగా ఉంచాలని, ఆరోగ్యకరమైన అల్పాహారం అలవాటు చేయాలని, పిల్లలను అతిగా తిననివ్వ వద్దని, తినేటప్పుడు సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాలని, శారీరక శ్రమ అలవాటు చేయాలని తెలిపారు. పోషణ మాసోత్సవాల ద్వారా తల్లిదండ్రులు పూర్తి అవగాహన పొంది తమ పిల్లలకు సరైన మార్గంలో శక్తివంతమైన పోషణను అందజేయాలని కలెక్టర్ తెలిపారు.

# ప్లాస్టిక్ రహిత జిల్లాగా ఏలూరు కృషి

**ఏలూరు, సెప్టెంబర్, 16 : ప్రభాతవార్త :**ఏలూరు జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా రూపొందించే దిశగా కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు తెలిపారు. మంగళవారం ఏపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల రెండవ రోజు సదస్సులో జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం నియంత్రణపై తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ వెట్రిసెల్వి ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు రీసైక్లింగ్ కాకుండా ఉండేలా ప్లాస్టిక్ స్లట్టర్ యంత్రాలను నియోజకవర్గానికి ఒక యూనిట్ ను అందించాలని, అటువంటి యూనిట్లు ఏర్పాటుచేసే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అదేవిధంగా రోడ్లపై పడవేసే కొబ్బరి బొండాలు, కొబ్బరి వ్యర్థాలను ఉద్యానవన పంటలలో ఎరువులు, తదితరాలకు వినియోగానికి అవసరమైన తయారీ యూనిట్లు ఏర్పాటుకు ప్రోత్సహించాలని కోరారు. ఈ అంశంపై స్వచంద్ర మిషన్ అధికారులు స్పందిస్తూ కొబ్బరి వ్యర్థాల పునర్వినియోగం యూనిట్ల ఏర్పాటుపై తిరుపతి లో పారిశ్రామికవేత్తలు ముందు వచ్చారని, త్వరలో రాష్ట్రంలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ పథకంలో ప్లాస్టిక్ స్లట్టర్ యంత్రాలను రాష్ట్రంలోని 210 మండల కేంద్రాలలో యూనిట్లు ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల వద్ద రానున్న మూడు నెలలలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

# మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

కైకలూరు సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త )కైకలూరు టౌన్ మహిళా భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ కె. కృష్ణ ఆధ్వర్యములో ఎస్ఐ ఆర్ శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసి కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, పాఠశాలలో విస్తృతమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలపై జరిగే నేరాలు (క్రైమ్ అగైనెస్ట్ విమెన్), సైబర్ నేరాలు, మరియు డయల్ 112 అత్యవసర సేవ గురించి విద్యార్థులు వివరించారు. మహిళలు తమను తాము రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్ బ్యాడ్ టచింగ్, హింస, వేధింపులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఆన్ లైన్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలు, వ్యక్తిగత సమాచారం దొంగిలించడం వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.తెలియని లింకులు క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని అత్యవసర సమయాలలో ప్రజలు డయల్ 112 కు ఫోన్ చేసి తక్షణ పోలీసు సహాయాన్ని పొందవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు ముఖ్యంగా యువతలో నేరాల పట్ల, భద్రత పట్ల అవగాహన పెంచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి దళం సభ్యులు వివిధ ప్రాంతాల్లో గస్తీ తిరిగి ఎటువంటి ఆకతాయిలు వేధింపులకు పాల్పడ కుండా గస్తీ లు నిర్వహిస్తారు.

# పాల శీతల కేంద్రంలో పాల దోపిడి

## - పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు

**చాట్రాయి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చాట్రాయి పాలసీతల కేంద్రంలో పాల దోపిడీ జరుగుతుండగా ముగ్గురు వ్యక్తులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. వివరాల ప్రకారం పాలశీతల కేంద్రంలో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు కేంద్రానికి వచ్చిన పాలను రోజుకి సుమారు 50 లీటర్ల వరకు నిత్యం బయటికి విక్రయం జరుగుతున్నట్లు తెలియటంతో నిఘా పెట్టడంతో ముగ్గురు వ్యక్తులు దొరికినట్లు తెలిసింది. కేంద్రం నుండి పాలు మాయం చేసి బయట వ్యక్తులకు నెలవారీ ఖాతాలకు పాలు పోస్తున్నట్లు దొరికిన వ్యక్తులు చెప్పినట్లు తెలుస్తోంది.


**ముగ్గురిని తొలగించాం : డైరెక్టర్ బొట్టు**

చాట్రాయి పాలశీతల కేంద్రంలో అక్రమంగా పాలు అమ్ముకుంటున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడిన మాట వాస్తవమేనని ఆ ముగ్గురుని విధులు నుంచి తొలగిస్తున్నట్లు కృష్ణాజిల్లా పాలసీతల కేంద్రం డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు చెప్పారు. ఇకపై భవిష్యత్తులో ఈ విధంగా పాల దోపిడీ జరగకుండా పటిష్ఠ మైనచర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# తమ్మిలేరులో పడి వ్యక్తి మృతి

## -చేపల వేటకు వెళ్లి మృతి

**చాట్రాయి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :** చేపల వేట కోసం తమ్మిలేరులోకి వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ప్రకారం చాట్రాయి మండలం మంకొల్లు గ్రామానికి చెందిన పేరబోయిన సత్యనారాయణ(55) సోమవారం రాత్రి చేపలు వేట కోసం వలలు వేసేందుకు వెళ్లాడు. తమ్మిలేరులోకి వెళ్లిన సత్యనారాయణ మంగళవారం మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం తమ్మిలేరులో గాలించారు. తమ్మిలేరు లింకు కాలువ వద్ద సత్యనారాయణ మృతదేహం కనపడింది. సమాచారం తెలుసుకున్న చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. దీనితో మంకొల్లు లో విషాదఛాయలు నెలకొని ఉన్నాయి.



# వరి పంటకు తెగుళ్లు బెడద అప్రమత్తంగా ఉండాలి.


ఆగిరిపల్లి సెప్టెంబర్ 16 ప్రభాత వార్త :ఆగిరిపల్లి మండలము కొత్త ఈదర, బొద్దనపల్లి గ్రామములలో పొలం పిలుస్తోంది కార్యక్రమము మంగళవారం నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమములలో మండల వ్యవసాయాధికారి భవాని మాట్లాడుతూ వరి పైరు దుబ్బు చేసే దశలో ఉన్నందున రైతులందరూ పురుగులు తెగుళ్ల తో అప్రమత్తంగా ఉండాలని తెలియచేసారు. గాలిలో తేమశాతం 90 శాతం, మబ్బులతో కూడిన వర్షం పరిస్థితులు ఉన్నప్పుడు నత్రజని ఎరువులు ఎక్కువైనప్పుడు వరి లో పొడతెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా వుంటాయని తెలియచేశారు. ఈ తెగులు ఆశించిన వరి పైరు లో దుబ్బు చేసే దశ నుండి కాండము, ఆకులపై మచ్చలు పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు, పైరు పూర్తిగా ఎండిపోతుంది. తెగులు వెన్ను వరకు వ్యాపిస్తే తాలు గింజలు ఏర్పడతాయి. దీని నివారణకు నత్రజని ఎరువును 3-4 దఫాలుగా వేసుకోవాలి. గట్లపైన చేలో కలుపు లేకుండా చూసుకోవాలి. హెక్సాకోనజోల్ 2 మి.లీ. మందును కానీ ప్రాపికోనజోల్ 1 2 మి.లీ. మందును కానీ ఒక లీటర్ నీటిలో కలిపి



15 రోజులకు ఒకసారి రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలియచేసారు.

# నేడు శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లు లెక్కింపు

మొగల్తూరు సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త) 216 నేషనల్ హైవే ను అనుకుని ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం నందు బుధవారం ఉదయం 10 గంటల నుండి అమ్మవారి హుండీలు లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, మంగళవారం విలేకరులకు తెలియజేశారు, మరియు ఆసక్తిగల భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చని వారు తెలియజేశారు



# విద్యాపోషకుడా... విజయీభవ...!

## కైకలూరులో ఘనంగా బొర్రా చలమయ్య జన్మదిన వేడుకలు



కైకలూరు, సెప్టెంబరు 16 (ప్రభాతవార్త) : ఎందరో చిన్నారులను తన విద్యాసంస్థ ద్వారా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న విద్యాపోషకుడు బొర్రా చలమయ్యకు పలువురు తల్లిదండ్రులు. మిత్రులు, శ్రేయోభిలాషులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ... 'విద్యాపోషకుడా... విజయీభవ...!' అంటూ ఆశీస్సులందించారు. మంగళవారం కైకలూరు పట్టణంలో టిడిపి నాయకులు, లిటిల్ ఫ్లవర్' స్కూల్స్ అధినేత బొర్రా చలమయ్య జన్మదిన వేడుకలు కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చలమయ్య పుట్టినరోజు సందర్భంగా కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు పేదలకు అన్నదానంతోపాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లకు రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పరాసా ఏడుకొండలు, కట్టా వీర రాఘవులు, జిల్లా అధ్యక్షులు పరసా వీర్రాజు చేతుల మీదుగా రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కైకలూరు పట్టణంలోని ఎస్టీ కాలనీ నందు నివసిస్తున్న పేదలకు, అంగన్వాడిలోని చిన్నారులకు రొట్టెలు, పండ్లు అందజేయడం జరిగింది. సాయంత్రం ఎయిమ్ ఫర్ సేవ ఆశ్రమం నందు చిన్నారుల మధ్య జన్మదిన వేడుక కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొర్రా చలమయ్య పుట్టిన రోజు నాడు ప్రజలకు అందుబాటులో లేకపోయినా ఆయన పేరు మీద పలు సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్స్ ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ, క్రమశిక్షణ, ప్రణాళికాయుతంగా ముందుకుసాగుతూ.. తల్లిదండ్రుల కలలను సాకారం చేసస్తూ.. సరస్వతీ పుత్రులందరినీ భరతమాత గర్వించే స్థాయికి చేర్చి తన ఆశయసాధనలో అనునిత్యం కృషిసల్పుతున్న చలమయ్యకు అన్నివర్గాల ప్రజలు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి భగవంతుని ఆశీస్సులు నిండుపున్నమిలా ఉండాలని ఆకాంక్షించారు. ఎంతోమంది ' విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి రాజకీయంలో తనకంటూ ఒక పేరు సంపాదించుకున్న నేత చలమయ్య అని ప్రశంసించారు. ప్రథమంగా మండవల్లి మండలం లోకుమూడి దత్తాశ్రమం నందు కేక్ కట్ చేసి చలమయ్య కు వీడియో కాల్ ద్వారా అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తదితర గౌడ్ సంఘ నేతలు పాల్గొన్నారు.

## బాలసంజీవని కిట్లు పంపిణీ సక్రమంగా జరగాలి:జె.సి. రాహుల్ కుమార్ రెడ్డి



భీమవరం సెప్టెంబరు 16ప్రభాతవార్త :బాల సంజీవిని కిట్లను సకాలంలో అంగన్వాడి కేంద్రాలకు అందేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లా స్థాయి సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం మానిటరింగ్ రివ్యూ కమిటీ సమావేశాన్ని సంబంధిత కమిటీ సభ్యులతో నిర్వహించారు.

అంగన్వాడీల కేంద్రాల ద్వారా గర్భిణీలకు బాలింతలకు ప్రభుత్వం ప్రతి నెల అందిస్తున్న పోషకాహార సరుకులను నాణ్యతతో, నిర్ణీత సమయానికి అందజేయాలన్నారు. అలాగే బాల సంజీవని కిట్లను ముందుగానే అంగన్వాడీ కేంద్రాలకు చేరేలా పరివేక్షించాలన్నారు. బాల సంజీవిని కిట్లు ద్వారా సరఫరా చేసే రాగి పిండి, అటుకులు, వేరుశెనగ చిక్కిలు, బెల్లం, ఎండు ఖర్జూరం ఐదు రకములతో కూడిన ప్యాకెట్, మరియు రైసు ,కందిపప్పు, ఆయిల్, ప్రతి నెల సక్రమముగా అందుతున్నాయా ఏమైనా లోటు పాట్లు ఉంటున్నాయని కమిటీ సభ్యులను ఆరా తీశారు. గర్భిణీలకు పిల్లలకు అందించే ఆహారంలో ఎటువంటి నాణ్యత లోపం ఉండకూడదని అన్నారు. ఒకటో తేదీ నాటికి లబ్ధిదారులు అందరికీ సరుకులను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి, నోడల్ అధికారి పి.విజయలక్ష్మి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎం.డి ఇబ్రహీం, డీ ఎస్ ఓ ఎన్.సరోజ, డాక్టర్ సిహెచ్.భావన, సిడిపిఓలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ ద్వారా నేటి నుండి ప్రత్యేక శిబిరాలు.

అత్తిలి– సెప్టెంబర్ 16 ( ప్రభాత వార్త ): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు రెండు వారాలపాటు స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ అనే సమగ్ర ఆరోగ్య ప్రచార సేవా కార్యక్రమము నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వైద్యధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మహిళ ఆరోగ్యం పై అవగాహన పెంచడం, మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషక ఆహారాన్ని ప్రోత్సహించడం,కుటుంబాలను స్వశక్తి, చేయడం అనగా తమ జీవనోపాధికి శక్తివంతంగా, పని చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడానికి అందుకు దోహదం పడటం అనే లక్ష్యాలు సాధించాలని తెలిపారు. మహిళల ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని,తల్లి ఆరోగ్యంగా ఉంటే తన పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని, మహిళా శక్తి సమాజ శక్తి కి పునాది అవుతుందన్నారు. సెప్టెంబర్, 17, నుండి అక్టోబర్ 2 వరకు ప్రతిరోజు ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు , పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహి స్తారన్నారు. ఈ వైద్య శిబిరాలలో మహిళలలో గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లను, పరీక్షల ద్వారా తగిన వైద్య చికిత్సలను, రిఫరల్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలు కిశోర బాలికలలో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్స లు చేయడం,గర్భవతులను పరీక్షించి సరైన పోషక ఆహారం ఆవశ్యకత గురించి గర్భకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కౌన్సిలింగ్ నిర్వహించడం , కిశోర బాలికలలో హిమోగ్లోబిన్ పరీక్షలు చేయడం, రక్తహీనత గల వారికి చికిత్సలు చేయడం జరుగుతుంది, మరియు గర్భిణీ స్త్రీలకు ఎం సి పి కార్డ్స్ అందజేయడం జరుగుతుందన్నారు. పిల్లల్లో సికిల్ సెల్ అని మియా గుర్తించి అవసరమైన వారికి చికిత్సలు అందించడం, పిల్లలకు మరియు గర్భిణీ స్త్రీలకు వ్యాధి నిరోధక టీకాలు అందించడం, యుక్త వయసు బాలికలకు, మహిళలకు బహిష్టు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం,నూనె , చక్కెర పదార్థాలు ఎక్కువ మోతాదులో వినియోగించడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను తెలియజేస్తారన్నారు.

## వీఆర్ఏల సమస్యలపై వినతి పత్రం.




అత్తిలి– సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త): గ్రామ రెవెన్యూ సహాయకులకు వేతన స్కేళ్లను అమలు చేయాలని,, డి ఏ డి ఏ లను కొనసాగించాలని చెల్లించాలని, అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు ఇవ్వాలని కోరుతూ అత్తిలి తాసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ దసిక వంశీకి వినతిపత్రాన్ని అందజేశారు. రీ సర్వేలో వృద్ధులైన వీ ఆర్ ఏ లను మినహాయించి నామినీ లకు అవకాశం ఇవ్వాలని, నామినీ వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని కోరారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలని కూడా అభ్యర్థించారు. వీఆర్ఏల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి వి ఏవి పండు, మండల శాఖ అధ్యక్షులు ఎల్. శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఆర్.యేసురత్నం,నతానీయేలు తదితరులు పాల్గొన్నారు.

## పక్షోక్షవాలలో భాగంగా వైద్య శిబిరాలు

### - వైద్యాధికారిణి డాక్టర్ జ్యోతి

చాట్రాయి, సెప్టెంబరు 16, ప్రభాతవార్త : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా పక్షోక్షవాలను నిర్వహించాలని ప్రభుత్వం తలపెట్టిన నేపథ్యంలో మండలంలో పలు గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారిని డాక్టర్ జ్యోతి చెప్పారు. ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా చీపురుగూడెంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. 18న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చనుబండ నందు, 19న చిత్తపూరులో, 20న నరసింహారావు పాలెం లో, 22న పోలవరం, చనుబండ వన్ లో, 23న ఆరుగొలనుపేట,పోతనపల్లి లో, 24న బూరుగు గూడెంలో, 25న జనార్ధన వరంలో, 26న చిన్నంపేటలో, 27న కోటపాడు లో, 29న తమ్మగూడెంలో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన వ్యాధుల గురించి పరీక్షలు నిర్వహిస్తారని గ్రామాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు లో చికిత్సలు చేయించుకోవాలని ఆమె కోరారు.

## వైష్ణవ శ్రీకృష్ణ జయంతి.



అత్తిలి– సెప్టెంబర్ 15 (ప్రభాత వార్త): వైష్ణవ శ్రీకృష్ణ జయంతి సందర్భంగా అత్తిలి మండలం ఈడూరు వరాల వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష తిరుమంజనాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడువాడపల్లి శేఖరా చార్యులు ఆధ్వర్యంలో విశేష అర్చనలు జరిపారు. అత్తిలి లో గల వేణుగోపాలస్వామి, సంతాన గోపాలస్వామి ఆలయాలలో కూడా వైష్ణవ శ్రీ కృష్ణ జయంతి సందర్భంగా అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణ చార్యులు, వల్లి వెంకటేష్, సూర్యతేజ ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు.



మంగళవారం ఉదయం ఏపి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల రెండవ రోజు సదస్సులో పాల్గొన్న ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ. కె. ప్రతాప్ శివ కిషోర్. ప్రభాతవార్త:

## మొగల్తూరులో ముగిసిన వినాయక చవితి వేడుకలు

మొగల్తూరు సెప్టెంబర్ 16 (ప్రభాతవార్త) : వర్గమాన వారి వీధిలో శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాలు ముగింపు సందర్భముగా సోమవారం రాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఆడవారికి మగవారికి వేరే వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేసి సంతర్పణ జరిపారు. మొగల్తూరు గ్రామం చుట్టూ ప్రక్కల నుండి సుమారుగా ఐదు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదములు స్వీకరించారు. కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు.

## జంగారెడ్డిగూడెం డిఎల్ పిఓ గా సుబ్బరాయన్



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం డి ఎల్ పి ఓ గా సుబ్బరాయన్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సుబ్బారాయన్ ద్వారకాతిరుమల మండలంలో డిప్యూటీ ఎంపీడీవో గా పనిచేస్తున్నారు ఈయన ప్రమోషన్ పై జంగారెడ్డిగూడెం డి ఎల్ పిఓగా బదిలీ చేశారు డిఎల్ పిఓ సుబ్బరాయన్ ను పంచాయతీ కార్యదర్శులు,సంఘం జిల్లా అధ్యక్షులు పగడం నాగేశ్వరరావు, వివిధ మండలాల నుండి పలువురు డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు.

## జంగారెడ్డిగూడెం రోటరీ సర్వసభ్య సమావేశం



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త : జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ సర్వసభ్య సమావేశం మంగళవారం ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు అధ్యక్షతన స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో జరిగింది. కార్యదర్శి పెనుమర్తి సంధ్య ప్రవల్లిక స్వాగతం పలికి కార్యదర్శి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ కూరగాయల కమిషనర్ వర్తకులు సింగంశెట్టి హరిబాబు రోటరీ నూతన సభ్యులుగా చేరారు. హరిబాబును రోటరీ సీనియర్ సభ్యులు పాలపర్తి శ్రీనివాస్ రోటరీ పిన్ అలంకరించి ఆహ్వానించారు. ఈ సమావేశంలో సీనియర్ రోటరియన్లు కె.ఎల్, ఎన్ ధన కుమార్,వెలివెల పెద్దిరాజు,క్లబ్ వైస్ ప్రెసిడెంట్ జవ్వాది ఉమా మహేశ్వర రావు, కుబేర చిట్స్ సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు. ఈనెల 19న రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరుపుకునే కార్యక్రమాల గురించి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

## శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద మంగళవారం తెల్లవారుఝామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ,నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి,మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ స్వామివారి ఆలయం హనుమన్నామ స్మరణతో మార్మోగింది. ఈరోజు ఆలయము వద్ద గుడిపాడు గ్రామానికి చెందిన రామతులసి భజన సమాజం వారు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు దేవస్థానమున కు వివిధ సేవల,విరాళాల ద్వారా రూ.1,67, 297లు సమకూరింది. ఆలయానికి వచ్చిన భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాద వితరణ చేశారు. ఏర్పాట్లను కార్యనిర్వాహణాధికారిణి ఆర్.వి.చందన పర్యవేక్షించారు.

## టీనర్సాపురం మండల ప్రజలకు

### ఎస్సై జయబాబు సూచన



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: టీ నర్సాపురం మండలంలో మక్కిన వారి గూడెం,రుద్రకోట రాజుగూడెం, అప్పలరాజు గూడెం,బండి వారి గూడెం ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. వాహనదారులు ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై జయ బాబు సూచించారు.

## నేడు ఎమ్మెల్యే రోషన్ కుమార్ విస్తృత పర్యటన



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ బుధవారం లింగపాలెం,జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మండలాల్లో జడ్పీ చైర్ పర్సన్ ఘంట పద్మశ్రీ తో విస్తృతంగా పర్యటించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయం నుండి మీడియాకు మంగళవారం సమాచారం అందింది. బుధవారం ఉదయం 8:30 నిమిషాలకు లింగపాలెం మండలం ధర్మాజీ గూడెంలో జరిగే విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొన్నారు. 9:30 నిమిషాలకు లింగపాలెం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించే బోర్డును స్వస్తినారి స్వశక్తి పరివార్ అభినయ్ మహిళా ఆరోగ్య స్క్రీనింగ్ అవగాహన శిబిరాలను ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 10 గంటలకు జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలోని బాబ్జీ నగర్ కాలనీలో అంగన్వాడీ బిల్డింగును,సీసీ రోడ్డును జడ్పీ చైర్ పర్సన్ ఘంట పద్మశ్రీ తో కలిసి ప్రారంభిస్తారు. 10.30 నిమిషాలకు స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద గల జిల్లా పరిషత్ బంగ్లా రి ఎన్యుయేషన్ కాంపౌండ్ వాల్ ను ఇరువురు ప్రారంభించనున్నారు. 11:30 నిమిషాలకు బయనేరు ఒడ్డున గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద జరిగే శ్రీ మధ్య విరాట్ విశ్వకర్మ జయంతి యజ్ఞ కర్మ మహోత్సవం లో పాల్గొంటారు. మధ్యాహ్నం చక్రదేవరపల్లి బీటీ రోడ్ సిసి రోడ్ ను ఒంటిగంటకు లక్కవరంలో జడ్పీ నిధులతో నిర్మించిన రెండు అంగన్వాడి భవనములను జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2.30 నిమిషాలకు కామరపుకోట ఎంపీడీవో కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొన్నారు. అధిక వర్షాలు బుధవారం కురిస్తే వాతావరణంతో ఎమ్మెల్యే కార్యక్రమాలు వాయిదా పడే అవకాశం ఉందని ఎమ్మెల్యే కార్యాలయం వారు తెలిపారు.

## మన భారతీయ సంప్రదాయాలలో పండుగలు ఒక భాగం

### - మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా విజయీభావ బ్రోచర్ ఆవిష్కరణ



భీమవరం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : మన భారతీయ సంప్రదాయాలలో పండుగలు ఒక భాగమని, సంక్రాంతి దసరా, దీపావళి వంటివి ప్రజలు ఆనందంగా జరుపుకునే పండుగలని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థాన ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో దసరా విజయీభావ బ్రోచర్ ను ఆవిష్కరించారు. భావితరాలకు మన పండుగల విశిష్టతను తెలియజేసే విధంగా దసరా విజయీభావ కార్యక్రమాన్ని 32 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు దసరా విజయీభావ యాత్ర నిర్వహిస్తామని, 22న మావుళ్ళమ్మ ఆలయం వద్ద శోభాయాత్ర ప్రారంభమవుతుందని, అన్ని దేవాలయాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ, కలిగొట్ల గోపాల శర్మ, కొండ్రు శ్రీనివాస్, ఎస్ సత్యనారాయణ రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలు ఆర్ జే డి ఆకస్మిక తనిఖీ,



పెనుమంట్ర ప్రభాతవార్త : మండలంలోని ఎస్ ఇల్లిందలపర్రు, జుత్తిగ లోని అంగన్వాడీ కేంద్రాలను రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి సుజాత రాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రీ-స్కూలు స్టాకులు, రికార్డులు రిజిస్టర్లు పోషణ వాటిక పరిశీలించారు. పిల్లల బరువులు ఎత్తులు స్వయంగా పరిశీలించారు. ప్రీ-స్కూల్ నమోదులు పెంచాలని తెలిపారు. తల్లులకు అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను చేర్చేలా మోటివేషన్ చేయాలని అన్నారు. ప్రీ-స్కూల్ సక్రమంగా నిర్వహించాలని బరువులు ఎత్తులు సక్రమంగా తూయాలని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సిడిపిఓ ఎ. కృష్ణకుమారి, సూపర్వైజర్ వి వరలక్ష్మి పాల్గొన్నారు.

## సొసైటీలలో యూరియా నిల్వలు తనిఖీ



జీలుగుమిల్లి, సెప్టెంబర్-16, ప్రభాతవార్త: మండలంలోని దర్భగూడెం, జీలుగుమిల్లి సొసైటీలు కామయ్యపాలెం డిసిఎంఎస్ ల లో యూరియా నిల్వలను జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా, కేఆర్ పురం వ్యవసాయ శాఖ ఏడీఏ పీజీ బుజ్జి బాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ బోర్డులు వివరాలు, బస్తా ధర కూడా పెట్టాలని తెలియజేయడం జరిగింది . స్టాక్ బుక్కు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకొని ఈ-పాస్ లో రైతును వేలి ముద్ర వేసిన తర్వాతే స్టాక్ ఇవ్వాలని దుకాణాల యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అభివృద్ధికి తోడ్పడాలి

### ఎంపీపీ పోచమ్మ



జీలుగుమిల్లి, సెప్టెంబర్-16, ప్రభాతవార్త: :అధికారులు అభివృద్ధికి తోడ్పడాలని మండల పరిషత్ అధ్యక్షురాలు కే పోచమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పోచమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమక్షంలో..విద్యుత్ శాఖ ఏ ఈ ఆదిశేషుడు మాట్లాడుతూ రాయితీపై అందించే పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా స్థానిక సి ఆర్ ఆర్ కాలనీలో విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించామని తెలిపారు. తహసిల్దారు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 9515 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జీలుగుమిల్లి ప్రభుత్వాసుపత్రి వైద్యులు మణికంఠ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జ్వర పీడిత ప్రాంతాల్లో స్ప్రేయింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. నేటినుండి అక్టోబర్-02వ తేదీ వరకు జరిగే స్వస్త్ నారి స శక్త్ పరివార్ అభియాన్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 90% ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. పదో తరగతి 100 శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేస్తున్నమన్నారు ఎక్సైజ్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం ను ఎంపిటిసి సున్నం సురేష్ మండలంలో బెల్టు దుకాణాలపై, వీఆర్వోల కొరతపై, ప్రోటోకాల్ నిబంధనలపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో నిఖిల్ చరణ్, వైస్ ఎంపీపీ-02 ఉప్పల లలిత కుమారి, ఎంపీటీసీ నాలి శ్రీను, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలి

పాలకొల్లు ప్రభాతవార్త : ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటుపరం అంటే విద్యను వ్యాపారం చెయ్యడమేనని, ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి. గోపాలన్ డిమాండ్ చేశారు. దగ్గులూరు గ్రామంలో మెడికల్ కాలేజీ స్థలాన్ని మంగళవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి. గోపాలన్ మీడియాతో మాట్లాడుతూ దగ్గులూరు గ్రామంలో మెడికల్ కాలేజీ నిర్మాణం పేరుతో 60 ఎకరాల భూమిని సేకరించారని గుర్తుచేశారు. ల్యాండ్ ఫిల్లింగ్ పూర్తిచేసి, ఫౌండేషన్ ప్రాథమిక స్థాయిలో ఉందన్నారు. 2025 ఆగస్టు 2వ తేదీ నాటికి పూర్తిచేస్తామని గత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులన్నీ ఆగిపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సన్నర కాలం పూర్తవుతున్నా నేటికీ ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం కొనసాగించకపోగా ఈ ప్రభుత్వ కాలేజీని పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేస్తామని ప్రైవేటు వాళ్ళకి అప్పగించడం అన్యాయమన్నారు. ఇప్పటికే విద్యారంగం ప్రైవేటీకరణ అయిపోవడం వలన కేజీ టు పీజీ వరకు విద్య ఖరీదుగా మారిందని దీనివలన విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలైపోతున్న పరిస్తితి ఉందన్నారు. నేడు వైద్య విద్యను అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఉన్న బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూడటం దారుణమన్నారు. దీనివలన వైద్య విద్యా మరింత ఖరీదుగా మారి డబ్బు ఉన్నవారికే విద్య అన్నట్లు మారుతుందన్నారు. పిపిపి అంటే సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని చెపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అందుకు విరుద్ధంగా ప్రభుత్వ వైద్య విద్యను సంపన్నులకు కట్టబెట్టి వారిని అభివృద్ధి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులు పెట్టుబడి పెట్టడం అంటేనే లాభం కోసమని అలాంటిది సేవ చెయ్యాలని పెట్టుబడి పెట్టినోళ్లు ఎలా ఆలోచిస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. సూపర్ సిక్స్ హామీలను నమ్మి అసలు ఓట్లేస్తే ఇప్పుడు ఆ ప్రజలకు విద్య, వైద్యం దూరం చేసేలా కూటమి ప్రభుత్వం విధానాలను అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ పద్ధతి నుంచి తొలగించి, ప్రభుత్వమే కళాశాలలను నిర్మించి నడపాలని గోపాలన్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా పోరాటానికి సిద్ధపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కానేటి బాలరాజు, పాలకొల్లు ఏరియా కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, నాయకులు బాతిరెడ్డి జార్జి, కె.క్రాంతి బాబుగొల్ల ఏడుకొండలు, టి.శ్రీనివాస్, ఎస్.మాణిక్యం, వీరభద్రం మరియు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులలో మోడీ ఫోటోలు వెలిశాయి

చాట్రాయి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త : ప్రతి చౌక ధరల దుకాణాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలంటూ కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ ఆదేశాలు చాట్రాయ మండలంలో అమలులోకి వచ్చాయి. చాట్రాయి మండలంలో 32 రేషన్ షాపులు ఉండగా అన్ని షాపుల్లోనూ నరేంద్ర మోడీ ఫోటోను డీలర్లు ఏర్పాటు చేశారు. పేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో షాపులో ఉండటం గర్వంగా ఉందని పలువురు డీలర్లు అంటున్నారు.

# తెర

# కణ్మని.. ఇన్నోసెంట్ స్వీట్ గర్ల్



← ఓజీ కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం ఓజీ. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఓజాస్ గంభీరగా పవన్ కళ్యాణ్ శక్తివంతమైన పాత్రలో కనిపించనున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. సెప్టెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానున్న ఓజీ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. త్వరలో ట్రైలర్ విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. 'మూవీ అనౌన్స్ మెంట్ అయిన తర్వాత డైరెక్టర్ గారు కథ వినిపించారు. నాకు చాలా నచ్చింది. వెంటనే ఈ సినిమా చేయడానికి అంగీకరించాను. కణ్మని పాత్ర 1980-90లలో జరిగే కథ. పాత్రను మలిచిన తీరు కానీ, ఆహార్యం కానీ అప్పటికి తగ్గట్టుగానే ఉంటుంది. కణ్మని ఒక ఇన్నోసెంట్ స్వీట్ గర్ల్. గంభీర పాత్రతో గాఢమైన ప్రేమలో ఉంటుంది. గంభీర జీవితాన్ని మలుపు తిప్పే పాత్ర కణ్మని. ఇందులో తమన్ స్వరపరిచిన సువ్వి సువ్వినే సాంగ్ నచ్చడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఇందులో యాక్షన్ అనేది ఒక భాగం మాత్రమే. బలమైన కథ ఉంది. ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది. సీన్ ఎలా తీయాలి, నటీనటుల నుంచి ఎలాంటి నటన రాబట్టుకోవాలి.. ఇలా ప్రతి విషయంపై దర్శకుడు సుజీత్‌కు స్పష్టత ఉంది. నా క్యారెక్టర్, లుక్ బాగున్నాయంటే దానికి కారణం సుజీత్ గారే. తదుపరి ప్రాజెక్ట్‌ల విషయానికొస్తే తెలుగులో కొన్ని కథలు వింటున్నాను. అలాగే, వేరే భాషల్లో పలు సినిమాలు చేస్తున్నాను.

ఓజీతో దాదాపు రెండున్నరేళ్ల ప్రయాణాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. పవన్ కళ్యాణ్ గారితో కలిసి నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమాలో కణ్మని పాత్ర చేయడం మరింత అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పాత్రకి నా మనసులో ఎప్పటికీ ప్రత్యేక స్థానముంటుంది. పవన్ కళ్యాణ్ గారి నుంచి ఎన్నో నేర్చుకున్నాను. ఆయన జెంటిల్ మేన్. అందరినీ సమానంగా చూస్తారు. ఆన్ స్క్రీన్ లోనే కాదు ఆఫ్ స్క్రీన్‌లోనూ ఆయన రియల్ హీరో. పవన్ కళ్యాణ్ క్రేజ్ అనేది అవధులు లేనిది. నేను బెంగళూరులో ఉన్నప్పుడే ఆయన గురించి తెలుసు. అయితే ఆయనతో కలిసి నటిస్తున్నప్పుడు తెలిసిందే ఏంటంటే.. నేను ఊహించిన దానికంటే ఇంకా ఎక్కువ క్రేజ్ ఉంది. ఎంత క్రేజ్ ఉన్నా కూడా.. పవన్ గారు ఒదిగే ఉంటారు. డౌన్ టు ఎర్త్ పర్సన్. చాలా సింపుల్‌గా ఉంటారు. సెట్‌లో పవన్ కళ్యాణ్ ఎక్కువగా పుస్తకాల గురించి మాట్లాడతారు. ఆయన చదివిన కథలు, నవలల గురించి చెప్తారు. చరిత్ర గురించి మాట్లాడతారు. అప్పుడప్పుడు సినిమాలు, రాజకీయాల గురించి కూడా మాట్లాడుతుంటారు. ముఖ్యంగా ప్రజల గురించి ఎక్కువ మాట్లాడతారు. షూటింగ్ సమయంలో సన్నివేశం షూట్ చేయడానికి ముందు దర్శకుడు, నటీనటులతో పవన్ చర్చిస్తారు. సినిమాకి ఉపయోగపడే పలు గొప్ప సూచనలు ఇస్తుంటారు. నటుడిగా కూడా ఆయన తన పాత్రను చాలా సులభంగా చేస్తుంటారు. పవన్ గారి నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు.

## తెలుగు అమ్మాయి నందినికి మిస్ యూనివర్స్ కిరీటం



కేవలం 24 సంవత్సరాల వయసులో, తెలుగు అమ్మాయి చన్నగిరి నందిని విజయవాడలో దృఢ నిశ్చయంతో ఉన్న యువతి నుండి హైదరాబాద్‌లో ప్రసిద్ధ మోడల్, నటి మరియు పరోపకారిగా తనకంటూ ఒక బలీయమైన మార్గాన్ని ఏర్పరచుకుంది. కంప్యూ టర్స్‌లో బి.కామ్‌తో, ఆమె అంచనాలను ధిక్కరించింది, సవాళ్లను అధిగమించింది మరియు ఆకర్షణీయమైనంత ప్రభావవం తమైన కెరీర్‌ను నిర్మించింది. నందిని ప్రయాణం ఫ్యాషన్ ప్రపంచం పట్ల స్పష్టమైన మక్కువతో ప్రారంభమైంది, ఆమె తల్లిదండ్రులు మొదట్లో నిరుత్సాహపరిచినా.. తనపై నమ్మకంతో ముందడుగు వేసి అచంచలమైన పట్టుదలతో పరిశ్రమలో తన స్థానాన్ని పదిలం చేసుకోవటమే కాకకుండా ఆకట్టుకునే బిరుదులను సొంతం చేసుకుంది. ఇటీవలే, నందిని మిస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ 2025 కిరీటాన్ని గెలుచుకుంది. వైఐఎఫ్ డబ్ల్యూ అండ్ వైఎస్ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ వీక్ నిర్వహించిన మిస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ 2025 గోవాలో ఆగస్టు 29 నుండి 31 వరకు జరిగింది. 20 దేశాల నుండి పోటీదారులు పాల్గొన్నారు, 60 మంది సెమీఫైనల్స్‌కు చేరుకోగా, 40 మంది ఆగస్టు 31న జరిగిన గ్రాండ్ ఫినాలేకు ఎంపికయ్యారు. ప్రతిష్టాత్మకమైన 3 రోజుల ఈవెంట్‌లో మూడు పోటీ రౌండ్లు ఉన్నాయి: ఇంటర్నేషనల్ రౌండ్, స్విమ్‌వేర్ రౌండ్ మరియు బిజినెస్ రౌండ్. భారతదేశాన్ని గర్వంగా ప్రాతినిధ్యం వహిస్తూ, నందిని విజేతగా నిలిచింది.

## రష్మిక ఖాతాలో కాంచన 4?



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఫాం గురించి ఎంత చెప్పినా తక్కువే. సౌత్‌లో ఆమెకు తిరుగులేదు.. బాలీవుడ్‌లో కూడా వరుస ప్రాజెక్ట్ లతో దూసుకెళ్తుంది. హిందీలో ఒకటి అర ఫ్లాపులు పడుతున్నా దాన్ని లెక్క చేయకుండా ఆఫర్లు ఇస్తున్నారు. లేటెస్ట్‌గా షాహిద్ కపూర్‌తో ఒక సినిమా ఫైనల్ అయినట్టు తెలుస్తోంది. కాక్ టైల్ 2లో రష్మిక ఛాన్స్ అందుకుందని సమాచారం. ఆల్రెడీ ఆయుష్మాన్ ఖురానా సినిమాలో అమ్మడు నటిస్తున్న విషయం తెలిసిందే. కాంచన 4లో రష్మిక మందన్న.. ఇక రష్మిక మందన్న ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరినట్టు టాక్. కోలీవుడ్ సూపర్ హిట్ ఫ్రాంచైజీ కాంచన నాలుగో మూవీగా కాంచన 4 వస్తోంది. ఈ సినిమాను లారెన్స్ డైరెక్ట్ చేస్తూ నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమాలో బుట్ట బొమ్మ పూజా హెగ్డే నటిస్తుందని టాక్. ఆమెతో పాటు రష్మిక మందన్న కూడా ఉంటుందని అంటున్నారు. సినిమాలో ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్‌లో రష్మిక మందన్న ఉంటుందట. సో సినిమాలో రష్మిక ఘోస్ట్‌గా కనిపిస్తుందని చెబుతున్నారు. టాకప్రభాస్ ప్రశాంత్ వర్మ మూవీ.. టాలీవుడ్‌లో ఇదే తొలిసారి.. ఇప్పటికే రష్మిక మందన్న డిఫరెంట్ రోల్స్‌తో ఆడియన్స్‌ని మెప్పిస్తోంది. ఇప్పుడు అమ్మడు కాంచన 4లో కొత్త రోల్‌లో సర్ ప్రైజ్ చేయబోతుందట. ఐతే మేకర్స్ నుంచి అఫీషియల్ కన్ ఫర్మేషన్ లేకుండానే కాంచన 4 లో రష్మిక ఉంటుందని సోషల్ మీడియాలో హంగామా మొదలైంది. విజయ్ దేవరకొండతో హిట్ సెంటిమెంట్.. రష్మిక మందన్న నిజంగానే కాంచన 4 లో ఉందా లేదా అన్నది త్వరలో తెలుస్తుంది. ఏది ఏమైనా మిగతా హీరోయిన్స్ ఏమో ఛాన్స్ లు లేక ఖాళీగా ఉంటే రష్మిక మాత్రం ఒక దానికి మించి మరొకటి అనిపించేలా అవకాశాలతో అదరగొట్టేస్తుంది. రష్మిక సినిమాలో ఉంది అంటే సినిమా సక్సెస్ అన్నట్టేలా క్రేజ్ తెచ్చుకుంది. అందుకే ఆమె వెంట దర్శక నిర్మాతలు పడుతున్నారు. ఇక తెలుగులో రష్మిక మందన్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమా పూర్తి చేసింది. నెక్స్ట్ విజయ్ దేవరకొండ రాహుల్ సంకృత్యన్ కాంబో మూవీలో అమ్మడు నటిస్తుంది. ఈ సినిమా పీరియాడికల్ స్టోరీతో వస్తుంది. తప్పకుండా విజయ్, రష్మిక కాంబోకి ఉన్న హిట్ సెంటిమెంట్ ని ఇది రిపీట్ చేస్తుందని అంటున్నారు. విజయ్, రష్మిక కూడా ఈ సినిమా కోసం తమ ఫుల్ ఎఫర్ట్ పెట్టేస్తున్నారట. ఇద్దరి మధ్య ఆల్రెడీ మంచి కెమిస్ట్రీ ఉంటుంది కాబట్టి సినిమా నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుందని చెప్పుకుంటున్నారు. సో ఇటు సౌత్ లో స్టార్ ఛాన్స్ లతో పాటు బాలీవుడ్ లో మంచి ఫాం కొనసాగిస్తూ రష్మిక ఫుల్ స్వింగ్‌లో ఉంది.

## ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో బ్రహ్మ రాక్షస్



హనుమాన్ సినిమాతో దేశ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ తో ప్రభాస్ కొత్త సినిమా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ విజువలైజేషన్ పనులను పూర్తి చేశాడని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్, ప్రతి షాట్ ముందే డిజైన్ చేయబడి ఉన్నట్లు సమాచారం. దీంతో షూటింగ్ ప్రారంభమైన తర్వాత కూడా ఈ ప్రణాళిక ప్రకారం సమర్థంగా పని చేయగలరని అంటున్నారు. ఈ సినిమాకు ప్రస్తుతం బ్రహ్మ రాక్షస్ అనే వర్కింగ్ టైటిల్ వినిపిస్తోంది. అయితే, టైటిల్ మారే అవకాశాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న హనుమాన్ సీక్వెల్ జై హనుమాన్ పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది రెండవ పెద్ద చిత్రం కావడం విశేషం. కాంతార్ల ఫేం రిషబ్ శెట్టి హనుమంతుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. ప్రభాస్ అభిమానులు ఆయన ఈ కొత్త సినిమాతో మరోసారి భారీ విజయాన్ని అందిస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ ప్రారంభం కాగానే మరిన్ని అధికారిక వివరాలు వెలువడే అవకాశముంది.

## గ్రామీణ రాజకీయాలలో స్త్రీ శక్తే ప్రభుత్వ సారాయి దుకాణం



ఎస్ వి ఎస్ ప్రొడక్షన్స్ శ్రీనిధి సినిమాస్ బ్యానర్స్‌పై జాతీయ అవార్డు గ్రహీత నరసింహా నంది రచన దర్శకత్వంలో రానున్న చిత్రం ప్రభుత్వ సారాయి దుకాణం. దైవ నరేష్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మాతలుగా మురళీమోహన్ రెడ్డి సినిమాటోగ్రఫీలో నాగిరెడ్డి ఎడిటింగ్ చేస్తూ సిద్ధార్థ్ సంగీతాన్ని అందించారు. సదన్ హాసన్, విక్రమ్ జిత్, నరేష్ రాజు, వినయ్ బాబు హీరోలుగా శ్రీలు దాసరి, అదితి మైకేల్, మోహన సిద్ధి హీరోయిన్లుగా ప్రధాన పాత్రలు పోషించారు. 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్, బిజెపి బాలు నాయక్, రంగరాజు, తిలక్, బలగం సహదేవ్, స్వప్న, జ్యోతి తదితరులు కీలకపాత్రల పోషించారు. మల్లిక్, నరేష్ గౌడ్ ఈ చిత్రంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న పాటలు పోషించడం విశేషం. కాగా మంగళవారం మీడియా సమక్షంలో ఈ చిత్ర టీజర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నరసింహ నంది మాట్లాడుతూ... 'నేను ఒక కథను రెండు భాగాలుగా అనుకుని మొదటిగా ఈ సినిమా మొదలుపెట్టాను. ఈ సినిమాలో ప్రతి పాత్ర మనకు పురాణాల నుండి ఏదో ఒక పాత్రను, వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తూ ఉంటాయి. మనుషుల యొక్క వ్యక్తిత్వాలు అలాగే మనిషి యొక్క ఇతర ఆలోచనలు అన్నిటిని ఈ సినిమాలోని పాత్రలు ప్రతిబింబిస్తుంటాయి. అందుకే జంతువు లక్షణాలు కలిగిన మనుషుల కథ అంటూ ట్యాగ్ పెట్టాం. నిర్మాత దైవ నరేష్ గౌడ మాట్లాడుతూ... 'మా బ్యానర్లో మరొక 3 సినిమాలు రాబోతున్నాయి. కొంతమంది రాజకీయ నాయకులకు వెన్నులో వణుకు పుట్టించే సినిమాగా నిలిచిపోతుంద్ది అన్నారు. నిర్మాత పరిగి స్రవంతి మల్లిక్ మాట్లాడుతూ... ఈ సినిమాలో ప్రతి పాత్ర హీరోనే. ఒక గ్రామంలో జరిగే కొన్ని వాస్తవ సంఘటనలను తీసుకొని స్త్రీ శక్తిని చూపిస్తూ చేసిన సినిమా. ఎంతో ధైర్యం ఉంటే కానీ ఇటువంటి సినిమా తీయలేరు. అంతటి ధైర్యం ఉన్న వ్యక్తి మా దర్శకుడ్డు అన్నారు. సంగీత దర్శకుడు సిద్ధార్థ్ మాట్లాడుతూ... ' సినిమాలో ట్విస్టులు, మలుపులు ఉంటాయి. ఎన్నో సీన్స్ చాలా హై ఉంటాయి. సినిమాలోని పాత్రలలో మానవత కోణాల నుండి రాజకీయ కోణాల వరకు వివిధ రకాలుగా పాత్రలను చూడబోతున్నామ్ము అన్నారు. నటుడు విక్రమ్ జిత్ మాట్లాడుతూ... 'సాధారణంగా మనిషి లోపల రెండు కోణాలు ఉంటాయి. ఒకటి కనిపించేది, మరొకటి కనిపించనిది. ఈ సినిమా ద్వారా స్త్రీ శక్తి ఎంత బలంగా ఉంటుంది అనేది మా డైరెక్టర్ గారు నాకు చెప్పినప్పుడు నేను ఎంతో ఎక్సైటిగా ఫీల్ అయ్యాన్ను అన్నారు. నటి శ్రీలు మాట్లాడుతూ... 'ఈ సినిమాలో నా పాత్ర కాస్త కొత్తగా ఉండబోతుంద్ది అన్నారు. నటి మోహన సిద్ధి మాట్లాడుతూ... ' నేను ఈ సినిమాలో నా పాత్ర గురించి విన్నప్పుడు ఎంతో భయపడ్డాను. రెండు రోజులపాటు ఆలోచించాను. నాకంటూ ఒక గుర్తింపు వచ్చే పాత్ర అనిపించింది. ఈ సినిమాకు పార్ట్ 2 కూడా ఉండబోతుంద్ది అంటూ ముగించారు.

## ప్రేమకు.. ఓ నమస్కారం



కొత్తదనంతో కూడిన చిత్రాలను మన తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అందుకే మన దర్శక, నిర్మాతలు ఇప్పుడు న్యూ కాన్సెప్ట్ చిత్రాలను నిర్మించడానికి ఇష్టపడుతున్నారు. ఇక ఇప్పుడు సోషల్‌మీడియాలో, యూట్యూబ్‌లో సన్సేషన్ సృష్టించిన వారు వెండితెరకు పరిచయమవుతున్నారు. సక్సెస్ సాధిస్తున్నారు. ఇటీవల లిటిల్‌హార్ట్స్ చిత్రంతో యూట్యూబ్ సన్సేషన్, మీమ్ కంటెంట్ క్రియేటర్ మౌళి తనూజ్ బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. ఇప్పుడు ఈ కోవలోనే యూట్యూబ్‌లో వీడియోలతో తనకంటూ ఓ ప్రత్యేక మార్క్‌ను క్రియేట్ చేసుకున్న యూట్యూబ్ సన్సేషన్ షణ్ముఖ్ జస్వంత్ హీరోగా ఓ చిత్రం రూపొందుతోంది. ఉల్క గుప్తా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ నటుడు శివాజీ, ప్రముఖ నటి భూమిక కీలకపాత్రల్లో కనిపించబోతున్నారు. ఏబీ సినిమాస్ పతాకంపై అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్న ఈ చిత్రానికి వి. భీమ శంకర్ దర్శకుడు. మంగళవారం హీరో షణ్ముఖ్ జస్వంత్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి ప్రేమకు నమస్కారం అనే టైటిల్‌ని నిర్ణయించారని తెలియజేయడంతో పాటు ఇందుకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ గ్లింప్స్ వీడియోను గమనిస్తే.. ఇదొక యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌లా కనిపిస్తుంది. లవ్ ఫెయిల్యూర్స్.. లవ్ బ్రేకప్ అయిన వాళ్లంతా ఒక దగ్గర చేరి మాట్లాడుకుంటున్న సంభాషణలు, వాళ్ల గర్ల్‌ఫ్రెండ్స్ తమకు ఎలా హ్యాండ్ ఇచ్చారు అని చెప్పుకునే ఫన్నీ బాధలు అన్ని ఎంతో ఎంటర్‌టైనింగ్‌గా ఉన్నాయి. ఇక ఫైనల్‌గా షణ్ముఖ్ ఇది పాన్ ఇండియా ప్రేమ ప్రాబ్లమ్ అని చెప్పడం, మీరు అమ్మాయి దక్కలేదని మందుకు, సిగరెట్లకు ఖర్చు పెట్టే డబ్బులతో కైలాసగిరి దగ్గర ల్యాండ్‌తో పాటు కారు కొనుక్కోవచ్చు అని చెప్పే సంభాషణలు నేటి యూత్‌కు, వాళ్ల ప్రేమకు ఎంతో కనెక్ట్ అవుతాయి. టోటల్‌గా ప్రేమకు నమస్కారం అనే టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో ఎంతో ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ఇదొక యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో యూత్‌తో పాటు అందరికి కనెక్ట్ అయ్యే అంశాలున్నాయి. ముఖ్యంగా నేటి యువత లవ్, బ్రేకప్‌అప్, ఇలా అన్ని అంశాలను పూర్తి వినోదభరితంగా ఈ చిత్రంలో చూపించబోతున్నాం. నేటి యువత బాగా కనెక్ట్ అయ్యే కథ ఇది అన్నారు. నిర్మాత మాట్లాడుతూ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. కొత్తదనం, హిలేరియస్ ఎంటర్‌టైనర్‌మెంట్ ఈ చిత్రంలోని ప్రత్యేకతలు. తప్పకుండా చిత్రం మీ ఆదరణ పొందుతుంది అన్నారు.

## 18న వృషభ గర్జన



వృషభ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు మోహన్‌లాల్ గుడ్‌న్యూస్ వినిపించారు. వృషభ టీజర్‌ను సెప్టెంబర్ 18న రిలీజ్ చేయబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. "యుద్ధాలు, భావోద్వేగాలు, గర్జన్ల అంటూ మోహన్ లాల్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. రోర్ ఆఫ్ వృషభ, ది వరల్డ్ ఆఫ్ వృషభ అంటూ ఈ ట్వీట్‌లో మోహన్‌లాల్ పేర్కొన్నారు. ఈ ట్వీట్ తోనే టీజర్‌ను ఎప్పెడెప్పుడూ చూడాలా అనే ఇంట్రెస్ట్‌ను ఫ్యాన్స్‌లో క్రియేట్ చేశారు మోహన్‌లాల్. ట్వీట్‌తో పాటు మోహన్‌లాల్ పోస్టర్ ఆకట్టుకుంటుంది. త్రిశూలం ఆకారంలో ఉన్న కత్తి, డాలు పట్టుకొని ఇంటెన్స్‌లుక్‌లో ఈ పోస్టర్‌లో మోహన్ లాల్ కనిపిస్తున్నారు. యోధుడిగా పవర్‌ఫుల్ రోల్‌లో మోహన్‌లాల్ వృషభ సినిమాలో కనిపించబోతున్నట్లు పోస్టర్ చూస్తుంటే తెలుస్తోంది. టీజర్‌తోనే వృషభ ఏ రేంజ్‌లో ఉండబోతుందన్నది ఆడియెన్స్‌కు చూపించబోతున్నారు మేకర్స్. అభిమానుల అంచనాలకు ఎన్నో రెట్లు మించి ఈ సినిమా ఉండబోతుంది. ఇండియన్ సినిమాల్లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వృషభ తెరకెక్కుతోంది. కాన్సెప్ట్, గ్రాండియర్ విజువల్స్, మ్యూజిక్‌తో ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో ఉంటుంది.

తరాల పాటు నిలిచి పోయే శక్తివంతమైన కథాంశంతో దర్శకుడు నందకిషోర్ వృషభ సినిమాను రూపొంది స్తున్నారు. తండ్రీ కొడుకుల అనుబంధం హృదయాలకు హత్తుకుంటుంది. మైథాలజీ ఎలిమెంట్స్‌తో పాటు యాక్షన్, డ్రామా, సస్పెన్స్ ఇలా అన్నికమర్షియల్ హంగులతో విజువల్ వండర్‌గా వృషభ ఉండబోతుంది. కంప్లీట్ యాక్టర్ మోహన్‌లాల్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే సినిమా అవుతుంది. మోహన్‌లాల్ లుక్, ఆహార్యం, యాక్టింగ్ ... గత సినిమాలకు మంచి ఉంటాయి. వృషభలో మోహన్‌లాల్ నట విశ్వరూపాన్ని ఆడియెన్స్ చూస్తారు. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిలిమ్స్‌తో కలిసి అభిషేక్ వ్యాస్ స్టూడియోస్ వృషభ సినిమాను నిర్మిస్తోంది.

## కూతురు ఉన్న తండ్రి పెయిన్ కథే బ్యూటీ



బ్యూటీ చిత్రం ఈనెల 19న విడుదల కాబోతోంది. ఈ సినిమాలో కీలక పత్రాలు పోషించిన సీనియర్ నటుడు వీకే నరేష్, నటి వాసుకి మంగళవారం మీడియాతో ముచ్చటించి సినిమా గురించి తెలిపారు. ఈ సినిమాలో ప్రస్తుత జనరేషన్ తమను తాము చూసుకుంటారు. ఈ రోజుల్లో మ్యారేజ్ గురించి ఎవరూ ఆలోచించట్లేదు. అది ఒక కమిట్మెంట్. ఇప్పుడు లివ్ ఇన్ రిలేషన్, కలిసి ఎంజాయ్ చేసి విడిపోవడం అంతే. ఇప్పటి పిల్లలకు మనం ఏమి చెప్పలేము. ఫ్రెండ్‌గా ఉండటమే చేయాలి. నాకు కూతురు లేదు అనే లోటు ఎప్పుడూ ఉండేది. ఆ లోటు కాదు కానీ కూతురు ఉంటే ఇంత పెయిన్ పడేవాడినా అని ఈ సినిమాలో అనుభవించాను. ఈ సినిమా చూసి అమ్మాయిలకు వాళ్ళ ఫాదర్ గుర్తొచ్చి కంట్లో నీళ్ల రాకపోతే నన్ను అడగండి అని తెలిపారు. ..నటి వాసుకి మాట్లాడుతూ....నాకు కూతురు ఉంది. ఇప్పుడు ఉన్న జనరేషన్‌లో ప్రతి అమ్మా యి చేసేది మా అమ్మాయి చేస్తుంది. ఈ కథ విన్నప్పుడు చెప్పిన పాయింట్ ఒక తల్లిగా నాకు కనెక్ట్ అయింది. ఒక తల్లికి, అమ్మాయికి ఉండాల్సిన అవగాహన, బాధ్యత ఉన్నాయి ఈ కథలో. ఇప్పటి జనరేషన్‌ని తిట్టి పెంచలేము. మంచిగా చెప్పాలి. ఈ సినిమా చూస్తే అమ్మాయిలు వాళ్ళ తండ్రుల మధ్య ఉన్న సమస్యలు తీరిపోతాయి అని తెలిపారు.

## తెలుసు కదా షూటింగ్ పూర్తి



మిరాయ్ లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ తెలుసు కదా. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శ కత్వం లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం తాజాగా షూటింగ్ పూర్తి చేసుకుంది. టీం లోకేషన్‌లో కేక్ కట్ చేసుకుని సెలబ్రేట్ చేసుకున్నారు. ఇటివలే రిలీజ్ చేసిన తెలుసు కదా టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సాంగ్ మల్లిక గంధ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. త్వరలో సెకండ్ సాంగ్ రిలీజ్ కానుంది. మేకర్స్ ఈ సినిమాని అగ్రెసివ్‌గా ప్రమోట్ చేయబోతున్నారు. డైరెక్టర్ నీరజకోన చాలా యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. ప్రమోషన్ మెటీరియల్ హ్యూజ్ రెస్పాన్స్‌తో సినిమాపై అంచనాలు పెంచింది. తమన్ మ్యూజిక్ అందించారు. జాతీ య అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్, సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్ జుళీ లావిష్ విజువల్స్ అందించారు.

# యువ శాస్త్రవేత్తకు పురస్కారం

**పేద కుటుంబం. నాన్న లేరు. అమ్మ అండతో కష్టపడి చదివి అంచెలం చలల ఎదిగారు కెల్ల శ్రీవెంకట పూర్ణచంద్రిక. యువశాస్త్రవేత్తగానూ గుర్తింపు పొందారు.**



మాది విజయనగరం. నాకు పదేళ్లప్పుడు నాన్న చనిపోయారు. అమ్మే నన్ను పెంచింది. ఇంటర్ తర్వాత ఎంబీబీఎస్ సీటు వచ్చినా ఆర్థిక కారణాల రీత్యా చేరలేకపోయా. వ్యవసాయ, ఉద్యానవన కోర్సుల్లో చేరితే త్వరగా ఉద్యోగాలు వస్తాయని తాడేపల్లిగూడెంలోని ఉద్యానవర్సిటీలో చేరా. డిగ్రీ అనంతరం ఐకార్ జూనియర్ ఫెలోషిప్ పరీక్ష రాస్తే జాతీయ స్థాయిలో 13వ ర్యాంకుతో ఢిల్లీలో సీటొచ్చింది. ఎంఎస్‌సిలో వ్యవసాయ రసాయనాల విభాగంలో చేరి, పరిశోధనలపైనా దృష్టిసారించా. పిజి పూర్తవగానే భారతవ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఎఆర్ఐ)లో పిహెచ్‌డి చేశా. ఆపై అఖిలభారత వ్యవసాయ పరిశోధన (ఎఆర్ఎస్) పరీక్షలో దేశంలోనే మొదటిర్యాంకునీ సాధించా. తర్వాత హైదరాబాద్‌లోని జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ (ఐఐఓఆర్) వ్యవసాయ రసాయనాల శాస్త్రవేత్తగా చేరా. పనికిరాదని రొయ్య పొట్టు పారేస్తాం. కానీ నేను దానిపై పరిశోధనలు చేసి సహజ ఎరువుగా మార్చా. రొయ్యపొట్టును శుద్ధిచేసి, ద్రవంగా మార్చి దానికి మొక్కలకు మేలు చేసే ట్రైకోడెర్మా వంటి సూక్ష్మజీవులు, పోషకాలు, శిలీంధ్ర సంహారకాలు, ఇతర జీవ, సేంద్రియ పదార్థాలను కలిపి ఆ మిశ్రమాన్ని విత్తనాలకు పొరలుగా చేశా. దీనికి పేటెంట్ కూడా లభించింది. ఈ ప్రయోగంతో నూనె గింజలు , పప్పు దినుసుల్లో దిగబడి 25%-30% పెరిగింది. బయోపాలిమర్ ఆధారిత మల్టీలేయర్ సీడ్ కోటింగ్‌లు, స్ప్రే చేయగల బయోడిగ్రేడబుల్ మల్చ్‌లు, పోషకాలు, బయో ఏజెంట్‌ల కోసం నానో-ఎనేబుల్డ్ క్యారియర్ విధానాలపై చేస్తున్న పరిశోధనలు ముగింపుదశలో ఉన్నాయి. త్వరలో వాటినీ ఆవిష్కరిస్తాం. ఈ క్రమంలో ప్లాంట్ పాథాలజీ సొసైటీ నుంచి ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం అందుకున్నా. తాజాగా భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) 97వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చేతుల మీదుగా ఉద్యానవన కేటగిరీలో యువ శాస్త్రవేత్త పురస్కారాన్నీ అందుకున్నా. దీనికి జాతీయ స్థాయిలో 700మంది పోటీపడగా నేను పురస్కారం దక్కించుకున్నా. తెలుగు రాష్ట్రాల నుంచి దీన్ని అందుకున్న తొలి శాస్త్రవేత్తగా నిలవడం గర్వంగానూ ఉంది. వాతావరణ పరిస్థితులు, విపరీతమైన రసాయనిక ఎరువుల వాడకం వల్ల జీవవైవిధ్య సూక్ష్మజీవులు నాశనం అవుతున్నాయి. దీంతో పంట దిగుబడి తగ్గుతోంది. వీటన్నింటినీ తట్టుకునేలా బయోపాలిమర్ ఆధారిత విత్తనోత్పత్తి చేపట్టాలనేది నా లక్ష్యం. ▫

# ఆధ్యాత్మిక నగరి స్వచ్ఛత కోసం..



**రద్దీ రహదారులు.. రోజూ వేలల్లో సందర్శించే యాత్రికులు. అలాంటి ప్రాంతాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూడటం కత్తిమీద సామే! దాన్ని సమర్థంగా నిర్వహించారు తిరుపతి కమిషనర్ నారపురెడ్డి మౌర్య. స్వచ్ఛ సర్వేక్షణ్ సూపర్ లీగ్ 2024-25లో రాష్ట్రపతి అవార్డునీ అందుకున్నారు. ఆమె గూర్చి తెలుసుకుందాం.**

నేను నగర కమిషనర్ గా బాధ్యతలు చేపట్టింది గత ఏడాదే. నిజానికి తిరుపతికి ఇదివరకే జాతీయస్థాయిలో రెండు స్వచ్ఛ అవార్డులు వచ్చాయి. దీంతో దాన్ని కొనసాగిస్తూ తిరునగరిని మరింత అభివృద్ధి చేయాలనుకున్నా. 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమ స్ఫూర్తితో 'బ్యూటిఫికేషన్ ఆఫ్ సిటీ' పేరిట ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించా. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్)లపై అధికారులు, సిబ్బందితో ఎప్పటికప్పు సమావేశాలు నిర్వహించా. మొదట్లో అనుకున్న ఫలితం రాలేదు. సమన్వయ లోపాన్ని గుర్తించి, క్షేత్రస్థాయిలో దృష్టిపెట్టా. అప్పుడే చదువులేని మహిళలు తారసపడ్డారు. వాళ్లని పారిశుద్ధ్య కార్మికులుగా తీసుకుని క్లస్టర్ల వారీగా పని విభజించా.

**వరుసగా మూడోసారి...**

సూర్యోదయానికి ముందే పారిశుద్ధ్య కార్మికులు విధుల్లోకొచ్చేవారు. ఉదయం 5 నుంచి 10 వరకు, భోజన విరామం తర్వాత 2 నుంచి సాయంత్రం 5.30 గం. వరకు రోడ్లు, వీధుల్లోని చెత్త, వ్యర్థాలు తొలగించడమే కాదు, ఇళ్ల నుంచి చెత్తనీ సేకరిస్తారు. రెడ్, గ్రీన్ స్టిక్కర్ విధానాన్ని తీసుకొచ్చి.. ఇంటి వృథాని చెత్తబండ్లకే ఇచ్చేలా ప్రోత్సహించాం. చెత్త పేరు కుందని వాట్సాప్ సమాచారమిచ్చినా శుభ్రపరిచేలా చర్యలు తీసుకున్నాం. డ్రోన్‌తో పరిశీలన, ఆకస్మిక తనిఖీలతో అప్రమత్తత వంటివీ చేస్తున్నాం. వీటన్నింటినీ ఆన్‌లైన్‌లోనూ పర్యవేక్షిస్తుంటాం. రోడ్లమీద చెత్త వేస్తున్నవారికి జరిమానాలు విధిస్తున్నాం. ఇవన్నీ తిరుపతికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు మూడో దక్కేలా చేశాయి. దీనిలో మహిళా కార్మికులదే ప్రధాన పాత్ర అని చెబుతా. 405 మంది మహిళలు వాహనాలు నడపడం మినహా అరన పనులూ చేస్తున్నారు. ఇటీవల స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇక్కడి డంపింగ్ యార్డు స్మార్ట్‌సిటీ ద్వారా ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల్ని పరిశీలించి మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. దీంతో డీసెంట్రలైజ్డ్, ఆన్‌లైన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను బలోపేతం చేస్తున్నాం. సేకరించిన చెత్తను నిర్వహించేలా అవసరమైన అధునాతన ప్లాంట్ల ఏర్పాటు తూకివాకం డంపింగ్ యార్డులో ఉంది. దీన్ని ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కుగా మార్చి ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్రయోగాలకు కేంద్రంగా వినియోగి స్తున్నాం. వ్యర్థాలను తిరిగి ఉపయోగించడం, భూగర్భ జలాల సంరక్షణకు సూరత్, కోయం బత్తూరుల్లో అవలంబిస్తున్న విధానాలను అనుసరిస్తున్నాం. వ్యర్థాలను ప్రాసెస్ చేసి, సేంద్రియ ఎరువుగా మార్చి రైతులు, నగర పాలిక అవసరాలకు అందించేలా సన్నాహాలూ చేస్తున్నాం. యువత, ప్రజలు దీనిలో భాగస్వాములయ్యేలా అవగాహన సదస్సులూ నిర్వహి స్తున్నాం. ప్రత్యేక సర్వేల ద్వారా మెరుగు పడని ప్రాంతాలను గుర్తిస్తున్నాం. ప్రస్తుతం ఇచ్చిన ఫైవ్‌స్టార్ రేటింగ్‌ను సెవెన్ స్టార్‌కు తీసుకెళ్ళాలి. ఈ లెగసీ కొనసాగించాలన్నవి నా ముందున్న లక్ష్యాలు. ▫



# సవాలే అయినా సాధిద్దాం !

**పురుషులతో సమానంగా మహిళలూ ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ, ఉన్నత పదవులు చేపట్టడానికి మాత్రం చాలామంది ఆసక్తి చూపడం లేదంటు న్నాయి పలు అధ్యయనాలు. ఇందుకు కుటుంబ సభ్యుల అనారోగ్యాలు పెళ్లి, పిల్లలు, వారి చదువులు.. ఇలా కారణాలు చాలానే. ఓ పక్క ఈ బాధ్యతలూ, మరో పక్క విధుల్నీ సమన్వయం చేసుకోవడంలో ఇబ్బందే అయినా కొన్ని మార్పులతో ఈ సవాళ్లను అధిగమించొచ్చంటున్నారు నిపుణులు.**



మంచి కెరియర్‌లో స్థిరపడాలన్న కల.. ఉద్యోగంలో చేరడంతోనే అది పూర్తయిపోదు. విధులకు హాజరైన మొదటి రోజు నుంచే భవిష్యత్తుని ఊహించాలి. దానికి అనుగుణంగా జీవన ప్రయాణానికి ప్రణాళిక వేసుకోవాలి. పెళ్లి, పిల్లలు వంటి విషయాల్లో స్పష్టతే కాదు.. ఎక్కడ విరామం తీసుకోవాలి? కొత్త బాధ్యతలు తీసుకున్నప్పుడు రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తూ ముందుకు నడవడానికి ఎవరి సాయం కోరాలి? వంటి విషయాలన్నింటిపై స్పష్టత ఉంటే మీకు ఇబ్బంది ఉండదు. అవకాశాలు సృష్టించుకోవడం, వచ్చినప్పుడు అందిపుచ్చుకోవడం రెండూ మీ కెరియర్‌కి కీలకమే. అందుకు తగ్గ నిర్వహణా సామర్థ్యాలు మీకున్నాయో లేదో గమనించుకోండి. లేదంటే..వాటిని పెంచుకోవ దానికి ప్రయత్నించాలి. అవసరమైతే ప్రొఫెషనల్ ఆర్గనైజింగ్ కౌన్సెలర్స్ సాయం తీసుకోండి, ప్రాధమ్యాలు, పని విభజన, నైపుణ్యాల నిర్వహణ ఎలా చేసుకోవాలో చెబుతారు. ఇది మీరు ఉన్నతంగా ఎదిగేందుకు కొంతవరకూ తోడ్పాటునివ్వొచ్చు. పనికి పరిధి ఉండదు. మూసధోరణీ అసలే తగదు. కాలానుగుణంగా వచ్చే మార్పులతో పాటూ ప్రత్యేకంగా మీరున్న రంగంలోని కొత్త పోకడల్ని నిశితంగా పరిశీలించే అలవాటు చేసుకోండి. దానికి తగ్గట్లుగా మీలో ఏ మారునపలు చేసుకోగలరో ఆలోచించండి. స్మార్ట్ వర్క్ చేయడం, వారంలో కొన్నిరోజులు వర్క్‌ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని వినియోగించు కోవడం వంటివి ఏవైనా ఎంచుకోవచ్చు. అప్పుడు సులువుగా రెండు పనుల్నీ చక్కబెట్టు కోవచ్చు. కెరియర్‌లోనూ ముందుకెళ్లొచ్చు. ▫

# టమాటా పాలక్ పాస్తా

**పసందైన క్రీమీ టమాటా పాలకూర పాస్తా తయారీ చాలా కష్టమనుకుంటారు. నిజానికిది సులభమే. ఎలా చేయలంటే**

**కావలసినవి :** 2 కప్పుల పాస్తా, 2 చెంచాలు ఆలివ్ నూనె, చెంచా చొప్పున మిరియాల పొడి, వెల్లుల్లి తరుగు, కాస్త ఉప్పు, ఒక ఉల్లపాయ, 2 టొమాటోలు, 50 గ్రాములు మష్రూమ్స్, కట్ట పాలకూర, 5 చెంచాలు వెజ్ మేయోనేజ్, 2 టేబుల్ స్పూన్ల చీజ్ తురుము తీసుకోవాలి.



**తయారీ :** పాస్తాలో ఉప్పు వేసి ఏడెనిమిది నిమిషాలు ఉడికించండి. అడుగంట కుండా అప్పుడప్పుడు కలియ తిప్పు తుండాలి. దించేసి, నీళ్ల తీసేయండి. కడాయిలో నూనె వేసి.. సన్న సెగమీద వెల్లుల్లి, ఉల్లి తరుగు వేయించండి. అర నిమిషం తర్వాత టొమాటో ముక్కలు రెండు నిమిషాల తర్వాత మష్రూమ్ ముక్కలు, పాలకూర తరుగు వేసి.. ఇంకో మూడు నిమిషాలు ఉడికించండి. చిటికెడు ఉప్పు, పావు చెంచా మిరియాల పొడి వేసి కలపండి. ఒకసారి కడాయి పక్కకు తీసి. మేయోనేజ్ వేసి కలిపి.. మళ్లీ స్టవ్వు మీద పెట్టండి. నీరు ఇంకి తర్వాత.. ఉడికించిన పాస్తా జతచేసి కలియతిప్పి దింపేయండి. ఇది రుచిగా ఉండటమే కాదు, మంచి పోషకాహారం కూడా. ▫

# పిల్లల జుట్టు నెరిసిపోతోందా?



**వయసు పైబడే కొద్దీ తెల్లవెంట్రుకలు రావడం సహజమే! కానీ ప్రస్తుతం చిన్న పిల్లలకి కూడా జుట్టు నెరిసిపోవడం చూస్తున్నాం. పోషకాహార లోపం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు ఇందుకు పలు కారణాలున్నాయంటున్నారు నిపుణులు. దీనివల్ల చిన్నతనంలోనే పిల్లల వయసు ఎక్కువగా కనిపించి క్రమంగా వారిలో ఆత్మన్యూనతా భావానకి దారితేసే ప్రమాదం ఉందంటున్నారు. మరి ఈ సమస్య నుంచి పిల్లల్ని బయటపడేసే మార్గాలేంటో తెలుసుకుందాం..**

**ఇవీ కారణం కావచ్చు!** పిల్లల్లో జుట్టు త్వరగా తెల్లబడనికి కొన్ని సమస్యలు కారణం కావచ్చంటున్నారు నిపుణులు. .. పిల్లలు చుండ్రు సమస్యతో బాధపడుతున్నరా? అనేది గమనించాలి. ఎందుకంటే చుండ్రు జుట్టు త్వరగా తెల్లబడేలా చేసే అవకాశం ఉందట. కాబట్టి ఒకవేళ పిల్లల్లో సమస్య ఉన్నట్లయితే వెంటనే డాక్టర్ సలహాతో సరియైన మందులు వాడి చుండ్రు సమస్య దూరం చేయాలి.

✦. కొన్ని సమస్యలు వంశపారంపర్యంగా గమనిస్తూనే ఉంటాం. వాటిలో జుట్టు తెల్లబడడం కూడా ఒకటి. పిల్లల తల్లిదండ్రులకో, వారి తాతముత్తాతలకో ఈ సమస్య ఉంటే కూడా చిన్నతనంలోనే వచ్చే అవకాశాలుంటాయంటున్నారు నిపుణులు. విటమిన్ బి12 లోపం, రక్తహీనత, థైరాయిడ్, ఒత్తిడి.. వంటి సమస్యలతో బాధపడు తున్న చిన్నారుల్లోనూ తెల్ల వెంట్రుకలు అవకాశాలుంటాయంటున్నారు నిపుణులు.

✦ కొన్ని సమస్యలు వంశపారంపర్యంగా రావడం మనం గమనిస్తూనే ఉంటాం. వాటిలో జుట్టు తెల్లబడడం కూడా ఒకటి. పిల్లల తల్లిదండ్రులకో, వారి తాతముత్తాతలకో ఈ సమస్య ఉంటే వారికి కూడా చిన్నతనంలోనే వచ్చే అవకాశలుంటాయంటున్నారు నిపుణులు.

✦ విటమిన్ బి 12 లోపం, రక్తహీనత, థైరాయిడ్, ఒత్తిడి, వంటి సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల్లోనూ తెల్ల వెంట్రుకలు వచ్చే అవకాశం ఉంటుందట.

**సహజసిద్ధంగానే...**



పిల్లల్లో తెల్లజుట్టు నివారణకు కొన్ని సహజసిద్ధమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయంటున్నారు నిపుణులు.

✦ బాదం నూనె, ఉసిరి, నూనె... ఈ రెంటినీ సమపాళ్లలో తీసుకొని రాత్రి పడుకొనే ముందు జుట్టు కుదుళ్లలో బాగా మర్దన చేయాలి. అలాగే రాత్రంతా ఉండనిచ్చి ఉదయాన్నే శుభ్రంగా తలస్నానం చేయించాలి.

✦ జుట్టుకు పెట్టుకొనే నూనెలో కరివేపాకు వేసి కొదిసేపు మరిగించాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని చల్లారనివ్వాలి. ఇలా తయారైన నూనెను జుట్టుకు తరచూ పెడుతుండాలి.

✦ ఐరన్, విటమిన్ బి, కాపర్, సోడియం, ఫోలికామ్లం.. వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారంతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాల్ని పిల్లలకు ఎక్కువగా అందించాలి.

✦ అలాగే పిల్లలకు పదే పదే తలస్నానం చేయించడం, గాఢత ఎక్కువ ఉండే షాంపూలు వాడడం వంటివి ఎంత తగ్గిస్తే అంత మంచిది.ఇవన్నీ సహజ సిద్ధమైనవే కాబట్టి ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండకపోవచ్చు. అయితే ఈ చిట్కాలను పాటించడంతోపాటు సంబంధిత వైద్య నిపుణుల్ని సంప్రదించి వారి సలహాలు కూడా తీసుకోవడం మర్చిపోకూడదు. ▫

# ఇంటి తోట కోసం..



ఆరోగ్య కారణాల రీత్యా నేడు అందరి ఇళ్లలో మిద్దెతోటలు, బాల్కనీ తోటలంటూ చాలా మొక్కలను పెంచుతున్నారు. వీటిలో కొన్ని ఆలంకరణ కోసం అయితే, మరికొన్ని ఆరోగ్యం కోసం. మనల్ని సంరక్షించే ఈ మొక్కలు ఆరోగ్యంగానే ఉన్నాయా..! అని ఎప్పుడైనా ఆలోచించారా? వాటిని కాపాడేందుకు సహజ ఎరువులను ఇంట్లోనే ఎలాతయారు చేసుకోవాలో తెలుసుకుందామా.. ! **అరటి తొక్కల నీళ్లు..** మన ఇంట్లో అరటి పండ్లు తిన్న తొక్కలను ముక్కలుగా కోసి ఒక బకెట్ లేదా బాటిల్‌లో వేసి నిండుగా నీటిని నింపాలి. వీటిని ఒక రాత్రంతా నిల్వ చేసి మరుసటి రోజు మొక్కలపై పిచికారీ చేసినా.. మొక్క ఉండే కుండీలో వేసినా అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. క్రిమికీటకాలు దరిచేరవు.

**నిమ్మనీరు..** ఇంట్లో వాడేసిన నిమ్మ చెక్కలను బకెట్‌లో వేసి రెండురోజుల తరవాత తొక్కలను వడకట్టాలి. ఈ నీటిని మొక్కలకు అందించాలి. ఇలా చేయడం వల్ల నేలలో పిహెచ్ స్థాయులు స్థిరంగా ఉంటాయి. వేర్లకు పురుగు పట్టకుండా మొక్కలను కాపాడుతుంది. నిమ్మకి బదులు నారింజ తొక్కలను కూడా వాడవచ్చు. ▫

# చర్మం రంగు మారితే..

**రోజూ కొద్దిసేపు అలా బయటికి వెళ్లిచ్చినా చాలు. చర్మం రంగు మారిపోతుంది. ట్యాన్ పట్టేసిందని తెగ తిట్టేసు కుంటాం. కానీ చర్మ కణాలను యూవి కిరణాల బారి నుంచి రక్షించే ప్రక్రియే ఇది. ఎంత మంచిదైనా చర్మం భిన్న రంగుల్లో కనిపిస్తోంటే ఏం బాగుంటుంది? ట్యాన్‌ని తేలిగ్గా పోగొట్టుకునే ఈ చిట్కాలను పాటిస్తే సరి.**



◆ బంగాళదుంపను సన్నని చక్రాలుగా కోసి, సమస్య ఉన్నచోట రుద్దండి. దీనిలోని క్యాటకోలేజ్ అనే ఎంజైమ్ ట్యాన్‌ను తగ్గిస్తే.. యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ తో పోరాడతాయి.

◆ ఫైనాపిల్ ముక్కను తీసుకొని మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దానికి చెంచా తేనె కలిపి, ట్యాన్ ఉన్న ప్రదేశంలో పూతలా వేయండి. ఇరవై నిమిషాలయ్యాక చల్లని నీటితో కడిగేస్తే చాలు. దీనిలోని ఎ,సి విటమిన్లు దెబ్బతిన్న చర్మకణాలను పునరుత్తేజం చేస్తాయి. బ్రోమెలైన్, యాంటీ ఆక్సి డెంట్లు చర్మం తిరిగి నిగారించేలా చేస్తాయి.

◆ స్ట్రాబెర్రీలో ఆల్ఫా హైడ్రాక్సీ యాసిడ్లు ఉంటాయి. వీటిని తాజా క్రీమ్‌తో కలిపి, మెత్తగా మిక్సీ చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని సమస్య ఉన్నచోట రాసి, 20 నిమి షాలయ్యాక చల్లని నీటితో కడిగేస్తే చాలు రంగు మెరుగవడమే కాదు, చర్మానికి కావాల్సి న తేమా అందు తుంది. ◆ కలబందలోని విటమిన్ ఇ కూడా ట్యాన్‌ను దూరం చేసేదే. దీని గుజ్జును చర్మానికి పట్టించండి. ఎండ వేడి నుంచి తక్షణ ఉపశమనం కలుగుతుంది. ట్యానే కాదు, ఎండ కారణంగా ఏర్పడే ఎర్రదనం, అలర్జీలకూ ఇది మెరుగైన ఔషధం. ▫


# పసితనంలోనే విలువలు..

పదిమంది ఉపాధ్యాయులు ఒక ఆచార్యునితో సమానం. వంద మంది ఆచార్యులు ఒక తండ్రితో సమానం, ఒక తల్లి వెయ్యిమంది తండ్రులతో సమానం! అంటోంది మనుస్మృతి. శ్రీరామచంద్రుడి నుంచి శ్రీరామకృష్ణ పరమహంస వరకు సద్గుణాలన్నింటినీ తల్లి నుంచే సంప్రాప్తించుకున్న వారే 'కౌసల్య నందన రామా' అనగానే శ్రీరాముడు పొంగిపోతాడని భక్తుల భావన. సత్యనిష్ఠ, ధార్మిక భావనలు, సరళ జీవనం తన తల్లి పెట్టిన భిక్ష అనేవారు రామకృష్ణ పరమహంస. ఛత్రపతి శివాజీకి తన ఒడిలోనే పాఠాలు నేర్పి మహావీరునిగాతీర్చిదిద్దింది తల్లి జిజియాబాయి. మహాభారతంలో కుంతీదేవి ఆదర్శ మాతృమూర్తి. పాండవులు ధర్మాశ్రయులు కావటానికి, శ్రీకృష్ణ, భక్తులై రక్షణ పొందడానికీ ఆ సాధ్వీమణే కారణం. ఎందరో మహర్షులు తమ తండ్రుల జ్ఞాన బోధతో తపోధనులయ్యారు. ఉదాహరణకు పరాశరుని శిక్షణలో వ్యాసుడు, ఆ వ్యాసుడి శిక్షణలో శుకుడుబ్రహ్మజ్ఞాను లయ్యారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమబాటలో నడిచేలా చిన్నతనం నుంచే శిక్షణనివ్వాలని మన మహర్షులు సూచించారు. రామాయణ, భారత, భాగవతాల్లోని మహాత్ముల జీవిత గాథల్ని వారికి బోధిస్తూ ఉండాలని హితవు పలికారు. నాలుగేళ్ల వరకు పిల్లల్ని ఆలాన పాలన చూసుకోవాలి. పదహారేళ్ల వయసులో ఉన్నతమైన పౌరులుగా ఎదిగే విద్యను నేర్పాలి' అని ప్రబోధించారు. మొక్కై వంగనిది మానై వంగునా? అన్నది మనకందరికీ తెలిసిన సామెతే! చిన్నారుల శీల నిర్మాణంలో ప్రధాన పాత్ర కన్నవారిదే. నేటి ఆధునిక సమాజంలో పిల్లలు పెంపానికి తల్లిదండ్రులు కేటాయించగలిగే సమయాన్ని పెంచాలి. దశరథుని పెంపకంలో రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు సర్వశాస్త్ర పారంగతులయ్యారు. తండ్రి సత్యధర్మపాలనే కొడుకులకూ సంక్రమించింది. అరణ్యవాసం సందర్భంగా అనసూయాదేవి రాముణ్ని 'నీకు సీత అంటే ఎందుకంత ప్రేమ?' అని అడిగింది. అప్పుడు రాముడు 'నా తండ్రి దశరథ మహారాజు ఎంపిక చేసిన వధువు కాబట్టి' అన్నాడు. అలాగే కోసల రాజ్య ప్రజలు కూడా నిండుసభలో దశరథ మహారాజు పెంపకంపై అభినందనల జల్లు కురిపించారు. ▫

ఆధ్యాత్మికం

# స్నేహం కోసం..

**కొంత మంది స్నేహితుల మధ్య ఉండే స్నేహం చూసిన వారెవరైనా ఆశ్చర్యపోతారు. అటువంటి స్నేహితులు కూడా ఆకస్మాత్తుగా విడి పోవడం అందరినీ విస్మయానికి గురి చేస్తుంది. ఎంతటి స్నేహాన్నైనా కలకాలం నిలుపు కోవలంటే కొన్ని నియమాలను అనుసరించాల్సిందే అంటున్నారు నిపుణులు.**



రోజూ ఎందరినో కలుస్తుంటాం. అయితే కొందరే మనసుకు దగ్గరవుతారు. వారితో స్నేహం చేయాలనిపిస్తుంది. అలాగే అవతలివారు కూడా మనకు స్నేహహస్తాన్ని చాపాలంటే మనవంతు కృషి తప్పనిసరి. ముఖ్యంగా వారెదుట అసమానతలు ప్రదర్శించకూడదు. ఎదుటివారి అభిప్రాయాలను గౌరవిస్తూ.. వారు చెప్పేది పూర్తిగా వినడంతోపాటు మన ఆలోచనలను కూడా పంచుకోవాలి. మనసులో ఉన్నదే మాట్లాడితే మరీ మంచిది. ఎలాగైనా వాళ్లతో స్నేహం చేయాలనుకుని అబద్ధాలు చెప్పడం మంచిది కాదు. కాలక్రమేణా మన గురించి నిజం తెలిస్తే అప్పటివరకు ఏర్పడిన స్నేహం చెడిపోయే ప్రమాదం ఉంది.

**నిలుపుకోవాలి....** స్నేహాన్ని పొందడం ఎంత ముఖ్యమో.. దాన్ని నిలుపుకోవడం అంతకన్నా ముఖ్యమని తెలుసుకోవాలి. లేదంటే మంచి స్నేహాన్ని కోల్పోయిన వాళ్లమవుతాం. ఎదుటివారు మనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకూడదు. వ్యక్తిగత గౌరవాన్ని పాటిస్తూ.. ఎదుటివాళ్ల మర్యాదను కాపాడాలి. స్నేహితులు అవమానపిడితే ఆ వేదన మనది కూడా అయితేనే మంచి స్నేహమవుతుంది. అలాగే.. సరదాగానే కదా.. అంటూ నలుగురెదుట వారిని తక్కువ చేసి మాట్లాడితే మనోభావాలను కించపరిచిన వాళ్లమవుతాం. అంతేకాదు.. మన స్నేహాన్ని మనమే తక్కువ చేసుకున్నట్లే. ఆలోచనలు, భావాలు వేరువేరుగా ఉన్నాకూడా పరస్పరం గౌరవించుకొంటే చాలు. ఆ స్నేహాన్ని కలకాలం నిలుపుకోవచ్చు.

**కష్టం వస్తే..** సమస్యలొచ్చినప్పుడు నేనున్నాననే భరోసా స్నేహంలో ఉండాలి. వారి కష్టాన్ని పరిష్కరించడంలో కుడి భుజంగా మారగలగాలి. మనతో ఉన్నప్పుడు ఎటువంటి ఇబ్బందినైనా దాటగలమనే నమ్మకాన్ని వారికి అందించాలి. ప్రతిఫలాన్ని ఎదురుచూడకుండా, చేయందించామంటే చాలు. ఆ స్నేహం మనకు జీవితాంతం తోడుంటుంది. ▫

### మహిళల క్రాస్ కంట్రీ స్కీయింగ్‌లో..

# భవానికి కాంస్యం



**న్యూఢిల్లీ:** మహిళల క్రాస్ కంట్రీ స్కీయింగ్‌లో భారత్‌కు తొలిసారి టీఎస్ భవాని కాంస్య పతకం సాధించింది. ఎఫ్ఐఎస్ గుర్తింపు పొందిన ఈవెంట్‌లో భవాని భారతదేశపు మొట్ట మొదటి మహిళల క్రాస్ కంట్రీ స్కీయింగ్ పతకాన్ని గెలుచుకుంది. చిలీలోని కొరాల్కోలో జరిగిన మహిళల 5 కి.మీ ఇంటర్వెల్ స్టార్ట్ ఫ్రీ రేసులో పోటీ పడిన భవాని 21:04.9 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఐదుగురు అథ్లెట్లు పాల్గొన్న ఈ పోటీలో, భవానీ బంగారు పతక విజేత మెక్సికోకు చెందిన రెజీనా మార్టినెజ్ లోరెంజో కంటే 3 నిమిషాల 51 సెకన్లు వెనుకబడి ఉంది. ఆమె 17:13.6 సెకన్ల సమయంతో పరుగును పూర్తి చేసింది. చిలీకి చెందిన మార్టినా ఫ్లోర్స్ 17:16.4 సెకన్లతో రజత పతకాన్ని గెలుచుకుంది.

## చైనా మాస్టర్స్‌లో 16వ రౌండ్‌లోకి సింధు

### ఆయుష్ శెట్టి నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** చైనా మాస్టర్స్ 2025లో ప్రపంచ ర్యాంకర్ పివి సింధు 16వ రౌండ్ లోకి అడుగుపెట్టగా, రైజింగ్ స్టార్ ఆయుష్ శెట్టి నిష్క్రమించాడు. మంగళవారం జరిగిన చైనా ఓపెన్ సూపర్ 750లో భారత షట్లర్లు మిశ్రమ ఆరంభాన్ని పొందారు. సింధు తదుపరి రౌండ్‌లోకి ముందుకు సాగగా, ఆయుష్ తీవ్రంగా పోరాడిన ప్రారంభ రౌండ్ పోరులో ఓడిపోయాడు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, 2019 ప్రపంచ ఛాంపియన్, ప్రస్తుతం ప్రపంచ ర్యాంక్‌లో 16వ స్థానంలో ఉన్న సింధు డెన్మార్క్‌కు చెందిన జూలీ దావల్ జాకోబ్‌సెన్‌ను కేవలం 27 నిమిషాల్లోనే ఓడించి, 21-5, 21-10 తేడాతో గెలిచింది. హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500లో సింధు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన 10 రోజుల లోపే ఈ ఫలితం వచ్చింది. సింధు దూకుడుగా ఆడటం, నెట్ వద్ద నియంత్రణ సాధించడం వల్ల జాకోబ్సెన్ ఇబ్బంది పడ్డాడు, మొదటి ర్యాలీ నుండే సింధు తన అధిక్యాన్ని చాటింది. అలాగే భారత్‌కే చెందిన ఆయుష్ శెట్టి, చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 5వ ర్యాంకింగ్ చౌ టియెన్‌చెన్‌తో జరిగిన పోటీలో కఠిన పరీక్షను ఎదుర్కొన్నాడు. మాజీ ప్రపంచ నంబర్ 2 ను మూడు ఆటలకు నెట్టి, కోర్ట్ 3 లో 19-21, 21-12, 16-21 తేడాతో ఓడిపోయాడు. రెండవ గేమ్‌లో ఆయుష్ తన దూకుడు ఆటతో ఆకట్టుకున్నాడు, కానీ చౌ అనుభవం మరియు ఒత్తిడిలో నిర్ణయాత్మక ఆటలో పరాజయం చెందాడు.



### మహిళల ర్యాంకింగ్స్‌లో..

# స్మృతి నం.1



**న్యూఢిల్లీ:** టీం ఇండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన తాజా ఐసీసీ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1తో అగ్రస్థానాన్ని తిరిగి కైవసం చేసుకుంది. ఈ మేరకు మంగళవారం ఐసీసీ ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా న్యూ చండీగఢ్‌లో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియాతో భారత్ తలపడగా, స్మృతి 63 బంతుల్లో 58 పరుగులు చేసి ఏడు రేటింగ్ పాయింట్లను అందుకుని ఇప్పుడు ఇంగ్లాండ్ కెప్టెన్ కంటే నాలుగు పాయింట్లు ముందంజలో ఉంది. అలాగే ఓపెనింగ్ పార్టనర్ ప్రతీకా రావల్ తన అర్ధ సెంచరీ తర్వాత కీలకమైన పాయింట్లు పొంది నాలుగు స్థానాలు ఎగబాకి 42వ ర్యాంక్‌కు చేరుకోగా, హార్లీన్ డియోల్ ఆస్ట్రేలియాపై 54 పరుగులతో రాణించి 43వ స్థానానికి ఎగబాకింది. ఆతిథ్య భారత్‌పై 8 వికెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత, అనేక మంది ఆస్ట్రేలియన్ బ్యాట్స్‌మెన్ కూడా కొన్ని రేటింగ్ పాయింట్లను సంపాదించారు. సిరీస్ ఓపెనర్‌లో 74 బంతుల్లో 77 పరుగులు చేసిన బెత్ మూనీ ఎనిమిదో స్థానం నుండి ఐదో స్థానానికి ఎగబాకింది. అన్నాబెల్ సదర్లాండ్ (నాలుగు స్థానాలు ఎగబాకి) మరియు ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (13 స్థానాలు ఎగబాకి) సంయుక్తంగా 25వ ర్యాంకును పంచుకున్నారు.

### డబ్ల్యుటిటి ఫీడర్ ఇస్తాంబుల్‌లో

# ఓడిన జ్ఞానశేఖరన్, మనికా

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటీటీ ఫీడర్ ఇస్తాంబుల్-2025లో భారత్ ప్లేయర్లు సత్యన్ జ్ఞానశేఖరన్ ఓటమి చెంది రన్నరప్‌తో సరిపెట్టాడు. ఇక మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో మానికా బాత్రా సైతం పరాజయం పాలైంది. ఇస్తాంబుల్‌లో మంగళవారం జరిగిన ఈ ఫీడర్‌లో జ్ఞానశేఖరన్ రన్నరప్‌గా నిలిచాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో వ్లాదిమిర్ సిడోరెంకోతో జరిగిన మ్యాచ్‌లో జ్ఞానశేఖరన్ 9-11, 8-11, 9-11 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయి పోడియంలో రెండవ స్థానంలో నిలిచాడు. చరిత్రలో అత్యధిక ర్యాంక్ పొందిన భారత పురుషుల సింగిల్స్ ప్యాడ్లర్‌గా రికార్డు సృష్టించిన అతడు దిగువ ర్యాంక్‌లో ఉన్న సిడోరెంకో చేతిలో కేవలం 23 నిమిషాల్లోనే ఓడిపోయాడు. మొదటి రౌండ్ బై పొందిన తర్వాత అతను తన తోటి భారతీయుడు దివ్యాంష్ శ్రీవాస్తవపై 3-0 తేడాతో విజయం సాధించి రెండవ రౌండ్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. జ్ఞానశేఖరన్ ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌లో రారెస్ సిపోస్‌ను, సెమీ ఫైనల్స్‌లో క్వాలిఫైయర్ ఎవ్జెనీ టిఖోనోవ్‌ను ఓడించి టైటిల్ పోరులో అడుగుపెట్టాడు. కాగా మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ మానికా బాత్రా సెమీఫైనల్లో ఓడిపోయింది. ఆమె టర్కీకి చెందిన సిబెల్ అల్టింకాయ చేతిలో 6-11, 12-10, 7-11, 11-13 తేడాతో ఓడిపోయింది. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో, భారత జాతీయ ఛాంపియన్ జోడీ ఆకాష్ పాల్-పోయ్మంటీ బైస్య సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన పాంగ్ కోయెన్-సెర్ లిన్ కియాన్ చేతిలో 12-14, 8-11, 4-11 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయారు.









# సన్‌రైజర్స్ స్టార్స్ ఔట్

### నలుగురు ప్లేయర్లకు గుడ్ బై

**న్యూఢిల్లీ:** వచ్చే ఐపీఎల్ సీజన్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇప్పటి నుంచే రెడీ అవుతోంది. ఇందుకు గాను ఐపీఎల్-2026 మినీ వేలానికి ముందు పేలవ ప్రదర్శన చేసిన స్టార్ ప్లేయర్లతో సహా నలుగురిని బయటకు పంపి జట్టును బలోపేతం చేసేందుకు హైదరాబాద్ ఫ్రాంఛైజీ సిద్ధమవుతోంది. 2024 సీజన్‌లో రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ ఈ సీజన్‌లో మాత్రం ఆశించినస్థాయిలో రాణించలేదు. హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, మహమ్మద్ షమీతో పాటు, ఇతర స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకోలేకపోయారు. ఫలితంగా పాయింట్ల పట్టికలో హైదరాబాద్ ఆరోస్థానానికి పరిమితమైంది. దీంతో మినీ వేలానికి ముందు అటువంటి వారిని రిలీజ్ చేసి పర్స్ పెంచుకోవాలని చూస్తోంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.11.40 కోట్లకు కొనుగోలు చేసింది. తొలి మ్యాచ్‌లోనే సెంచరీతో దుమ్ములేపిన ఇషాన్ ఆ తర్వాత భారీ ఇన్నింగ్స్‌లు ఆడడంలో విఫలమయ్యాడు. 119 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 29.10 సగటు, 137.64 స్ట్రైక్ రేట్‌తో 2,998 పరుగులు చేశాడు. హైదరాబాద్ తరుపున 14 మ్యాచ్‌ల్లో 354 పరుగులు చేశాడు. వచ్చే వేలానికి ముందు ఇషాన్‌ను విడుదల చేయనుంది. అలాగే రూ.23 కోట్లకు హెన్రిచ్ క్లాసెన్‌ను సన్‌రైజర్స్ రిటైన్ చేసుకుంది. ఈ సీజన్‌లో క్లాసెన్ పెద్దగా ఆకట్టులేకపోయాడు. 14 మ్యాచ్‌ల్లో 487 పరుగులు చేశాడు. ఇప్పటివరకు 49 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 1480 పరుగులు చేశాడు. సగటు 40.00, స్ట్రైక్ రేట్ 169.72. భారీ ధర, పర్ఫామెన్స్‌ను దృష్టిలో ఉంచుకుని క్లాసెన్‌ను విడుదల చేసి మళ్లీ వేలంలో తక్కువ ధరకు తీసుకునే ఆలోచన చేస్తోంది. ఇక టీమిండియా స్టార్ బౌలర్ హమ్మద్ షమీని మెగా వేలంలో రూ.10 కోట్లకు హైదరాబాద్ దక్కించుకుంది. అయితే షమీ అంచనాలను అందులేకపోయాడు. 11.23 ఎకానమీతో పరుగులు ఇచ్చి కేవలం 6 వికెట్లు మాత్రమే తీశాడు. షమీ 119 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 133 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటివరకు ఎకానమీ రేటు 8.63 గా ఉంది. భారీ ధర కారణంగా మినీ వేలానికి ముందు టీమ్ నుంచి రిలీజ్ చేసే అవకాశం ఉంది. ఇక స్పిన్నర్ రాహుల్ చాహర్‌ను మెగా వేలంలో రూ.3.20 కోట్లు ఖర్చు చేసింది. ఈ సీజన్‌లో కేవలం ఒకే మ్యాచ్ ఆడే అవకాశం రాగా, అందులోనూ ఒకే ఓవర్ బౌలింగ్ చేశాడు. చాహర్ ఇప్పటివరకు 79 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 7.72 ఎకానమీతో 75 వికెట్లు పడగొట్టాడు. మినీ వేలానికి ముందుకు రాహుల్‌ను టీమ్ నుంచి రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి.

### పసిడి తనఖా రుణాలు

# రూ.2.94 లక్షలకోట్లు

### ఎంఎఫ్ఐ రుణాలకంటే ఇదే బెటర్‌అంటున్న కస్టమర్లు



**ముంబయి, సెప్టెంబరు 16:** దేశంలో అల్పాదాయ వర్గాలు ఇప్పటివరకూ తమకు అత్యవసరాలకు అనువుగా ఉండేసూక్ష్మరుణ సంస్థలను కాదనిఇటీవలికాలంలో బంగారం తాకట్టురుణాలకే మొగ్గుచూపిస్తున్నారు. మైక్రోఫైనాన్స్ సంస్థలు ఇటీవలికాలంలో ఆంక్షలు పెంచడం వడ్డీలు కూడా ఎక్కువ కావడంతో రూపాయి వడ్డీకే బంగారం రుణాలు లభిస్తుండటం,దీనికితోడు బంగారంతాకట్టుపై ఇచ్చే రుణమొత్తం కూడా విలువల ఆధారంగాపెరుగుతుండటంతో చిననకుటుంబాలు బంగారంరుణాలపైనే ఎక్కువ ఆసక్తిచూపిస్తున్నాయి. రిజర్వుబ్యాంకు గణాంకాలను చూస్తే పసిడి తాకట్టు రుణాలు 122శాతం పెరిగాయి. అదే మైక్రోఫైనాన్స్ రుణాలు 16.5శాతం పడిపోయాయి. కొద్దికాలం క్రితం వరకూ అరక్షిత రుణాలపైనే ఆధారపడిన కస్టమర్లు ఇపుడు బంగారం రుణాలవైపు వస్తున్నారని సౌత్‌ఇండియన్‌బ్యాంకు సిజిఎం సంచయ్ సిన్హా వెల్లడించారు. ఈ ఆర్థికసంవత్సరం ఆరంభంలోనే ఎఫ్‌ఎంపై రంగం బకాయిలను అరికట్టేందుకు మూడంచెల వ్యూహం అనురించింది. ఒకటికంటే ఎక్కువ మంది వద్ద రుణాలు తీసుకునేందుకు వీలులేకుండా కట్టడిచేసింది. బంగారం తనఖా రుణాలు జులై నాటికి 2.94 లక్షలకోట్లకు పెరిగాయి. వార్షిక పద్ధతిలోచూస్తే 122శాతంపెరిగాయి. అలాగే క్రెడిట్‌కార్డు రుణాలుకూడా ఆరుశాతంపెరిగి 2.91 లక్షలకోట్లకు చేరాయి. ఇక వ్యక్తిగత రుణాలుకూడా 8శాతంపెరిగి 15.36 లక్షల కోట్లరూపాయలకు పెరిగినట్లు ఆర్‌బిఐ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ఇక సూక్ష్మరుణసంస్థల స్థిరాస్థిప్రమాణాలు 16.5శాతం తగ్గి 1.34 లక్షలకోట్లకు పడిపోయాయి. బంగారంధరలు కూడా 44.14శాతం పెరిగాయి. పదిగ్రాము లధరలు 1,13,800రూపాయలుగా చెలామణి అయింది. 2024 డిసెంబరులో 78,950 రూపాయలున్న ధరలు గణనీయంగా లక్షా 1.14 లక్షలకు పెరిగాయి. బంగారం తాకట్టురుణాలు ఎక్కువగా పశ్చి, ఉత్తర, తూర్పుప్రాంతాల్లో పెరిగాయి.

### నాలుగువేల డాలర్లకు చేరువలో

# ఔన్స్ బంగారం!



**చెన్నై, సెప్టెంబరు 16:** బంగారంధరలు మంగళవారం రికార్డుస్థాయికి పెరిగాయి. అమెరికా ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లలో కోత విధించగలదన్న అంచనాలు అమెరికా డాలర్ క్షీణించడం వంటివాటితో బంగారం ఒక్కటే సురక్షిత మార్గంగా ఇన్వెస్టర్లు ఎంచుకోవడంతో ధరలు ఒక్కసారిగాపెరిగాయి అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్‌లో ఔన్స్ బంగారం ధరలు 3697.70 డాలర్లకు పెరిగాయి. చివరకు ట్రేడింగ్ చివరిలో 3683.28డాలర్లుగా మారాయి. అమెరికా పసడిడి ఫ్యూచర్స్ డిసెంబరు నెల పంపిణీకి గాను 3720.10గా ముగిసాయి. అమెరికా డాలర్‌సూచీ మరింతగా క్షీణించి రెండునెలల కనిష్టానికి చేరింది. దీనితో బంగారం ఒక్కటే ఇన్వెస్టర్లకు సురక్షిత పెట్టుబడి మార్గంగా నిలిచింది. భారత్‌లో బంగారందరలు సరికొత్త గరిష్టాలను తాకాయి. ఎంసిఎక్స్‌లో అక్టోబరు ఫ్యూచర్స్ కాంట్రాక్టుల్లో 10 గ్రాములు రూ.1,10,548గా నడిచింది. స్పాట్ గోల్డ్ ధరలు మేజర్ నగరాల్లో పదిగ్రాములు 1,10,260 రూపాయలనుంచి 1,12,150రూపాయలవరకూ కొనసాగాయి. అయితే స్థానికమార్కెట్ల పరిస్థితులు, బంగారం స్వచ్ఛత ఆధారంగా ఈధరలు కొనసాగాయి. ఫెడ్‌రిజర్వు కనీసం 25 బేసిస్ పాయింట్లు కోత పెడుతుందన్న అంచనాలు మార్కెట్‌లో బలంగా వీస్తున్నాయి. 2026లో మరికొంత రేట్‌కట్‌లు ఉండవచ్చని ఆర్థికరంగ నిపుణులు అంచనావేసారు.

# ఫెడ్‌రిజర్వు ఫండ్‌రేట్లపై ట్రేడర్ల ఆసక్తి

### లాభాల్లో దూసుకువెళ్లిన సెన్సెక్స్ నిఫ్టీ




**ముంబయి, సెప్టెంబరు 16:** దేశీయ ఈక్విటీ మార్కెట్ల సూచీలు గరిష్టంగాపెరిగాయి. ట్రేడింగ్ చివరి సమయానికి సెన్సెక్స్ 594.95 పాయింట్లు పెరిగి 82,380.69 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ కూడా 169.90 పాయింట్లు లాభపడి 25,239.10 పాయింట్లవద్ద ముగిసింది. కోటక్ మహీంద్ర బ్యాంకు సెన్సెక్స్‌లో టాప్ గెయినర్‌గా నిలిచింది. 264శాతం లాభపడి 2023గా షేర్లు నడిచాయి. ఎంఅండ్ఎం 2.44శాతం ఎల్అండ్‌టి 2.26శాతం, మారుతిసుజుకిలు 1.99శాతం భారతి ఎయిర్‌టెల్ 1.88శాతంచొప్పున పెరిగాయి. అలాగే టాటాస్టీల్‌కూడా 1.68శాతంపెరిగింది.

ఎల్అండ్‌టి, భారతి ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రబ్యాంకు, ఎంఅండ్ఎం, యాక్సిస్‌బ్యాంకు వంటి ఐదుస్టాక్స్ సెన్సెక్స్ భారీ పెరుగుదలకు దోహదంచేసాయి. బిఎస్ఇ ఆటో సూచి 1.43శాతం లాభపడింది. బిఎస్ఇ టెలికామ్‌సూచీ 1.50శాతం పెరిగింది. మొత్తంగా 4309స్టాక్స్‌ట్రేడ్ అయితే 2540 స్టాక్స్ లాభాల్లో ముగిసాయి. 1577 స్టాక్స్ దిగువస్థాయిలోముగిస్తే 192 స్టాక్స్ స్థిరంగా కొనసాగాయి. 155 స్టాక్స్ 52 వారాల గరిష్టస్థాయిలో నడిస్తే మరో 55 ఇతర స్టాక్స్ 52 వారాల కనిష్టస్థాయిని నమోదుచేసాయి. 290 స్టాక్స్ ఈరోజు ఎగువ సర్క్యూట్‌లో ముగిసాయి. 131 ఇతర స్టాక్స్ దిగు వసర్క్యూట్స్‌లోనే చతికిలపడ్డాయి.

బిఎస్ఇ సెన్సెక్స్‌లో మారుతిసుజుకి 52 వారాల గరిష్టంగా అంటే 15,588.95కి చేరింది. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ వినోద్‌నాయర్ విశ్లేషిస్తూ రానున్న ఫెడ్‌రిజర్వు పాలసీ విదానాలపై ఇన్వెస్టర్లు ఎక్కువ దృష్టిసారించారు. మరోపక్క భారత్ అమెరికా వాణిజ్య చర్చలు ప్రారంభం అయ్యాయి. ఈ ప్రభావంకూడా మంగళవారం స్టాక్స్‌పై చూపించింది. ఆటోమొబైల్, వినియోగరంగ స్టాక్స్ భారీగా పెరిగాయి. కొత్త జిఎస్టీరేట్లు,

పండుగసీజన్ డిమాండ్ అంచనాలతో ఈరంగాలు మరింత దూసుకువెళ్లాయి. దేశీయంగా స్థూల ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండటం, రాబడులుకూడా పెరుగుతుండటంతో ప్రస్తుత కంపెనీల విలువలు రిస్కులను అధిగమించేస్థాయిలో ఉండటంతో మార్కెట్లకు ఈ పరిణామాలు కలిసొచ్చినట్లు జియోజిత్ ప్రతినిధి తెలిపారు.

### ఆసియా మార్కెట్లలోనూ

# ఇండో-యుఎస్ వాణిజ్య చర్చలే!



### లాభాల్లో దూసుకువెళుతున్న ఆసియా మార్కెట్లు

**చెన్నై, సెప్టెంబరు 16:** భారత్, ఇతర ఆసియా మార్కెట్లు సానుకూల దోరణుల్లో ముందుకు సాగుతున్నాయి. అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందాల చర్చలు ఓ కొలిక్కిరాగలవన్న అంచనాలతోపాటు ప్రపంచ ద్రవ్యపరపతి విధానం సరళీకృతం అవుతుందన్న అంచనాలు మార్కెట్లకు బలాన్నిఇచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ ఉదయానికే 300 పాయింట్లు పెరిగి 82 వేలస్థాయిని నమోదుచేసింది. అలాగే ఎన్ఎస్ఇ నిఫ్టీ సూచీ కూడా 25,150 పాయిట్లకు చేరింది. ఆటోసెక్టార్ అన్నింటికంటే లాభాల్లో దూసుకువెళ్లింది. టాటామోటార్స్, హీరోమోటోకార్ప్ మంచి పనితీరునుచూపించాయి. భారత్‌రూపాయి 12 పైసలు లాభపడింది. డాలర్ 88.04 రూపాయలకు చెలామణి అయింది.

మార్కెట్లన్నింటిలోనూ ట్రేడర్లు ఇండోయుఎస్ వాణిజ్యచర్చలపై ఎంతోనమ్మకం చూపించారు. ఈ చర్చలవల్లనే వాణిజ్యసంబంధాలు పెరుగుతాయన్న భావన పెరిగింది. హాంకాంగ్‌లో హ్యాంగ్‌సెంగ్ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌కు అనుగుణంగా గరిష్టానికి వెళుతోంది. జపాన్‌నిక్కీ 225 కూడా ఎగువస్థాయికే వెళుతోంది. పటిష్టమైన కార్పొరేట్ రాబడులు మంచి ఫలితాలిచ్చాయి. చైనాలోని షాంఘై కాంపోజిట్ స్వల్పంగా లాభాల్లో ముగిసింది. ఇన్వెస్టర్లు స్థానిక ప్రభుత్వ విధివిధానాలపై ఎక్కువ ఫోకస్ పెంచారు. ఇక దక్షిణకొరియా కోస్పి కూడా పెరిగింది. టెక్నాలజీ స్టాక్స్‌కకు ఎక్కువ విదేశీ పెట్టుబడులు వచ్చాయి. తైవాన్ తాయ్‌ఎక్స్ కూడా గరిష్టస్థాయిలో నడిచింది. సెమికండక్టర్ రంగంలో భారీ ర్యాలీని నమోదుచేసింది. సింగపూర్ స్ట్రెయిట్‌టైమ్స్ సూచీ కూడా ఆర్థికరంగం,పారిశ్రామిక స్టాక్స్‌పరంగా ముందుకు దూసుకుపోయింది. ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్200 కూడా పెరిగింది. మెటీరియల్స్, ఇంధనరంగ స్టాక్స్ ఇక్కడ సూచీలకు మద్దతుగా నిలిచాయి. ఇక దేశీయ స్టాక్‌సూచీలపరంగా భారత్‌అమెరికా వాణిజ్య చర్చలు సానుకూల ఫలితాల్లోనే ఉంటాయని ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. అమెరికా ఫెడ్‌రిజర్వు వచ్చే సమీక్షలో ఫండ్‌రేట్‌కట్ ఉంటుందని, దీనివల్ల ప్రపంచస్థాయిలో ద్రవ్యలభ్యతపెరుగుతుందని ఈక్విటీలకు మంచి అండ లభిస్తుందన్న అంచనాలున్నాయి.

అయితే మార్కెట్ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయని దీనివల్ల ఇన్వెస్టర్లు, ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలనిసూచించారు.



### జీఎస్టీ నేపథ్యంలో మందులపై

# రీ లేబులింగ్ అవసరంలేదు!

### జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 16:** ఫార్మాస్యూటికల్ రంగానికి కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. కొన్ని వైద్య పరికరాలపై జీఎస్టీ రేట్లను ఇటీవల తగ్గించిన నేపథ్యంలో, మార్కెట్లో ఇప్పటికే ఉన్న మందుల ప్యాకెట్లపై కొత్త ధరల స్టిక్కర్లను తప్పనిసరిగా అంటించాలన్న నిబంధనను రద్దు చేసింది. ఈనెల 22లోపు మార్కెట్లోకి విడుదలైన స్టాక్‌ను వెనక్కి పిలవడం లేదా రీ లేబులింగ్ చేయడం తప్పనిసరి కాదని ఫార్మాస్యూటికల్స్ విభాగం స్పష్టం చేసింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో వైద్య పరికరాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. ఈ మార్పు నేపథ్యంలో, మార్కెట్లో ఉన్న పాత స్టాక్‌ను రీ లేబుల్ చేయడం ఆచరణ సాధ్యం కాదని, ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని ఫార్మా పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఒక కీలక ప్రకటన జారీ చేసింది. పాత స్టాక్‌ను వెనక్కి పిలవాల్సిన అవసరం లేకుండా, సవరించిన ధరలతో కూడిన జాబితాను కంపెనీలు జారీ చేస్తే సరిపోతుందని తెలిపింది. ఈ కొత్త ధరల జాబితాను డీలర్లు, రిటైలర్లతో పాటు రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లకు, ప్రభుత్వానికి అందించాలని సూచించింది. రిటైలర్లు తమ వద్ద ఆ జాబితాను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించింది. దీనివల్ల మందుల సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండవని, రోగులకు మందుల కొరత ఏర్పడదని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్టీలో మరిన్ని సంస్కరణలు చేపట్టాలని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ డివైస్ ఇండస్ట్రీ (ఏఐఎంఈడీ) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేసింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రిఫండ్లలో ఉన్న పరిమితులు, ఇన్వర్టెడ్ డ్యూటీ సమస్యలను పరిష్కరించాలని కోరింది. సర్వీసులు, క్యాపిటల్ గూడ్స్‌పై చెల్లించిన ఐటీసీకి కూడా రిఫండ్ అనుమతించాలని, ఇన్‌పుట్స్‌పై ఒకే విధంగా 5 శాతం జీఎస్టీ విధించాలని సూచించింది.

## క్రిబ్‌కో చైర్మన్‌గా వల్లభనేని సుధాకర్‌చౌదరి ఏకగ్రీవం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** క్రిషక్‌భారతి కోఆపరేటివ్ లిమిటెడ్ సొసైటీకి కొత్త ఛైర్మన్‌గా ప్రముఖ వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్‌చౌదరి ఎన్నికయ్యారు. మొన్నటివరకూ వైస్ ఛైర్మన్‌గా ఉన్న సుధాకర్‌చౌదరి క్రిబ్కో ఆఫీసు బేరర్ల సమావేశంలో ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డాక్టర్ చంద్రపాల్‌సింగ్ యాదవ్ వైస్‌ఛైర్మన్‌పదవిని సాధించారు. ఈ రెండు ఉన్నత పదవులకు ఒకే నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికలకు ఏకగ్రీవం అయ్యాయి. కొత్త ఛైర్మన్ సుధాకర్‌చౌదరికి ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఎరువులు, వ్యవసాయ రంగాలను బలోపేతంచేయడంలోసుధాకర్‌చౌదరి, చంద్రపాల్‌సింగ్‌యాదవ్‌లకు అపార అనుభవం ఉంది. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కేంద్రం యుపినుంచి ఇద్దరు మంత్రులు, ఎన్‌సియుఐ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. బోర్డుసభ్యులు ఇద్దరుమంత్రులమద్య చర్చల తర్వాతనే నామినేషన్లు దాఖలయ్యాయి. కేంద్ర సహకారశాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్, యుపి సహకారమంత్రిజెపిఎస్ రాథోడ్ రెండునామినేషన్లకు ఆమోదం తెలిపారు. వైస్‌ఛైర్మన్‌పదవికి గుజరాత్‌కు చెందిన మగన్‌భాయ్‌పటేల్, బిపిన్‌పటేల్‌లపేర్లుపరిశీలనకు వచ్చాయి. అయితే బిపిన్ చివరికి చంద్రపాల్‌యాదవ్‌ను సిఫారసుచేసారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.